ఆదివారం 16 నవంబర్ 2025 https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్ట్

- ముందుకొచ్చిన ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా
- సీఎం చంద్రబాబు సమక్షంలో కుదిరిన ఎంఓయూ

3





# సాగర తీరాన ఎంఓయూల సునామీ

# పెట్టుబడుల పండుగ... ఉద్యోగాల వెల్లువ

- ఫలించిన సీఎం చంద్రబాబు కృషి... భారీ పెట్టుబడులతో ప్రభుత్వం ఖుషీ
- విశాఖ సమ్మిట్ బిగ్ హిట్
- అంచనాలకు మించి తరలి వచ్చిన పారిశ్రామిక వేత్తలు
- 3 రోజుల్లో రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు, 613 ఎంఓయూలు
- 1 గిగా వాట్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయెన్స్
- పెట్టుబడులను రాబట్టడంలో ముందంజలో "పవర్"
- 12 రంగాల్లో భారీగా పెట్టుబడులు
- సీఎం సమక్షంలో రూ.7,63,210 కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు
- మంత్రుల సమక్షంలో రూ.5,62,506 కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు

3



*విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు అద్భుతమైన విజయం సాధించింది. పెట్టుబడి సదస్సు కంటే, ఇది నిజమైన భాగస్వామ్యానికి వేదికగా మారింది, ఇక్కడ ఆలోచనలు పంచుకున్నాం. ఆవిష్కరణల అన్వేషణ జరిగింది. భవిష్యత్ వృద్ధికి బలమైన నెట్‌వర్క్‌లు ఏర్పడ్డాయి. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఎక్కడెక్కడి నుండో ప్రత్యేకంగా ఇతర దేశాల నుండి తరలి వచ్చిన భాగస్వాములందరికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మిమ్మల్ని మరోసారి స్వాగతించడానికి ఎల్లప్పుడూ ఎదురుచూస్తుంటాం. ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంకితభావంతో కృషి చేసిన ప్రభుత్వ అధికారులు, స్పాన్సర్లు, మేనేజర్లు, కళాకారులు, విద్యార్థి వాలంటీర్లు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముఖ్యంగా, ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చి, సదస్సు విజయవంతానికి అన్ని విధాలుగా సహకరించిన విశాఖపట్నం ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ భాగస్వామ్య స్ఫూర్తిని కొనసాగిద్దాం. తదుపరి శిఖరాగ్ర సమావేశాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు కలిసి పనిచేద్దాం.*

**- సీఎం చంద్రబాబు నాయుడు**

## అభివృద్ధికి మోడల్‌గా శ్రీసిటీ

- 6వేల ఎకరాలు భూములిస్తాం
- రాయలసీమలో ఇప్పటికే కియా కార్లు, స్పేస్, డ్రోన్ సిటీలు... ఇప్పుడు రేమాండ్స్
- వివిధ ప్రాజెక్ట్‌ల శంకుస్థాపన, ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.1201 కోట్ల పెట్టుబడులతో రేమాండ్ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన
- శ్రీసిటీలో 5 కంపెనీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- శ్రీసిటీలో ఏర్పాటు చేసే 12 కంపెనీలతో సీఎం సమక్షంలో ఎంఓయూలు కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం

2

## సీఐఐ సమ్మిట్ సూపర్ హిట్

- ఒప్పందాలన్నీ మూడేళ్లలో అన్నీ కార్యరూపం
- హాజరైన 640 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, 4,975 మందికి పైగా పారిశ్రామికవేత్తలు
- ఎనిమిది దేశాలతో 16, 91 మంది ప్రముఖులతో 41 వ్యాపార సమావేశాలు
- రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు
- అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం
- మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు

5



## ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు కలసిరండి

- ఎల్జీ కెమ్ ప్రతినిధులను కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సీఐఐ సదస్సు రెండో రోజు వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం భేటీ
- క్రూయిజ్ టూరిజం, బొబ్బిలి కోటల అభివృద్ధిపైనా చర్చ

4

## ఇంధన రంగంలో సైబర్ రక్షణ అత్యవసరం

- ఏఐ ద్వారా విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గించే చర్యలు
- ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు
- ప్రజలకు లబ్ధి కలిగేలా విద్యుత్ వ్యవస్థలను తీర్చిదిద్దుతాం
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్-CECRC ఏర్పాటుపై ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ఇంధన భద్రత, టెక్నాలజీ వినియోగం కోసం CECRC
- సీఎం చంద్రబాబు సమక్షంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో రాష్ట్రం కీలక ఒప్పందం
- తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తే లక్ష్యం: మంత్రి లోకేష్

6




### కృత్రిమమేథను అనుసరించడం కాదు...

## మనమే ముందుండి నడిపిద్దాం!

- రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్‌తో భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకుందాం
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు
- మార్పును అడ్డుకోవడం కాదు... దాని రూపకల్పనలో భాగస్వాములం అవుదాం
- ఏఐ అవకాశాలపై సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

7



### క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో..

## దేశానికి దిక్సూచిగా నిలుద్దాం

- ఆ సామర్థ్యం ఏపీకి ఉంది
- క్వాంటమ్ మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్ రూపొందించిన రాష్ట్రాల్లో ఏపీ ఒకటి
- కలలు కనడం మాత్రమే కాదు.. వాటిని సాకారం చేస్తాం
- క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సులో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్
- ఆంధ్రప్రదేశ్ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ విడుదల చేసిన మంత్రి

- వివరాలు 8 లో..

## ఇంటికో పారిశ్రామికవేత్త మా లక్ష్యం

- మా దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా ఆర్‌టిఐహెచ్
- ఏపీని భారత్ టెక్ రాజధానిగా మార్చడమే మా ధ్యేయం
- ఆర్‌టిఐహెచ్ పై సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్
- మంత్రి లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూ

- వివరాలు 9 లో..

# అభివృద్ధికి మోడల్‌గా శ్రీసిటీ

- 6వేల ఎకరాలు భూములిస్తాం
- రాయలసీమలో ఇప్పటికే కియా కార్లు, స్పేస్, డ్రోన్ సిటీలు... ఇప్పుడు రేమాండ్స్
- వివిధ ప్రాజెక్ట్‌ల శంకుస్థాపన, ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.1201 కోట్ల పెట్టుబడులతో రేమాండ్ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన
- శ్రీసిటీలో 5 కంపెనీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- శ్రీసిటీలో ఏర్పాటుచేసే 12 కంపెనీలతో సీఎం సమక్షంలో ఎంఓయూలు కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం




విశాఖపట్నం (చైతన్యరథం): శ్రీసిటీకి 6 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అలాగే శ్రీసిటీని అభివృద్ధికి మోడల్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజైన శనివారం నాడు ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భాగస్వామ్య సదస్సు నుంచి రేమాండ్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే శ్రీసిటీలో ఏర్పాటైన 5 కంపెనీలను ప్రారంభించారు. దీంతోపాటే... శ్రీసిటీలో కంపెనీలను ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... భారత దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక టౌన్ షిప్ శ్రీసిటీ అన్నారు. శ్రీసిటీ నుంచే డైకెన్, ఇసుజూ, క్యాడ్బరీ లాంటి ప్రముఖ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నాయి. వివిధ దేశాలకు చెందిన పరిశ్రమలు శ్రీసిటీ పారిశ్రామిక టౌన్ షిప్‌కు రావాలి. ఇప్పటికే బెల్జియం, జపాన్, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు చెందిన హెల్త్ కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, మెడికల్ డివైసెస్ కంపెనీలకు రూ.8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చాం. గడచిన రెండు రోజులుగా రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. మొత్తంగా గడచిన 18 నెలల్లోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. త్వరలోనే శ్రీసిటీకి 6వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తాం. 50దేశాలకు పైగా కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయి. 1.50లక్షల మంది ఉద్యోగులతో శ్రీసిటీ అభివృద్ధికి మోడల్‌గా మారుతుంది. శ్రీసిటీ సమీపంలోనే ఎయిర్ స్ట్రిప్ నిర్మించే దిశగా ఆలోచన చేస్తున్నాం. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు శ్రీసిటీ తరహా మోడల్స్ మరిన్ని రావాల్సి ఉంది. ఒక సంస్థ తయారు చేసిన ఉత్పత్తులు మరో సంస్థకు ముడిసరుకుగా మారతాయి. దీంతో ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఏపీ ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు భారీ ప్రణాళికలు వేస్తున్నాం. 2028 నాటికి శ్రీ సిటీని ఓ బెస్ట్ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

### త్వరలోనే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి

రాయలసీమలో ఇప్పటికే చాలా పరిశ్రమలు వచ్చాయి. 2014-2019 మధ్యకాలంలోనే కియా కార్ల ఫ్యాక్టరీని తెచ్చాం. ఇక రాయలసీమ ప్రాంతంలోనే డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. ఏరోస్పేస్, డిఫెన్సు కారిడార్లు వస్తున్నాయి. ఇప్పుడు అనంతపురం జిల్లాకు రేమాండ్స్ సంస్థ వచ్చింది.. పెట్టబుడులు పెడుతోంది. కియా దగ్గర్లోనే ఆటో కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటును రేమాండ్స్ సంస్థ ఏర్పాటు చేయబోతోంది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని వచ్చే 3-4 ఏళ్లలోనే చేరుకుంటాం. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. 2027 నాటికి ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను ప్రారంభిస్తామని రేమాండ్ హామీ ఇచ్చింది. మొత్తంగా రూ.1201కోట్ల పెట్టుబడులతో మూడు వేర్వేరు పరిశ్రమల ఏర్పాటు ద్వారా 6500 మందికి ప్రత్యక్షం గా ఉద్యోగాలు వస్తాయి. విమానాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా వాటి ఉత్పత్తి కూడా మరింత పెరగాలి. రేమాండ్ గ్రూప్ ఏరోస్పేస్, రక్షణ అవసరాలను తీర్చేలా ఉత్పత్తులు తయారు చేయటం అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు.

### ఏపీలో వేగంగా అనుమతులు... పాలసీలు బాగున్నాయి

రేమాండ్ సంస్థకు చెందిన మూడు కంపెనీల శంకుస్థానల కార్యక్రమంలో పాల్గొన్న రేమాండ్స్ గ్రూప్ ఎండీ గౌతమ్ మైనీ మాట్లాడుతూ... ఏపీలో పరిశ్రమలకు వేగంగా అనుమతులు వస్తున్నాయన్నారు. అలాగే వివిధ పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పాలసీలు బాగున్నాయని గౌతమ్ మైనీ కితాబిచ్చారు. ఏపీ అభివృద్ధిలో భాగంగా తాము ఏరోస్పేస్, డిఫెన్స్ సెక్టార్ రంగాల్లో అడుగు పెట్టామన్నారు. తాము 25 ఏళ్ల నుంచి ఎయిరో స్పేస్ రంగంలో ఉన్నామని.. డిఫెన్స్ రంగంలో కూడా బలోపేతం అయ్యేలా తమ గ్రూప్ ప్రణాళికాబద్ధంగా పని చేస్తుందని గౌతమ్ వివరించారు. భాగస్వామ్య సదస్సు వేదికగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ కె.విజయానంద్, రేమాండ్స్ గ్రూప్ కార్పోరేట్ డెవలప్మెంట్ హెడ్ జతిన్ ఖన్నా, శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### రేమాండ్స్ గ్రూప్ పెట్టుబడులు... శ్రీ సిటీలో మరిన్ని కంపెనీలకు ఎంఓయూలు

రేమాండ్స్ గ్రూప్ రాష్ట్రంలో రూ.1201 కోట్ల పెట్టుబడితో మూడు ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. సిల్వర్ స్పార్క్ అపారెల్ పార్క్, జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, జేకే మైనీ గ్లోబల్ ప్రెసిషన్ లిమిటెడ్ యూనిట్లకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఈ సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. రాప్తాడులో రూ.497 కోట్ల వ్యయంతో సిల్వర్ స్పార్క్ అప్పారెల్ మాన్యుఫాక్చరింగ్ పార్క్, గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్, టెకులోడు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్‌ను రేమాండ్ గ్రూప్ ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా 6500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి. ఇక శ్రీసిటీలో మొత్తంగా 12 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2320 కోట్ల విలువైన పెట్టుబడులపై ఎంఓయూలు కుదిరాయి. శ్రీసిటీలో ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా ఉత్పత్తుల ప్రాజెక్టుల ఏర్పాటుకు ఈ ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంది. ఈ పెట్టుబడుల ద్వారా 12,365 మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశముంది.










చైతన్యరథం

## సాగర తీరాన ఎంఓయూల సునామీ

# పెట్టుబడుల పండుగ... ఉద్యోగాల వెల్లువ



- ఫలించిన సీఎం చంద్రబాబు కృషి... భారీ పెట్టుబడులతో ప్రభుత్వం ఖుషీ
- విశాఖ సమ్మిట్ బిగ్ హిట్
- అంచనాలకు మించి తరలి వచ్చిన పారిశ్రామిక వేత్తలు
- 3 రోజుల్లో రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు, 613 ఎంఓయూలు
- 1 గిగా వాట్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయెన్స్
- పెట్టుబడులను రాబట్టడంలో ముందంజలో "పవర్"
- 12 రంగాల్లో భారీగా పెట్టుబడులు
- సీఎం సమక్షంలో రూ. 7,63,210 కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు
- మంత్రుల సమక్షంలో రూ. 5,62,506 కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు

విశాఖపట్నం(చైతన్యరథం): విశాఖ సాగర తీరానికి పెట్టుబడుల సునామీ వెల్లువెత్తింది. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అంచనాలకు మించిన స్థాయిలో పెట్టుబడులపై ఎంఓయూలు కుదిరాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో ఎంఓయూలు కుదిరాయి... లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి... అదే స్థాయిలో ఉద్యోగాల కల్పనపై కంపెనీల నుంచి హామీలు వచ్చాయి. రెండు రోజుల పాటు జరిగే 30వ భాగస్వామ్య సదస్సులో రెండు రోజలపాటు ఎంఓయూలు కుదుర్చుకోవాలని భావిస్తే... పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు పెద్ద ఎత్తున ముందుకు రావడంతో మూజు రోజులపాటు ఎంఓయూలు కుదుర్చుకోక తప్పని పరిస్థితి ప్రభుత్వానికి ఎదురయింది. మూడు రోజులపాటు కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు కాగా వీటి ద్వారా 16,31,188 ఉద్యోగాలు కల్పించే అవకాశాలు కన్పిస్తున్నాయి. వాస్తవానికి భాగస్వామ్య సదస్సులో భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ముందుగానే అంచనా వేసింది. రెండు రోజుల్లో సుమారుగా రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తే... పారిశ్రామికవేత్తలు తగ్గేదేలా అన్నట్టుగా విశాఖ నగరానికి పోటెత్తారు. ఒప్పందాల విలువ రూ.13లక్షల కోట్లకు పైగా చేరింది. దీంతో ప్రభుత్వ వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది.

### అంచనాలకు మించి 30 శాతానికి మించి అదనం

కూటమి ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని సర్కార్... పారిశ్రామికాభివృద్ధి మీద ఫోకస్ పెట్టింది. ప్రతి 15 రోజులకోసారి కేబినెట్ సమావేశాలు పెట్టుకున్న తరహాలో ఎస్ఐపీబీ సమావేశాలు పెట్టుకుంది. వివిధ సంస్థలకు పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. ఈ క్రమంలో విశాఖ భాగస్వామ్య సదస్సు నాటికే సుమారుగా రూ. 10 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏపీపై పారిశ్రామిక వర్గాల్లో నమ్మకం కలగడానికి ఇదే నిదర్శనం అని ప్రభుత్వం వివిధ సందర్భాల్లో చెబుతూనే ఉంది. దీన్ని మరింతగా కొనసాగించాలని... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చేలా చూడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విశాఖ తీరాన భాగస్వామ్య సదస్సును చేపట్టాలని ప్రణాళిక రూపొందించింది. దీనికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్, యూఏఈ, లండన్ వంటి దేశాల్లో పర్యటించారు. అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. దీంతో భాగస్వామ్య సదస్సు నిర్వహించిన రెండు రోజుల్లో భారీగా పెట్టుబడులు వచ్చేలా ఉన్నాయని ప్రభుత్వం కూడా అంచనాతో ఉంది. అయితే మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ.13 లక్షల కోట్లకు పైగా చేరడంతో అంచనాలను 100శాతం చేరుకోవడంతో పాటు...అదనంగా మరో 30శాతం మేర పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా మార్గం సుగమం అయింది.

### సీఎం సమక్షంలోనే సగానికి పైగా ఒప్పందాలు

మూడు రోజుల పాటు జరిగిన ఒప్పందాల్లో మొత్తంగా రూ.13,25,716 కోట్ల ఒప్పందాలు జరిగితే... అందులో సగానికి పైగా ఒప్పందాలు ముఖ్యమంత్రి సమక్షంలోనే జరిగాయి. మూడు రోజుల పాటు చంద్రబాబు సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ.7,63,210 పెట్టుబడులు. 123 ఎంఓయూల ద్వారా ఈ పెట్టుబడులు వచ్చాయి. మూడు రోజుల పాటు జరిగిన ఎంఓయూల మేళాలో తొలి రోజున రూ.3,65,304 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. రెండో రోజున రూ. 3,49,476 కోట్లు... ఇక చివరి రోజున రూ.48,430 కోట్ల మేర ఎంఓయూలు కుదిరాయి. ఇక ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖలకు చెందిన మంత్రులు కూడా భారీ ఎత్తునే పెట్టుబడులపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మొత్తంగా మంత్రులందరూ కలిసి 490 ఎంఓయూల ద్వారా రూ. 5,62,506 కోట్ల మేర పెట్టుబడులు కుదుర్చుకున్నారు. దీంతో మొత్తం రూ.13,25,716 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి.

### 12 రంగాలు... రూ. 13 లక్షల కోట్లు

మూడు రోజుల పెట్టుబడులపై జరిగిన వరుస సమావేశాలు.. భేటీల్లో అటు ముఖ్యమంత్రి.. ఇటు మంత్రులంతా కలిసి చేసుకున్న ఒప్పందాల ద్వారా 12 రంగాలకు పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడుల్లో టాప్–3లో ఇంధన రంగం, పరిశ్రమలు, మౌలిక వసతుల రంగాలు నిలిచాయి. మొత్తంగా రూ.13.25 లక్షల కోట్ల మేర పెట్టుబడుల్లో అధిక భాగం ఇంధన రంగానికి వచ్చాయి. ఈ రంగంలో రూ. 5,33,351 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తర్వాత పరిశ్రమల రంగానికి రూ. 2,80,384 కోట్లు, మౌలిక వసతుల రంగానికి రూ. 2,01,758 కోట్లు వచ్చాయి. ఇక ఉద్యోగాల కల్పనకు సంబంధించి టాప్–3లో పరిశ్రమలు, మౌలిక వసతులు. ఐటీఈ అండ్ సీ రంగాలున్నాయి.



### రంగాల వారీగా మూడు రోజుల పెట్టుబడులు వివరాలు

| | | |
|---|---|---|
| విద్యుత్ రంగం | – రూ. 5,33,351 కోట్ల పెట్టుబడులు | – 2,66,722 మందికి ఉద్యోగాలు |
| పరిశ్రమలు | – రూ. 2,80,384 కోట్ల పెట్టుబడులు | – 5,19,083 మందికి ఉద్యోగాలు |
| మౌలిక వసతులు | – రూ. 2,01,758 కోట్ల పెట్టుబడులు | – 3,06,649 మందికి ఉద్యోగాలు |
| ఐటీఈ అండ్ సీ | – రూ. 1,59,467 కోట్ల పెట్టుబడులు | – 2,96,315 మందికి ఉద్యోగాలు |
| ఏపీ సీఆర్డీఏ | – రూ. 48,711 కోట్ల పెట్టుబడులు | – 41,625 మందికి ఉద్యోగాలు |
| టూరిజం | – రూ. 21,036 కోట్ల పెట్టుబడులు | – 1,05,804 మందికి ఉద్యోగాలు |
| ఫుడ్ ప్రాసెసింగ్ | – రూ. 13,008 కోట్ల పెట్టుబడులు | – 47,390 మందికి ఉద్యోగాలు |
| పట్టణాభివృద్ధి | – రూ. 4,944 కోట్ల పెట్టుబడులు | – 12,150 మందికి ఉద్యోగాలు |
| టెక్స్ టైల్స్ | – రూ. 4,490 కోట్ల పెట్టుబడులు | – 8,450 మందికి ఉద్యోగాలు |
| వైద్యారోగం | – రూ. 4,208 కోట్ల పెట్టుబడులు | – 24000 మందికి ఉద్యోగాలు |
| విద్యా రంగం | – రూ. 4,359 కోట్ల పెట్టుబడులు | – 3,000 మందికి ఉద్యోగాలు |
| ఇతర శాఖలు | – రూ. 50,000 కోట్ల పెట్టుబడులు | |

## శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుకు రంగం సిద్ధం

- ముందుకొచ్చిన ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా
- సీఎం చంద్రబాబు సమక్షంలో కుదిరిన ఎంఓయూ

విశాఖపట్నం (చైతన్యరథం): ఉత్తరాంధ్రకు మరో ఎయిర్ పోర్టు రానుంది. శ్రీకాకుళంలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు సంబంధించి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఎయిర్ పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మధ్య ఈ మేరకు శనివారం అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో అధికారులు ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు ఎయిర్‌పోర్ట్ రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో కనెక్టివిటీ పెరుగుతుందని, అలాగే పర్యాటక రంగానికి దోహదపడుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో ఈ ప్రాంతంలో ఆర్ధిక వృద్ధికి ఊతం లభిస్తుందన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రస్తుతం స్థల పరిశీలన జరుగుతోంది. మౌలిక వసతులు, రెగ్యులేటరీ అనుమతులపై ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ ఎయిర్ పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కలిసి పనిచేయనున్నాయి.



చైతన్యరథం

# ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు కలసిరండి

- ఎల్జీ కెమ్ ప్రతినిధులను కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సీఐఐ సదస్సు రెండో రోజు వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం భేటీ
- క్రూయిజ్ టూరిజం, బొబ్బిలి కోటల అభివృద్ధిపైనా చర్చ



విశాఖపట్నం (చైతన్యరథం): సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు శనివారం ప్రముఖ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుసగా భేటీ అయ్యారు. ముందుగా ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబిలిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కాకినాడ లేదంటే మూలపేటల్లో ఎల్జీ కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకు రావాలని సీఎం ఈ సందర్భంగా ప్రతిపాదించారు. జేఎస్‌డబ్ల్యుతో కలిసి ఎల్జీ కెమ్ ఏర్పాటు చేయదలిచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఏపీ సర్క్యులర్ ఎకానమీ పాలసీలో భాగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వీలుందని సీఎం సూచించారు. డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్... ఇలా అన్ని రంగాల్లో ఏపీ ముందుకెళ్తోందని వివరించిన సీఎం... అబుదాబి తరహాలో రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇందులో భాగస్వామి కావాలని యున్జోకోను కోరారు.

## అట్మాస్పియర్ కోర్


ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ గ్రూప్ అట్మాస్పియర్ కోర్ దక్షిణాసియా ఎండీ సౌవగ్య మొహాపాత్ర, గ్రూప్ ఎండీ సలీల్ పాణిగ్రాహితోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఆధునిక పర్యాటక రంగ అభివృద్ధి, ప్రీమియం లగ్జరీ హోటల్ పోర్ట్‌ఫోలియో విస్తరణ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని తిరుపతి, విశాఖపట్నం, అమరావతిలో అట్మాస్పియర్ కోర్ చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు ప్రాజెక్టులు వచ్చే మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని అట్మాస్పియర్ కోర్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. గండికోటలో అడ్వంచర్ రిసార్ట్స్, అరకు-అనంతగిరిలో హిల్ రిసార్ట్స్ ఏర్పాటుకు యోచించాలని, అదేవిధంగా బొబ్బిలి-విజయనగరం కోటలను పరిశీలించి వాటిని పర్యాటకంగా ఎలా అభివృద్ధి చేయవచ్చునే దానిపై అభిప్రాయం చెప్పాలని సీఎం కోరారు. విశాఖలోని రుషికొండలో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్ నిర్మించేందుకు అట్మాస్పియర్ కోర్ ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు.

## ఇఫ్కో చైర్మన్‌తో భేటీ

ఇఫ్కో చైర్మన్ దిలీప్ ననూభాయ్ సంఘానీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఆధారిత ఫెర్టిలైజర్ ప్లాంట్ల ఏర్పాటు, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించే అంశాలపై చర్చించారు. బయో-ఫర్టిలైజర్, బయో-స్టిమ్యులెంట్ యూనిట్ల స్థాపనకు ఉన్న అవకాశాల పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు మేలు చేకూరే విధంగా ఇఫ్కోతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు.

## కోర్డెలియా క్రూయిజెస్

పర్యాటక రంగంలో ప్రముఖ సంస్థ కోర్డెలియా క్రూయిజెస్ ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ తీర పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని, ఇందుకు కోర్డెలియా క్రూయిజెస్ కలిసి రావాలని ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈవో జుర్గెన్ బైలామ్‌ను సీఎం కోరారు. విశాఖ-కాకినాడ-భీమునిపట్నం పోర్టుల నుంచి క్రూయిజ్ టూరిజం సేవలు అందించడంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌పై కోర్డెలియా క్రూయిజెస్ ఆసక్తి కనబరిచింది.







## క్వాంటమ్ టెక్నాలజీ నైపుణ్యాభివృద్ధిలో కీలక ముందడుగు

**- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో క్వాంటమ్ టెక్నాలజీ నైపుణ్యాభివృద్ధిలో కీలక ముందడుగు పడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీలో కెరీర్‌లను నిర్మించుకోవాలనుకునే ఏపీకి చెందిన ప్రతిభావంతులైన యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ఒప్పందం కుదిరిందంటూ ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు. వైజాగ్‌లో జరిగిన సీఐఐ భాగస్వామ్య సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ మేరకు వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇజువీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రీసెర్చ్ (WISER), క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్, QKrishi క్వాంటమ్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుందన్నారు. రాష్ట్ర యువతలో క్వాంటమ్ టెక్నాలజీ నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఈ భాగస్వామ్యం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. దీంతో విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు సహా రాష్ట్రంలోని 50,000 మందికి పైగా అభ్యాసకులకు ప్రపంచ స్థాయి క్వాంటమ్ శిక్షణ, వర్చువల్ ల్యాబ్ యాక్సెస్ కల్పించటంతో పాటు కెరీర్ అవకాశాలను అందిస్తుందన్నారు. నూతన ఆవిష్కరణల్లో ప్రపంచ నైపుణ్య కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి కూడా బాటలు వేస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.





## సీమలో అభివృద్ధి వెలుగులు

**- రేమాండ్స్ ప్రాజెక్టుల శంకుస్థాపనపై సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): రాయలసీమ అభివృద్ధికి చిరునామాగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. రాయలసీమ వాసులకు మరో శుభవార్త! వైజాగ్‌లో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో, మూడు కొత్త రేమండ్ గ్రూప్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడం ద్వారా మరో మైలురాయిని చేరుకున్నాము. రాప్తాడులో భారీ దుస్తుల తయారీ పార్క్ వస్తుంది, అనంతపురంలోని గుడిపల్లిలో కొత్త ఆటో కాంపోనెంట్స్ యూనిట్ ఏర్పాటవుతుంది. టేకులోడులో ఏరోస్పేస్ కాంపోనెంట్స్ ప్లాంట్ రానుంది. రూ. 1,200 కోట్లకు పైగా పెట్టుబడి, 6000 పై చిలుకు ఉద్యోగాల కల్పనతో, రాయలసీమలో కొత్త అవకాశాలు, అభివృద్ధి కల్పనలో ఇది ఒక ముందడుగు. రేమండ్ గ్రూప్‌నకు చెందిన గౌతమ్ మైనీ, జతిన్ ఖన్నాతో కలిసి ఈ ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేయటం ఎంతో సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## పర్యాటక గమ్యస్థానంగా ఏపీ

**- సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): అపారమైన ప్రకృతి రమణీయ ప్రదేశాలతో నిండిన ఏపీని అద్భుతమైన పర్యాటక ఆకర్షణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా ఏపీని అభివృద్ధి చేసేలా ప్రఖ్యాత సంస్థల భాగస్వామ్యాలను అన్వేషిస్తున్నామన్నారు. ఈ కోవలోనే మాల్దీవులకు చెందిన, ఆతిథ్య రంగంలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అట్మాస్ఫియర్ కోర్ గ్రూప్‌తో చర్చలు జరిపామన్నారు. ఆ సంస్థ ఎండీ సలీల్ పాణిగ్రాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో భేటీ అయ్యామన్నారు. ఇప్పటికే ఏపీలో పెట్టుబడులకు ఆ సంస్థ ముందుకు వచ్చిందని, వాటిని వేగవంతం చేస్తూ.. మరింత విస్తరించేలా చర్చలు జరిపామన్నారు. రాష్ట్రంలో పర్యాటక, ఆతిథ్య రంగాల్లో ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ.. గండికోట, అరకువ్యాలీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.



# సీఐఐ సమ్మిట్ సూపర్ హిట్

- ఒప్పందాలన్నీ మూడేళ్లలో అన్నీ కార్యరూపం
- హాజరైన 640 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, 4,975 మందికి పైగా పారిశ్రామికవేత్తలు
- ఎనిమిది దేశాలతో 16, 91 మంది ప్రముఖులతో 41 వ్యాపార సమావేశాలు
- రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు
- అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం
- మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు




విశాఖపట్నం (చైతన్యరథం): రెండు రోజుల విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్ అయిందని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ సదస్సులో 640 మంది అంతర్జాతీయ ప్రతినిధులు సహా 4,975 మందికి పైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. 91 మంది పారిశ్రామిక వేత్తలతో 41 వ్యాపార సమావేశాలు నిర్వహించామని, ఎనిమిది దేశాలతో 16 వ్యాపార సమావేశాలు నిర్వహించామని, 24 ద్వైపాక్షిక సమావేశాలలో తాను పాల్గొన్నానని ఆయన తెలిపారు. ఈ సదస్సు రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని, 613 అవగాహన ఒప్పందాలు కుదరగా 16.31 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని, 17 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని ఆయన తెలిపారు.

### వేగం కీలకం

సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సందర్భంగా మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ సదస్సు పెట్టుబడులను ఆకర్షించడానికే పరిమితం కాలేదని, నాలెడ్జ్ షేరింగ్ సెషన్లు, ప్రపంచ పారిశ్రామిక రంగంపై చర్చలతో హైబ్రిడ్ నమూనాలో నిర్వహించమన్నారు. అదనంగా 450 మంది విద్యార్థులను ఈ సదస్సులో పాల్గొనడానికి ఎంపిక చేసి, వారికి భావి ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగేందుకు అవకాశం కల్పించామన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలనే ఆశయంతో ఉన్న యువతకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వేదికగా పనిచేస్తోందన్నారు. భావి ఎంటర్‌ప్రెన్యూర్లను ప్రోత్సహించడానికి 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదనంగా పారిశ్రామికీకరణను ప్రోత్సహించడానికి ఉమ్మడి మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. శ్రీసిటీని గురించి చెబుతూ అక్కడ 31 దేశాల భాగస్వామ్యంతో 240 యూనిట్లు ఉన్నాయని, దేశాల భాగస్వామ్యం యాభైకి పెంచాలని ముఖ్యమంత్రి అన్నారు. మంత్రులు, అధికారుల చొరవతో అన్ని విభాగాలు పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. గత 17 నెలల్లో ప్రభుత్వం పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని కలిగించగలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో భారీ పెట్టుబడులను ఆకర్షించిందన్నారు.

### 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం అధిగమిస్తాం

అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలతో పాటు, ఎస్క్రో ఖాతాలను తెరిచి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి సావరిన్ గ్యారెంటీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి చెప్పారు. 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తామన్న సూపర్ సిక్స్ హామీ లక్ష్యాన్ని అందుకుంటామన్నారు. 24 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించేలా పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దానిలో భాగంగా తూర్పు నుండి పశ్చిమానికి లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేయాలని యోచిస్తోందని ఆయన అన్నారు. రాయలసీమను ఉద్యానవన, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, కోస్తాంధ్రను ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేస్తామని, డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం ప్రాంతాన్ని ఏఐ హబ్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### మూడేళ్లలో కార్యరూపం

కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ వాస్తవ పెట్టుబడులేనన్నారు. ఈ పెట్టుబడులన్నీ మూడేళ్లలో కార్యరూపం దాల్చుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యే వరకు మంత్రుల బృందం పెట్టుబడి ప్రతిపాదనలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఫాలో అప్ చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో యూనిట్ల ఏర్పాటుపై దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించామన్నారు.

## 18 కంపెనీలు..

# రూ.1,04,914 కోట్ల పెట్టుబడులు

### మారిటైమ్ బోర్డు, ఏడీసీలతో ఎంవోయూలు - మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఒప్పందాలు

విశాఖపట్నం(చైతన్యరథం): విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా.. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో మొత్తంగా ఏపీ మారిటైమ్ బోర్డు, ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లతో జరిగిన 18 ఒప్పందాల ద్వారా రాష్ట్రానికి రూ. 1,04,914 కోట్లకు పైగా పెట్టు బడులు.. దాదాపుగా 75,994 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షం లో శుక్రవారం ఏపీ మారిటైమ్ బోర్డుతో మొత్తం 10 సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకోగా వాటి విలువ దాదాపు రూ. 1,00, 681 కోట్లు ఉంటుంది. తద్వారా 71,600 మందికి ఉపాధి లభించనుంది. అలాగే ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్ మెంట్ కార్పొ రేషన్ లిమిటెడ్‌తో మంత్రి సమక్షంలో 8 ఒప్పందాలు జరగ్గా వాటి విలువ దాదాపు రూ. 4233 కోట్లుగా ఉంది. తద్వారా 4394 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



### మారిటైమ్ బోర్డుతో ఎంవోయూలు చేసుకున్న 10 కంపెనీలు


1. APM టెర్మినల్స్: ఈ సంస్థ నైపుణ్యాభివృద్ధిలో తన సేవలు అందించనుంది.
2. CEMS విశాఖపట్నం : ఈ సంస్థ సైతం నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించనుంది.
3. DMRC, Umeandus Technologies Pvt. Ltd., BEML Ltd : ఈ సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించేందుకు ఎంవోయూ చేసుకుంది.
4. Garden Reach Shipbuilders and Engineers Ltd . ఈ సంస్థతో ఎంవోయూ కుదిరింది.. ఫీజిబులిటీ స్టడీ పూర్తయిన తర్వాత ఎంత మొత్తంలో పెట్టుబడి పెట్టనున్నారనే విషయం క్లారిటీ వస్తోంది.
5. Umeandus Technologies India Pvt. Ltd., BEML Ltd : ఈ సంస్థ దాదాపు రూ. 92,000 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.. తద్వారా 52 వేల మందికి ఉపాధి లభించనుంది.
6. RECTRON : ఈ సంస్థ దాదాపు రూ. 4150 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.. తద్వారా 6 వేల మందికి ఉపాధి లభించనుంది
7. Essar ports : ఈ సంస్థ దాదాపు రూ. 3000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.. తద్వారా 1500 మందికి ఉపాధి లభించనుంది.
8. Steel on Call Services (India) Pvt. Ltd : ఈ సంస్థ దాదాపు రూ. 630 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 8100 మందికి ఉపాధి లభించనుంది.
9. Sagar Defence: ఈ సంస్థ దాదాపు రూ. 501 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.. తద్వారా 2 వేల మందికి ఉపాధి లభించనుంది.
10. East West Marine Engineering Works: ఈ సంస్థ దాదాపు రూ. 400 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 2 వేల మందికి ఉపాధి లభించనుంది.

### ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో 8 ఎంవోయూలు

1. Nalwa Aero Space : ఈ సంస్థ దాదాపు రూ. 820 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 260 మందికి ఉపాధి లభించనుంది.
2. Taneja Aerospace : ఈ సంస్థ దాదాపు రూ. 710 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 250 మందికి ఉపాధి లభించనుంది.
3. E-Plane (Ubifly): ఈ సంస్థ దాదాపు రూ. 650 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 250 మందికి ఉపాధి లభించనుంది.
4. BLUJ Aerospace : ఈ సంస్థ దాదాపు రూ. 633 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 2964 మందికి ఉపాధి లభించనుంది.
5. Trubo Aviation Pvt..Ltd: ఈ సంస్థ దాదాపు రూ. 500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 200 మందికి ఉపాధి లభించనుంది.
6. FSTC : ఈ సంస్థ దాదాపు రూ. 250 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 250 మందికి ఉపాధి లభించనుంది.
7. SKY BIRD : ఈ సంస్థ దాదాపు రూ. 650 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 120 మందికి ఉపాధి లభించనుంది.
8. Daloft : ఈ సంస్థ దాదాపు రూ. 20 కోట్ల పెట్టుబ డులు పెట్టనుంది. తద్వారా 100 మందికి ఉపాధి లభించనుంది.

# ఇంధన రంగంలో సైబర్ రక్షణ అత్యవసరం

- ఏఐ ద్వారా విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గించే చర్యలు
- ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు
- ప్రజలకు లబ్ధి కలిగేలా విద్యుత్ వ్యవస్థలను తీర్చిదిద్దుతాం
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్ - CECRC ఏర్పాటుపై ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ఇంధన భద్రత, టెక్నాలజీ వినియోగం కోసం CECRC
- సీఎం చంద్రబాబు సమక్షంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో రాష్ట్రం కీలక ఒప్పందం
- తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తే లక్ష్యం: మంత్రి లోకేష్







విశాఖపట్టణం (చైతన్యరథం): ఇంధన భద్రత కోసం మెరుగైన రక్షణ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇదే సమయంలో టెక్నాలజీని వినియోగించి... ప్రజలకు లబ్ధి కలిగేలా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు ఉండాలని అభిప్రాయపడ్డారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఇంధన భద్రత, విద్యుత్‌రంగంలో అధునాతన టెక్నాలజీ వినియోగం కోసం వరల్డ్ ఎకనమిక్ ఫోరం(WEF)తో శనివారం రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదు ర్చుకుంది. సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ సెంటర్–CECRC ఏర్పాటుపై WEFతో ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందం చేసుకుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లా డుతూ... ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలను కూడా తయారు చేసుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు WEF ముందుకురావడం సంతోషం. ప్రపంచం అంతా గ్రీన్ ఎనర్జీ వినియోగం గురించే ఆలోచన చేస్తోంది. 160 గిగా వాట్ల గ్రీన్ ఎనర్జీని ఏపీలో ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అతితక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు చేసి వినియోగాన్ని పెంచగలిగాం. ఏఐ లాంటి టెక్నాలజీ వినియోగం ద్వారా విద్యుత్ పంపిణీ నష్టాలు, సరఫరా వ్యయం తగ్గించాలి. అప్పుడే ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యం అవుతుంది. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, గృహాలు ఇలా అన్నిటికీ ఇలా ప్రతి రంగానికీ విద్యుత్ అవసరమే. ఈ మేరకు విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు... మరింత విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ప్రజలకు లబ్ధి కలిగించేలా... మరింత మేలు జరిగేలా... ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా విధానాలను కూడా తయారు చేసుకుంటున్నాం. ట్రాన్స్‌మిషన్ నష్టాలను కూడా గణనీయంగా తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టాం. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ప్రజలకు ప్రయోజనాలు కలిగేలా వ్యవస్థలు ఉండాలి. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఏపీలో సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టును వేగంగా చేపట్టామని ముఖ్యమంత్రి వివరించారు.

### డేటా సెంటర్లకు విద్యుత్ తక్కువ ఖర్చులో ఇవ్వగలగాలి: నారా లోకేష్

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధి దిశగా దూసుకువెళ్తోంది. 6 గిగావాట్ల సామర్థ్యంతో విశాఖకు డేటా సెంటర్ తీసుకురావాలని ఆలోచన చేశాం. ఇప్పుడది సాకారం అయ్యింది. ఇలాం టి డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్ తయారు చేయటం ఓ సవాలు. అలాగే తక్కువ వ్యయంతో నాణ్య మైన విద్యుత్ తయారు చేయటం కూడా ముఖ్యమైన అంశం. అధిక ధరలకు విద్యుత్ ఉత్పత్తి చేసి డేటా సెంటర్లకు సరఫరా చేస్తే ఖర్చులు పెరిగిపోతాయి. అందుకే ఆధునిక టెక్నాలజీలపై ఆలోచన చేసిన సీఎం చంద్రబాబు వాటిని నిజం చేస్తున్నారు. సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియన్స్ సెంటర్ అనేది విద్యుత్ వ్యవస్థల రక్షణకు పనిచేస్తుంది. సీఎం ఆలోచన చేస్తే దానిని తక్షణం అమలు చేయాలని ఆదేశిస్తారు. అందుకే మంత్రులుగా మేమూ... అధికారులు అంతా వాటిని సాకారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నానని మంత్రి లోకేష్ చెప్పారు.

### గ్రీన్ ఎనర్జీలో ఏపీకి భారీగా పెట్టుబడులు: మంత్రి గొట్టిపాటి

ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ...టెక్నాలజీ కోసం మాత్రమే కాకుండా... ఇంధన వ్యవస్థల రక్షణ కోసం CECRC ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ విద్యుత్ ఉత్పత్తి దిశగా భారీ పెట్టు బడులు వస్తున్నాయని వివరించారు. ఈ సమయంలో విద్యుత్ వ్యవస్థల సెక్యూరిటీ చాలా ముఖ్యమని మంత్రి గొట్టిపాటి అభిప్రాయపడ్డారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జేరేమీ జర్గన్స్ మాట్లాడుతూ... ఏఐ ట్రాన్సిషన్ సమయంలో ఇంధన వ్యవస్థల భద్రత అత్యంతకీలకమైన అంశంగా మారిం దని చెప్పారు. ఏపీలో ఇంధన భద్రత, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవటం అభినం దనీయమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి,ఇంధన భద్రత విషయంలో భారత్‌లో వేగంగా నిర్ణయాలు జరుగుతు న్నాయని... ఇలాంటి సమయంలో వ్యవస్థల రక్షణ అత్యంత కీలకమైన అంశమని వివరించారు. సామాజికంగా, ఆర్థికంగా స్వావలంబన సాధించా లంటే ఈ తరహా కేంద్రాలు అవసరమవుతాయని జేరేమీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.



## ఏపీలో సెమీ కండక్టర్స్, చిప్ డిజైనింగ్ యూనిట్

**- ఏర్పాటు చేయాలని సిలికాన్ జెన్ చైర్మన్ చిదంబరంతో భేటీలో మంత్రి లోకేష్ వినతి**

విశాఖపట్నం (చైతన్యరథం): ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, తయారీ (ESDM) – సెమీ కండక్టర్స్‌లో పేరెన్నిగన్న సిలికాన్ జెన్ సంస్థ చైర్మన్ చీదా చిదంబరంతో శనివారం విశాఖలో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఏపీలో కో–లొకేటెడ్ ఓశాట్‌తో సెమీ కండక్టర్స్ ఫ్యాబ్రికేషన్ (ఫ్యాబ్), చిప్ డిజైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ ఐటీ, సెమీ కండక్టర్స్ పాలసీ 2.0లో దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై సంస్థ చైర్మన్ చీదా చిదంబరం మాట్లాడుతూ.... ఇంటిగ్రేటెడ్ సిస్టమ్–ఇన్–ప్యాకేజ్ (SiP) సొల్యూషన్స్ కోసం అధునాతన 3డీ వేఫర్ స్టాకింగ్ (వేఫర్–ఆన్–వేఫర్, డై–ఆన్–వేఫర్)పై తాము దృష్టి సారించినట్లు చెప్పారు. AI GPU\T, జూఖలు, హై–బ్యాండ్‌విడ్త్ మెమరీ (HBM), పవర్ మేనేజ్‌మెంట్ IC\T (PMIC\T) తయారీపై తమకు ఆసక్తి ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై తమ సంస్థలో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.




## ఏపీలో పెట్టుబడులు సముచితమైన నిర్ణయం

**- గోవా షిప్‌యార్డ్స్ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్‌తో మంత్రి లోకేష్**

విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో రూ. 5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్, రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకొచ్చిన గోవా షిప్ యార్డ్స్ సంస్థను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. 1057 కి.మీ.ల సువిశాల తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడం సరైన నిర్ణయమని పేర్కొన్నారు. సంస్థ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్ శనివారం విశాఖలో మంత్రి లోకేష్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదికేష్ వాసుదేవన్ మాట్లాడుతూ... తాము నిర్మించబోయే షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ద్వారా 20వేలమందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ భారతదేశంలోని ప్రముఖమైన, అత్యంత ఆధునిక రక్షణ షిప్‌యార్డ్‌ల్లో ఒకటిగా ఉందని చెప్పారు. ఇది దేశానికి కీలకమైన వ్యూహాత్మక స్థానంగా ఉంది. ప్రధానంగా భారత నావికాదళం, భారత తీర రక్షక దళానికి సేవలు అందిస్తున్నామని తెలిపారు. తాము అధునాతన సాంకేతికతతో కూడిన యుద్ధనౌకల రూపకల్పన చేసి తయారు చేస్తున్నామన్నారు. వాణిజ్య నౌకలకు లైఫ్ సైకిల్ సపోర్ట్, పునర్నిర్మాణం, అప్ గ్రేడ్, మరమ్మతు కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.



చైతన్యరథం

## కృత్రిమమేథను అనుసరించడం కాదు...

# మనమే ముందుండి నడిపిద్దాం!





- రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్‌తో భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకుందాం
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు
- మార్పును అడ్డుకోవడం కాదు... దాని రూపకల్పనలో భాగస్వాములం అవుదాం
- ఏఐ అవకాశాలపై సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

విశాఖపట్నం (చైతన్యరథం): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇకపై భవిష్యత్ సాంకేతికత కాదు... అది ఇప్పటికే ఇక్కడ ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ –ఉద్యోగాల భవిష్యత్తు – సవాలును అవకాశంగా మార్చుకోవడం (AI and the Future of Jobs - Turning Disruption into Opportunity) అనే అంశంపై సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ ప్రాంగణంలో శనివారం జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... పారిశ్రామిక విప్లవం వచ్చిన ప్రతిసారి ఉద్యోగాలు పెరుగుతాయన్నారు. ఏఐ ఇప్పుడు పరిశ్రమల పని తీరును సమూలంగా మార్చేస్తోంది, ఉత్పాదకతను పునర్నిర్వచిస్తోంది, పని నియమాలను తిరగరాస్తోంది. ఏఐని మనమే ముందుండి నడిపించడం, లేదా అది చూపిన మార్గంలో నడవడమా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్నగా మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

అడ్డంకులు, అసమానతలు లేకుండా ఏఐ ద్వారా మరింత డైనమిక్‌గా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం మన చేతిలో ఉంది. ఇందుకోసం మూడు విభాగాలుగా ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించుకోవాల్సి ఉంది. 1. పునఃనైపుణ్యం 2. పునఃనిర్వచించడం 3. పునరాలోచించడం (Reskill, Redefine, Reimagine). ఒకసారి నేర్చుకొని జీవితాంతం పనిచేసే కాలం పోయింది. చిరకాల అభ్యాసం ఇక విలాసం కాదు... అవసరం. రీస్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ ద్వారా రేపటి ఉద్యోగాలకు అనువైన ఎకోసిస్టమ్‌ను మనం నిర్మించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యూచర్ స్కిల్స్ ప్రాజెక్ట్ ఇప్పటికే ప్రారంభమైంది. ఏఐ ఎథిక్స్, డేటా స్టోరీటెల్లింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, సస్టంజబుల్ టెక్నాలజీ మీద మా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఏఐ శిక్షణ, నైతిక పర్యవేక్షణ, మానవ యంత్రాల సహకారంతో 2025 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఒక అంచనా. భవిష్యత్ సాంకేతికలతో ఉద్యోగాలు పొందటమే కాకుండా, వాటిలో అసాధారణ, చురుకైన పాత్ర పోషించేలా మన యువతను తయారు చేయాలని మంత్రి లోకేష్ అన్నారు.

### భవిష్యత్తు మన చేతుల్లోనే

ఏఐ సాంకేతికత భవిష్యత్తుకు ఒక బ్రిడ్జిగా ఉండాలి తప్ప అడ్డంకి కాకూడదు. ఏఐ విప్లవం పట్టణ.. గ్రామాల మధ్య, పురుషులు.. మహిళలు మధ్య, నైపుణ్యం కలిగిన వారు.. వెనుకబడిన వారి మధ్య అంతరాలను పెంచకూడదు. భారతదేశ జనాభాలో 65శాతం మంది 35 ఏళ్ల లోపు వయస్కులు ఉన్నారు. ఈ డెమొగ్రఫిక్ డివిడెండ్‌ను డిజిటల్ లిటరసీ, వొకేషనల్ ట్రైనింగ్, ఎంటర్ ప్రెన్యూరల్ మద్దతుతో భవిష్యత్ వ్యవస్థకు పెట్టుబడిగా మలచుకోవచ్చు. ఈ సమయంలో మనం పెద్దగా ఆలోచించాలి, తెలివిగా పని చేయాలి, తగిన శ్రద్ధ చూపాలి. భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంటుంది. నేతలు, పాలసీ మేకర్లు, ఉపాధ్యాయులు, పౌరులు దీనిని కొత్తమార్గం వైపు నడిపించాలి. మార్పును అడ్డుకోవడం కాదు... దాని రూపకల్పనలో మనమంతా భాగస్వాములు కావాలి. కొత్త టెక్నాలజీకి భయపడుకుండా దానిని మరింత సౌలభ్యంగా మార్చుకుందామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా 'ఈజ్ ఇండియా రెడీ ఫర్ అథెంటిక్ ఏఐ' నివేదికను మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. అనంతరం నారా లోకేష్ సమక్షంలో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ, సీఐఐ వైస్ ప్రెసిడెంట్ సుచిత్ర కె.ఎల్లాతో సీఐఐ ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే ఐదేళ్లలో విజయవాడలో 30వేల మంది యువతకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ, కెరియర్ కౌన్సిలింగ్, ఉద్యోగాల కల్పన కోసం ఈ ఎంవోయూ చేసుకున్నారు.

ఈ సదస్సులో సిఐఐ ప్రెసిడెంట్ రాజీవ్ మెమాని, నీతి ఫ్రంటైర్ టెక్ హబ్ చీఫ్ ఆర్కిటెక్ట్ దేబ్ జానీ ఘోష్, పోర్టులాన్స్ ఇనిస్టిట్యూట్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా, వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండి జెరేమి జుర్గెన్స్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ గ్లోబల్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ జోయ్ దేపా, కొరియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ షారోన్ బూటీ, తదితరులు పాల్గొన్నారు.







# అండగా ఉంటాం

- వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి మంత్రి లోకేష్ భరోసా
- విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి 73వ రోజు ప్రజాదర్బార్
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శనివారం 73వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వినతులు స్వీకరించారు. నకిలీ పత్రాలతో కొంతమంది వ్యక్తులు తమ 5.64 ఎకరాల వ్యవసాయ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చిననడిపిల్లి గ్రామానికి చెందిన బంగారి శ్రీనివాసరావు.. మంత్రి లోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీలో ఉద్యోగ అవకాశం కల్పించి తమకు అండగా నిలవాలని 'నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జండర్ పర్సన్స్' ప్రతినిధులు విన్నవించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించి ఆదుకోవాలని నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన కొప్పాల సుధాకర్ విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం మర్రిపాలెంలోని తమ 3.10 ఎకరాల వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో మంచాల నాగేశ్వరరావు ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని విశాఖకు చెందిన ఎన్.నరసింహస్వామి ఫిర్యాదు చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.



## క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో..

# దేశానికి దిక్సూచిగా నిలుద్దాం

- ఆ సామర్థ్యం ఏపీకి ఉంది
- క్వాంటమ్ మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్ రూపొందించిన రాష్ట్రాల్లో ఏపీ ఒకటి
- కలలు కనడం మాత్రమే కాదు.. వాటిని సాకారం చేస్తాం
- క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సులో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్
- ఆంధ్రప్రదేశ్ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ (2025-30)ని విడుదల చేసిన మంత్రి



విశాఖపట్నం (చైతన్యరథం): క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో దేశాన్ని ముందుండి నడిపించే సామర్థ్యం ఏపీకి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై (Atmanirbhar Quantum - Building Indiaµs Indigenous Quantum Stack in Andhra Pradesh) అంశంపై సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ ప్రాంగణంలో శనివారం జరిగిన సదస్సులో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. క్వాంటమ్ కంప్యూటింగ్ అంశంపై కీలక ప్రసంగం ఇవ్వడానికి తాను సరైన వ్యక్తిని కాదనిపిస్తోందన్నారు. ఈరంగంపై నాకు చాలా పరిమితమైన అవగాహన మాత్రమే ఉంది. నేను ఇప్పటికీ నేర్చుకుంటున్నాను. ఇంత గొప్ప ప్యానల్ సమక్షంలో ఉండటం నాకు గర్వకారణంగా ఉంది. ఏదైనా అమలు చేయాలంటే ముందు ఒక కల ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో మనం కేవలం కలలు కనటం మాత్రమే కాదు.. వాటిని సాకారం కూడా చేస్తాం. అందుకే భారతదేశ విజన్‌ను సాకారం చేసేలా క్వాంటమ్ మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్ రూపొందించిన తొలిరాష్ట్రాలలో ఒకటిగా నిలిచాం. అమరావతిలో క్యాంటమ్ వ్యాలీకి మొత్తం నాలుగు ముఖ్యమైన పునాదులు రూపొందించాం. మొదటిది అసలైన క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటుచేయడం, దానికి సంబంధించిన వినియోగ సందర్భాలు, పరిశోధనలను అభివృద్ధి చేయడం.. రెండోది దానికి సంబంధించిన సాఫ్ట్ వేర్ అభివృద్ధి, మూడోది ప్రతిభావంతమైన ఎకోసిస్టమ్‌ను నిర్మించడం, నాలుగోది అత్యంత ప్రతిష్టాత్మకమైన హార్డ్ వేర్ మాన్యుఫ్యాక్చరింగ్. క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో దేశాన్ని ముందుండి నడిపించే సామర్థ్యం ఏపీకి ఉంది. సీఎం చంద్రబాబు క్వాంటమ్ మిషన్ గురించి, క్వాంటమ్ కంప్యూటర్ తీసుకురావాలని చెప్పినరోజు నేను చాట్ జీపీటీకి వెళ్లి క్వాంటమ్ మిషన్, క్వాంటమ్ కంప్యూటర్ అంటే ఏమిటని వెతికాను. ఇప్పుడు పూర్తిస్థాయి మిషన్‌ను నిర్మించే స్థాయికి వచ్చామని మంత్రి లోకేష్ చెప్పారు.

### 23 సంస్థలతో ఎంఓయూలు

అనంతరం ఆంధ్రప్రదేశ్ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ(2025-30)ని మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. నారా లోకేష్ సమక్షంలో క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో 23 సంస్థలతో ఈ సందర్భంగా ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ సెక్రటరీ కాటంనేని భాస్కర్,ఇండియా స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్ అండ్ అకాడ్ కాయిన్ హెడ్ సీవీ శ్రీధర్,ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, నేషనల్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, ప్రైమస్ పార్టనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో-ఫౌండర్, సీఈవో దేవరూప్ ధర్, డైరెక్టర్ అండ్ సీటీవో అమిత్ సింగీ, క్యూఎన్‌యూ ల్యాబ్స్ ఛైర్మన్, కో-ఫౌండర్ శ్రీనివాసరావు ఆలూరి,క్వాంట్రల్ ఓఎక్స్ కో-ఫౌండర్, సీఈవో విశాల్ ఛత్ర, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ పార్టనర్ ఎస్‌డీఈ-మేనేజర్ గణేష్ శ్రీనివాసన్, పాస్కల్ సీఈవో రాబర్ట్ మారో,తదితరులు పాల్గొన్నారు.



























# ఇంటికో పారిశ్రామికవేత్త మా లక్ష్యం

- మా దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా ఆర్టిఐహెచ్
- ఏపీని భారత్ టెక్ రాజధానిగా మార్చడమే మా ధ్యేయం
- ఆర్టిఐహెచ్ పై సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్
- మంత్రి లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూ



విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది.. అభివృద్ధి, పరిపాలన, భాగస్వామ్యాన్ని నేడు ఇన్నోవేషన్ నిర్ణయిస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆర్టిఐహెచ్ – వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ – ఇన్నోవేషన్, ఇంక్లూజన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (RTIH and One Family One Entrepreneur - Innovation, Inclusion, and Impact for AP) అనే అంశంపై సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో రెండోరోజు శనివారం జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి లోకేష్ మాట్లాడుతూ... కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నది తమ విజన్‌గా తెలిపారు. దీనిని కొంతమందికి మాత్రమే దక్కే హక్కుగా కాకుండా ఆచరణీయ మార్గంగా చూడాల్సి ఉంది. 2029నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా మార్చాలని మేము కోరుకుంటున్నాం. ఈ రంగంలో 20వేలకు పైగా స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు, 10 ప్రధాన రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయడం మా లక్ష్యం. ఇది కేవలం స్టార్టప్‌ల సంఖ్య గురించి మాత్రమే కాదు. విద్యార్థులు, ఎంఎస్ఎంఇలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వంతో సహా అందరిలోనూ ఇన్నోవేషన్ మైండ్ సెట్ కల్పించే తమ ప్రధాన ధ్యేయంగా మంత్రి లోకేష్ వివరించారు.

## మీ కలలు నిజం కావాలంటే ముందు కలలు కనాలి

మీ కలలు నిజం కావాలంటే ముందు కలలు కనాలని ఏపీజే అబ్దుల్ కలాం చెప్పారు. 90వ దశకంలో చంద్రబాబునాయుడు కూడా ఇంటికో ప్రొఫెషనల్ గురించి మాట్లాడారు. ఈ రోజు కుటుంబానికో పారిశ్రామికవేత్త గురించి మాట్లాడుతున్నారు. ప్రతిభను గ్రామస్థాయిలోనే గుర్తించి వారి ఆలోచనను పెంచడంతో పాటు వాటిని అమలుపరిచే విధంగా కృషిచేస్తున్నాము. పెద్ద కంపెనీలు ఎప్పుడూ పెద్ద పెద్ద కార్యాలయాల్లో ఉద్భవించలేదు. సమాజంలోని సమస్యల నుంచి ఉద్భవించాయి. ఇక్కడ కూడా అలాంటి ఎంతోమంది ఉన్నారు. మాకు కావాల్సింది కూడా అదే. ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాడం, యువ వ్యాపారవేత్తలను నడిపించడం, వారికి శిక్షణ ఇవ్వడం, తగిన వేదిక కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

మా దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టిఐహెచ్) పనిచేస్తుంది. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులు ఆవిష్కర్తలను కలిపే ఒక వేదిక ఇది. వీటిద్వారా డీసెంట్రలైజ్డ్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహిస్తాం. హబ్ అండ్ స్పోక్ కేంద్రాలన్నీ కార్పొరేట్, అకడమిక్ పార్టనర్ల ఆధ్వర్యంలో ఉంటాయి. దీనివల్ల ప్రజా–ప్రైవేట్ భాగస్వామ్యంతో బలమైన ఇన్నోవేషన్ నెట్‌వర్క్ రూపుదిద్దుకుంటుంది. ఆర్టిఐహెచ్ ద్వారా మన దగ్గర ప్రస్తుతం పూర్తిస్థాయిలో స్టార్టప్ లైఫ్‌సైకిల్ ఉంది. ఐడియా డిస్కవరీ, ఫ్యూచర్ ఫౌండర్స్, కేటలిస్టు, వెలాసిటీ ల్యాబ్స్ ద్వారా వేగంగా అభివృద్ధి సాధించడమే మా లక్ష్యం. APIC, MINE ద్వారా ప్రోటోటైపింగ్, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ యూనిట్ల ద్వారా ఇంక్యూబేషన్ చేపడతామని మంత్రి లోకేష్ తెలిపారు.



## ఏపీని టెక్ రాజధానిగా మారుస్తాం

మేం పరిపాలనలో కొత్తధనాన్ని నేరుగా ప్రవేశపెడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను భారత్‌కు టెక్ రాజధానిగా మారుస్తాం. కో ఇన్నోవేటర్స్, స్టార్టప్‌లకు ప్రభుత్వం తొలి కస్టమర్‌గా ఉంటుంది. ఆర్టిఐహెచ్ GovTech ద్వారా వాస్తవిక సమస్యలను గుర్తించి వెనువెంటనే పరిష్కరిస్తాం. హ్యాకథాన్‌లు నిర్వహించి స్టార్టప్‌లు అమలు, స్కేల్ చేయగలిగే సొల్యూషన్‌లు అందిస్తాం. ఇది కొత్త మోడల్ – ప్రజా సమస్యల ఆధారంగా పరిష్కారాలకు ఇన్నోవేషన్స్‌ను ప్రోత్సహిస్తాం.

ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలో గుర్తింపు పొందాలన్నదే మా లక్ష్యం. ముఖ్యంగా ఇక్కడ ప్రారంభించి ప్రపంచాన్ని గెలవాలనుకునే మహోన్నత లక్ష్యం కలిగిన కొత్తతరం ఎంటర్ ప్రెన్యూర్స్ కోసమే ఈ ప్రయత్నం. వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్ ప్రెన్యూర్ అన్నది కేవలం నినాదం కాదు... ఇది కొత్త అభివృద్ధి నమూనా. దీన్ని సాధించేందుకు, AP Innovation & Startup Policy – 2024ను ప్రవేశపెట్టాం. విద్యార్థి దశ నుంచి వ్యాపారవేత్తగా ఎదిగేందుకు ఇందులో స్పష్టమైన మార్గాలు ఉన్నాయని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## నారా లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూ

మంత్రి నారా లోకేష్ సమక్షంలో 6 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఏపీ వాగ(AP VAGA), స్టార్టప్ యూఏఈ, క్వాంటమ్ ఏఐ, AIM/AIG, స్టార్టప్ రన్ వే, ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూ.10వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ కార్యక్రమంలో ఆర్ టిఐహెచ్ సిఇఓ పి.ధాత్రిరెడ్డి, టాటా ఇన్నోవేషన్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవి అరోరా, బ్లాక్ బక్ కో ఫౌండర్ రాజేష్ యాబాజీ, ఎండియా పార్టనర్స్ ఎండి సతీష్ ఆంధ్ర, ప్రొఫెసర్ రమేష్ లోకనాథన్, గ్లోబల్ అలయెన్స్ ఫర్ మాస్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ (GAME) కో ఫౌండర్ మదన్ పాడకి, తదితరులు పాల్గొన్నారు.









చైతన్యరథం

# గ్రీన్ ఎనర్జీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సహకరించండి

- స్వదేశీ సైబర్ సెక్యూరిటీ నిపుణులను మేమే తయారు చేస్తాం
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం సీఎఫ్‌టీ ఎండీ జెరెమి జుర్గెన్స్‌కు మంత్రి లోకేష్ వినతి




విశాఖపట్నం (చైతన్యరథం): గ్రీన్ ఎనర్జీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్ (సీఎఫ్‌టీ) మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జుర్గెన్స్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. విశాఖ సీఐఐ సమ్మిట్ సందర్భంగా జెరెమీ జుర్గెన్స్‌తో శనివారం మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2070 నాటికి భారత్ నెట్-జీరో ఉద్గారాలు సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. 2040 నాటికి దేశంలో విద్యుత్ అవసరం రెట్టింపు అవుతుంది. ఈ నేపథ్యంలో బలమైన గ్రీన్ ఎనర్జీ వ్యవస్థను నిర్మించడం అత్యవసరం. ఆంధ్రప్రదేశ్‌లో మేము మార్పుకోసం ఎదురుచూడటం లేదు. మార్పును తెచ్చే క్రమంలో మేం ముందు వరుసలో ఉన్నాం. మా రాష్ట్రాన్ని ప్రపంచ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పునరుత్పాదక ఇంధన రంగంలో 115 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. భారతదేశ గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యంలో 30% ఆంధ్రప్రదేశ్‌లోనే సాధించాలన్నది మా ధ్యేయం. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు. విద్యుత్ భద్రత, ఆర్థిక పోటీ, పర్యావరణ సంరక్షణకు మేం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాం. మా లక్ష్యసాధనకు మీ వంతు సహకారం అందించాలని కోరారు.

## జాతీయ భద్రతలో సైబర్ సెక్యూరిటీ కీలకం

ఈరోజు ప్రపంచం పరస్పరం అనుసంధానమైన నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ జాతీయభద్రతలో కీలకం. అక్టోబర్ 2023 నుండి సెప్టెంబర్ 2024వరకు, భారతదేశంలో 369 మిలియన్లకి పైగా సైబర్ సెక్యూరిటీ ఘటనలు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా 2033 నాటికి సైబర్‌దాడులు సుమారు 1 ట్రిలియన్ డాలర్ల నష్టాలను కలిగించనుందని అంచనా. ఇవి చాలా ఆందోళనకరమైన అంశం. ఇవి కీలకమైన మౌలిక సదుపాయాలకు అడ్డంకులు సృష్టించి, ఆర్థిక అభివృద్ధి ప్రతిబంధకంగా మారతాయి. ఆంధ్రప్రదేశ్ ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. మారాష్ట్రంలో పరిశ్రమలు, రవాణా, విద్యుత్ రంగాలు వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాయి. ఈప్రయాణం సజావుగా సాగాలంటే బలమైన సైబర్ సెక్యూరిటీ అవసరం. ఇదే సమయంలో, మాకు ఒక అనుకూల అంశం కూడా ఉంది. మా విద్యార్థుల 70% STEM కార్యక్రమాల్లో చేరారు. ఇది స్వదేశీ సైబర్‌సెక్యూరిటీ నిపుణులను తయారుచేసుకునేందుకు ఉపకరిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 40లక్షల ప్రొఫెషనల్ సైబర్ నిపుణుల లోటును తీర్చే అవకాశం మాకు ఉంది. చమురు - సహజ వాయువు, విద్యుత్, సప్లయ్‌చెయిన్ వంటి కీలకరంగాల్లో సైబర్ సెక్యూరిటీ మూల్యాంకన నమూనాలను అమలు చేయడంలో సహకారాన్ని అందించండి. ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక వేదిక అభివృద్ధి చేసిన "స్ట్రాటజిక్ సైబర్‌సెక్యూరిటీ టాలెంట్ ఫ్రేమ్‌వర్క్"ను ప్రయోగాత్మకంగా అమలు చేసి సైబర్‌సెక్యూరిటీ టాలెంట్ పూల్‌ను ప్రోత్సహించాలని మంత్రి లోకేష్ కోరారు.

సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ (C4IR)లో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. C4IR ఆంధ్రప్రదేశ్ విజయానికి సహకారమే ప్రాణం. ఆర్థికంగా మాత్రమే కాక మేధోపరంగా, కార్యపరంగా కూడా ఈప్రయాణంలో సంస్థాపక భాగస్వాములుగా మాతో చేరండి. హరిత, సురక్షిత, సుసంపన్నమైన భవిష్యత్తు రూపకల్పనలో భాగస్వాములుకండి. ఆంధ్రప్రదేశ్ ధైర్యంగా, ధృఢంగా ముందుకు సాగుతోంది. మేము ఒక బలమైన ఎకో సిస్టమ్‌ను నిర్మిస్తున్నాం. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలు, ప్రపంచ నిపుణులతో అనుసంధానించి సరికొత్త ఆవిష్కరణలకు ఇది దోహదం చేస్తుందని లోకేష్ తెలిపారు.

ఈ సందర్భంగా జెరెమి జుర్గెన్స్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో క్లీన్ ఎనర్జీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు "మొబిలైజింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ క్లిన్ ఎనర్జి ఇన్ ఇమర్జింగ్ ఎకానమీస్ (MICEE)" కార్యక్రమం ద్వారా పెట్టుబడులను ఆవిష్కరించి, ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయడంలో తమ సెంటర్ తోడ్పాటు అందిస్తుందన్నారు. అలాగే "ఎనర్జీ లెర్నింగ్ ప్రోగ్రాం", C4IR మలేషియా వంటి విజయవంతమైన నమూనాల స్ఫూర్తితో, ప్రజల్లో అవగాహన పెంపొందించడాన్ని, యువతలో ఇంధన సాంకేతికతలపై నైపుణ్యాన్ని పెంపొందించడాన్ని లక్ష్యంగా ఉంచుతుంది. సైబర్ సెక్యూరిటీపై మా సెంటర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని జెరెమి జుర్గెన్స్ చెప్పారు.

# అమరావతితో ఫుట్‌బాల్ స్టేడియం

- మంత్రి లోకేష్‌తో భేటీలో ఏఐఎఫ్ఎఫ్ చైర్మన్ కళ్యాణ్ చౌబే



విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో ఫుట్‌బాల్ స్టేడియం నిర్మించనున్నట్లు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) చైర్మన్ కళ్యాణ్ చౌబే తెలిపారు. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో ఏఐఎఫ్ఎఫ్ చైర్మన్ కళ్యాణ్ చౌబే శనివారం విశాఖలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటీవల డీఎస్సీ రిక్రూట్ మెంట్‌లో 3శాతం రిజర్వేషన్ అమలుచేశామని తెలిపారు. ఈ సందర్భంగా చౌబే మాట్లాడుతూ... అమరావతిలో 12 ఎకరాల్లో ఏఐఎఫ్ఎఫ్ ఫుట్‌బాల్ స్టేడియం నిర్మించనున్నట్లు చెప్పారు. గ్రాస్ రూట్స్ ఫుట్‌బాల్ సాధికారత కోసం పిఇటిలకు ఫుట్‌బాల్ శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖతో ఏఐఎఫ్ఎఫ్ భాగస్వామ్యం వహించనున్నట్లు తెలిపారు. ఏపీలో ఫుట్‌బాల్ శిక్షకులను గ్రేడ్ చేయడం, వారి సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఏఐఎఫ్ఎఫ్ క్రియాశీలకం వ్యవహరిస్తున్నట్లు చౌబే చెప్పారు.

## రెన్యువబుల్ ఎనర్జీ విడిభాగాల తయారీ యూనిట్

# ఏపీలో ఏర్పాటు చేయండి

- జెలెస్ట్రా పవర్ సీఈఓ పరాగ్ శర్మకు మంత్రి లోకేష్ వినతి



విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో రెన్యువబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని జెలెస్ట్రా పవర్ సీఈఓ పరాగ్ శర్మను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. శనివారం విశాఖలో పరాగ్ శర్మతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పరాగ్ వర్మ మాట్లాడుతూ... హర్యానాలోని గురుగావ్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ... వర్టికల్ ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలపర్‌గా, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ఉందని చెప్పారు.

యుటిలిటీ స్కేల్ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి, కన్‌స్ట్రక్షన్, కమర్షియలైజేషన్ రంగాల్లో తాము సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 579 మిలియన్ పౌండ్ల వార్షికాదాయం కలిగిన తమ సంస్థ 7 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సోలార్ ప్యానల్స్, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థల కోసం ఏపీలో రెన్యువబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. విడిభాగాల ఎగుమతికి సౌలభ్యంగా ఉండేలా పోర్టు సమీపంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 1057 కి.మీ.ల సువిశాల తీర ప్రాంతం, విస్తృతమైన రోడ్డు, రైల్వే కనెక్టివిటీ అందుబాటులో ఉందని, మరో ఏడాదిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- ద్వారక బస్ స్టేషన్ కాంప్లెక్స్ పరిశీలన

విశాఖపట్నం(చైతన్యరథం): రవాణా, యువజన, క్రీడల మం త్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం విశాఖపట్నంలోని ద్వారక బస్ స్టేషన్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భం గా పలు విభాగాలను పరిశీలించి ప్రయాణికులకు అందుతున్న సౌకర్యా లు, పరిశుభ్రత, నిర్వహణ వ్యవస్థలను సమీక్షించారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి స్థలాలు, సమాచార బోర్డుల ఏర్పాటు వంటి అవసరమైన సౌకర్యా లను తక్షణమే మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రజా రవాణా సేవలను ఆధుని కీకరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విజయనగరం జోన్‌కు చెందిన అన్ని బస్సుల్లో 1,620 ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్సులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సుమారు రూ.3,20, 000 వ్యయంతో ఈ ఫస్ట్ ఎయిడ్ కిట్లను డాక్టర్ సంతోష్ (డెంటల్ స్పెషలిస్ట్) సామాజిక బాధ్యతగా స్పాన్సర్ చేసినట్లు తెలిపారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ ద్వారా ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులతో మంత్రి స్వయంగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. అర్హత కలిగిన ఉద్యోగులకు ఇటీవల జారీ చేసిన పదోన్నతి ఆదేశాలు, రిటైర్డ్ ఉద్యోగులకు అందిస్తున్న ఈహెచ్‌ఎస్(ఎంప్లాయీ హెల్త్ స్కీమ్)పై ప్రభుత్వ చితశుద్ధిని ఆర్టీసీ ఉద్యోగులకు తెలిపారు.



# ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం







**- అందరి టీం వర్క్‌తోనే సమ్మిట్ విజయవంతం**

**- మంత్రులు, అధికారులు, ఉద్యోగులకు సీఎం చంద్రబాబు అభినందనలు**

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు అంచనాలకు మించి విజయవంతమయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రులు, అధికారుల టీం వర్క్ తోనే సమ్మిట్ సూపర్ హిట్ అయిందన్నారు. ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు వెళు తున్నామని స్పష్టం చేశారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు అనంతరం మంత్రులు, అధికారులు, ఉద్యోగు లకు సీఎం అభినందనలు తెలిపారు. అవార్డులు అందించి... ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సీఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. 45 దేశాల్లో మన సమ్మిట్ చర్చనీయాంశమైందంటే, విశాఖ పేరు మార్మోగుతోందంటే టీం వర్క్ తోనే ఇది సాధ్యమైంది. ఈ సదస్సులో అర్థవంతమైన, విజ్ఞాన వంతమైన చర్చలుజరిపాం. దావోస్‌లో ఎంవోయూలు బయట జరుగుతాయి. ప్రపంచం ఏదిశగా ముందుకు వెళుతోంది,భవిష్యత్ ఏవిధంగా ఉంటుంది,ఎదురయ్యే సవాళ్లు, అందివచ్చే అవకాశాలపై మెయిన్ వెన్యూలో చర్చిస్తారు. కానీ వినూత్న పద్ధతిలో విశాఖ సమ్మిట్ కు మనం శ్రీకారం చుట్టాం. ఎవరికి ఏ సబ్జెక్ట్ పైన ఆసక్తి ఉంటే ఆ సెమినార్‌కు వెళ్లే అవకాశం కల్పిం చాం. సమ్మిట్‌లో వెన్యూ మొదలుకొని మెనూ వరకూ అంతా ప్లానింగ్‌తో నిర్వహించారు. విదేశీ ప్రతినిధులను ఎయిర్ పోర్టులో రిసీవ్ చేసుకున్నప్పటి నుంచి వీడ్కోలు పలికే వరకూ ఎక్కడ ఇబ్బంది కలగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించింది. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందు కు తీసుకెళ్తున్నాం. మోదీ బలమైన నాయకుడు అనే భావన ప్రపంచమంతా ఉంది. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది, పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో కలిగించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. విధ్వంస పాలనకు చరమగీతం పలికారు. 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని సీఎం చంద్రబాబు అన్నారు.











# నిజాలు బయటకొస్తాయనే సతీష్‌ను లేపేశారు

- **సిట్‌ను కలిసిన రెండోరోజే ఘటన జరిగింది**
- **హత్యకు గురైతే ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు**
- **వైసీపీ నేతలకు ఎందుకంత ఉలికిపాటు?**
- **పరకామణి కేసులో నిందితులతో కుట్ర చేశారు**
- **వారికీ పెద్ద తలకాయలతో ప్రాణహాని ఉంది**
- **పోలీసులు అరెస్టు చేసి భద్రత కల్పించాలి**
- **బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ఎన్.విజయకుమార్**

అమరావతి(చైతన్యరథం): పరకామణి కేసులో ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ హత్యపై ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయ పాలెం విజయకుమార్ అనుమానాలు వ్యక్తం చేశారు. పొద్దున్న 11 గంటలకు ఈ విషయం తెలిస్తే వెంటనే వైసీపీ వారి ఎక్స్ అకౌంట్‌లో ఆ హత్యని ఆత్మహత్యగా పేర్కొంటూ పోస్ట్ పెట్టారు. అప్పటికీ ఇంకా పోలీసు జాగిలాలు కూడా ఆ ప్రదేశానికి చేరుకో లేదు. ఎవరూ, ఏ పార్టీ వారూ స్పందించకముందే సాయంత్రం నాలుగు గంటలకు హత్యకు గురైన సతీష్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకోవడంలో అప్పటి బోర్డు చైర్మన్‌గా ప్రముఖ పాత్ర వహించిన కరుణాకర్‌రెడ్డి..నేడు పత్రికా సమావేశం పెట్టి మరీ సతీష్‌ది ఆత్మహత్యగా పేర్కొంటూ స్పందించారు. ఆయన ప్రెస్‌మీట్ సమయానికి ఇంకా పోస్టుమార్టం కూడా పూర్తి కాలేదు. రాత్రి పొద్దుపోయాక పోస్టుమార్టం పూర్తయిన తర్వాత అది హత్య అని పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ప్రకటించారు. అంత త్వరగా స్పందించి కేవలం తొలి వార్తలతోనే సతీష్‌కుమార్ హత్యని ఆత్మహత్యగా చిత్రించే ప్రయత్నం చేసిన వైసీపీ, అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. హత్య విషయం పోలీసులు కూడా స్పం దించక ముందే..వైసీపీ నాయకులు పోటీపడి ఆత్మహత్య అని నిరూపించే ప్రయత్నం చేయడం వారిపై అనుమానాలకు తావి స్తుందన్నారు.

### సతీష్‌ను అడ్డు తొలగించారు

ఎంత రహస్యాలు సతీష్‌కు తెలిసి ఉండకపోతే, అతన్ని అంత దారుణంగా చంపేస్తారు అనే అనుమానాలు ప్రజల్లో వచ్చేసింది. సాక్షులను చంపడం వైసీపీకి కొత్త కాదు. ఇప్పుడు పరకామణి కేసులో సూత్రధారులుగా భావించబడుతున్న అప్పటి ఈవో, చైర్మ న్లు, ఇప్పటికే నెయ్యి కేసు, మిగిలిన కేసుల్లో పీకలోతు మునిగి ఉన్నారు. పరకామణి కేసులో నిందితుడి ఆస్తులు రాయించుకున్న అప్పటి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రాజీ చేసుకోవడంలో ప్రముఖ పాత్ర వహించిన కరుణాకర్‌రెడ్డి, వీళ్లిద్దరికీ సహకరించిన అప్పటి ఈవో ధర్మారెడ్డి..ఈ ముగ్గురూ లేకపోతే ఈ కేసులో ఏవీఎస్‌వో లాంటి చిన్నస్థాయి వ్యక్తి కోర్టులో రాజీ చేసుకునే సాహసం చేయ లేదు. అసలు ఎంత సొమ్ము నిందితుడు పరకామణిలో దోచేశా డు? ఎన్ని ఆస్థులు నిందితుడు రవికుమార్ నుంచి అప్పటి బోర్డు పెద్దలు స్వాధీనం చేసుకున్నారు? ఆ కేసు మాఫీ చేయడానికి ఎందుకంత ఉత్సాహ పడ్డారు? ఇవన్నీ బయటకురావాలి. హత్యకు గురైన సతీష్‌కుమార్‌కు ఇవన్నీ తెలిసిన విషయాలు.. నిజాలు బయటకు రాకూడదనే సతీష్ హత్య చేయబడ్డాడు. పరకామణి కేసులో సూత్రధారులను వెలికి తీయాలని టీడీపీ ప్రత్యేక ప్రతినిధి బృందం సిట్ అధిపతిని కలిసిన రెండో రోజే హత్య జరగడం ఈ అనుమానాలను మరింత బలపరుస్తుందని తెలిపారు.

### నిందితుడు రవికుమార్‌ను సిట్ అదుపులోకి తీసుకోవాలి

సతీష్‌కుమార్ హత్య నేపథ్యంలో పరకామణి కేసులో ప్రధాన నిందితుడు రవికుమార్ ప్రాణాలకు రక్షణ కల్పించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. రాజీ జరిగిన తర్వాత నుంచి వారి కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఇప్పుడు రవికుమార్‌కు కూడా అపా యం కలగజేస్తే ఇంక కేసు లేదు, నిందితుడు లేడు, రాజీ పడ్డ వాడూ లేడు అని పెద్ద తలకాయలు భావిస్తూ ఉండవచ్చు. అందు కని నిందితుడు రవి కుమార్‌పై ఇప్పటికే సెక్షన్ 381కింద నాన్ బెయిల బుల్ వారెంట్ ఉన్న దృష్ట్యా వెంటనేపోలీసులు అదుపు లోకి తీసుకుని తమసెక్యూరిటీలో ఉంచాలని కోరారు.

### ధర్మారెడ్డి ప్రాణాలకి ముప్పు ఉంది

అదేవిధంగా ఎంతోకొంత వత్తిడితో, అప్పటి ఈవో ధర్మా రెడ్డి దాదాపు అప్రూవర్‌గా మారే అవకాశాలు వున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ధర్మారెడ్డికి పోలీసులు రక్షణ కల్పించాలి. లేదంటే కొన్నిరోజులు తమ అదుపులో ఉంచుకోవాలి. ధర్మారెడ్డికి కేవలం పరకామణి, కల్తీ నెయ్యి సరఫరా కేసులతోనే కాదు.. దాదాపు మూడున్నర సంవత్సరాల ఆయన జమానాలో జరిగిన ప్రతి అవకతవకలో ఆయన పాత్ర ఉంది. అప్పటి చైర్మన్లు ఏమి చెబితే అది చేస్తూ అక్రమాల్లో భాగస్తులయ్యారు. ఈ నేపథ్యంలో పరిటాల రవి హత్య కేసు, వివేకా హత్య కేసులను దృష్టిలో ఉంచుకుని ధర్మా రెడ్డిని కొన్ని రోజులు పోలీసుల అదుపులో ఉంచుకుని భద్రత కల్పించాలని కోరారు. ఈ హత్య నేపథ్యంలో పరకామణి కేసులో సిట్ మరింత కట్టుదిట్టంగా కూలంకషంగా దర్యాప్తు చేసి..ఎవరి ప్రాణాలకూ ప్రమాదం లేకుండా రక్షణ ఏర్పాట్లు చూడాలని టీడీపీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఏపీకి ప్రపంచ గుర్తింపు

- పరిశ్రమల అభివృద్ధికి బాటలు వేస్తున్న ప్రభుత్వం
- విశాఖపట్నంలో సీఐఐ సదస్సు విజయవంతం
- పెట్టుబడిదారుల విశ్వాసానికి కొత్త ఊపిరి
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాఖపట్నం(చైతన్యరథం): వ్యవసాయ బలోపేతం ద్వారానే పారిశ్రామిక రంగం అభివృద్ధి సాధ్యమవు తుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) భాగస్వామ్య సదస్సులో మాట్లాడుతూ రాష్ట్ర జీఎస్‌డీపీలో 35 శాతం ప్రాథమిక రంగం నుంచే వస్తుందనడం ద్వారా వ్యవసాయ ప్రాధాన్యతకు మరోసారి నిదర్శనం లభించిందని చెప్పారు. వ్యవ సాయ రంగంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పుల తో ఆంధ్రప్రదేశ్ దేశానికిమార్గదర్శకంగా నిలుస్తోంది. ఫామ్ మెకనైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగం రైతుల




ఖర్చులను భారీగా తగ్గించి లాభదాయకతను పెంచుతోందని వివరించారు. రసాయనాలు లేని సహజ వ్యవసాయ ఉత్పత్తులకు గల డిమాండ్ పెరుగుతుండటంతో, సహజ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్స హించాల్సిన అవసరం ఉందన్నారు. తొమ్మిదేళ్ల క్రితం ముందు చూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన న్యాచురల్ ఫార్మింగ్ నేడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిందని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించడం, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరచడం తమ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉందని మంత్రి పేర్కొన్నా రు. రైతుల ఆదాయా న్ని పెంచడంలో కీలక పాత్ర పోషించే ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు.

### సీఐఐ సదస్సు పెట్టుబడుల ప్రవాహానికి శ్రీకారం

సీఐఐ సదస్సు విజయవంతం కావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఐట మంత్రి నారా లోకేశ్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. పెట్టుబడుల ను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు యూఏఈలో, మంత్రి లోకేశ్ లండన్‌లో పెట్టుబడిదారులతో చేసిన చర్చలు రాష్ట్ర నమ్మకాన్ని పెంపొందించాయని తెలి పారు. రాష్ట్రం మరియు కేంద్రం మధ్య నెలకొన్న సత్సంబంధాలవల్ల పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వం కూడా పలు నిబంధనలను సడలిస్తూ సహకరిస్తోందని చెప్పారు. One Call - One Deal భావనతో ప్రభుత్వం పనిచేస్తుండటం వలన పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింద న్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు Speed of Doing Business విధానాన్ని అమలు చేస్తూ కేవలం 45 రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే వ్యవస్థ అమల్లోకి వచ్చిందని తెలిపారు.

### రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు

రెండు రోజుల సీఐఐ సదస్సు ఫలితంగా రాష్ట్రంలో రూ. 13 లక్షల కోట్లు పైబడిన పెట్టుబడులు సమకూరగా, 112 ప్రాజెక్టులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగడం రాష్ట్ర పురోగతికి శుభ సంకేతమని మంత్రి చెప్పారు. ఈ పెట్టుబడులు ఏపీ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, స్పేస్, డిఫెన్స్, టూరిజం వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు రావడం అభివృద్ధికి నాంది పలుకుతుందని వివరించారు. సదస్సుకు రెండు నెలల ముందుగానే సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేసిన ప్రభుత్వ యంత్రాంగాన్ని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

---

# పర్యాటక రంగంలో రూ.17,973 కోట్ల పెట్టుబడులు

- విశాఖ సీఐఐ సమ్మిట్‌లో 104 ఎంవోయూలు
- తద్వారా 97,876 మందికి ఉపాధి అవకాశాలు
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి




విశాఖపట్నం(చైతన్యరథం): సాంకేతికం, విశ్వాసం, వాణిజ్యం లక్ష్యంగా రెండురోజుల పాటు విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ సమ్మిట్‌లో భాగంగా పర్యాటక రంగంలో రూ.17,973 కోట్ల విలువైన 104 ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు మంత్రి కం దుల దుర్గేష్ వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో 10,690 రూమ్స్ ఏర్పాటు అవుతాయన్నారు. ప్రత్యక్షంగా 34,406, పరోక్షంగా 63,470 మొత్తంగా 97,876 మందికి పర్యాటక, అతిథ్య రంగా ల్లో ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో చేసుకున్న దాదాపు రూ.6,500 కోట్ల విలువైన ఎంవోయూలలో థీమ్ పార్కులు, మెరీనాలు, ఫిల్మ్ సిటీలు, వెల్‌నెస్ సెంటర్లు, రోడ్డు పక్కన సౌకర్యాలు, క్రూయిజ్‌లు, అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్ వంటి అంశాలపై దృష్టిసారిస్తామన్నారు. తొలిసారిగా రూ.1,860 కోట్ల విలువైన పర్యాటక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ఎంవో యూలపై సంతకాలు చేసినట్లు తద్వారా 12,500 ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. పారిశ్రామికవేత్తల భారీ స్పందనతో పర్యాటక రంగంలో నూతనోత్తేజం వచ్చిందన్నారు. రెండవ రోజు సమ్మిట్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం తన అధ్యక్షతన పర్యాటక పెట్టుబడిదారులతో జరిగిన ప్యానల్ సెషన్‌లో పెట్టుబడులపై చర్చించారు. ఆ తర్వాత ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాటలతో కలిసి ఇన్వెస్టర్లతో ఎంవోయూలను ఎక్స్ఛేంజ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్వెస్టర్లను ఉద్దేశించి మంత్రి కం దుల దుర్గేష్ రాష్ట్రంలో పర్యాటక పెట్టుబడులకు ఉన్న అవకాశా లను వివరించారు.

### తీర ప్రాంత సౌందర్యం ఏపీ ప్రధాన ఆస్తి

ఏపీలో 1053 కి.మీల విశాలమైన సముద్రతీరం ఉందని, తీర ప్రాంత సౌందర్యం ఏపీ ప్రధాన ఆస్తి అని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో బీచ్ కార్యకలాపాలకు, క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రైవేట్ భాగ స్వామ్యంతో మూడు కీలకమైన కోస్టల్ సర్క్యూట్‌లను అభివృద్ధి చేయనున్నామన్నారు. పర్యావరణ స్వచ్ఛత, పర్యాటకుల భద్రతే లక్ష్యంగా విశాఖలోని రుషికొండ లాంటి బ్లూఫ్లాగ్ బీచ్ తరహాలో మరిన్ని బీచ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీచ్ ప్రత్యేక వాతావరణాన్ని ఉపయోగించుకుని సెయిలింగ్, మెరైన్ స్పోర్ట్స్ వృద్ధి చేస్తామన్నారు. వెల్‌నెస్, ఆయుర్వేద రిట్రీట్‌లు, అడ్వెంచర్ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మెరైన్, క్రూయిజ్ టూరిజంకు బాటలు వేస్తున్నామ న్నారు. రాష్ట్రంలో కొత్త ఓడ రేవులు అందుబాటులోకి వస్తుండటంతో తీరం వెంబడి క్రూయిజ్ కార్యకలాపా లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. లగ్జరీ యాటింగ్‌కు ఏపీని కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇది జాతీయ స్థాయిలోనే కాదు ఆగ్నేయాసియాతో అనుసంధానం చేస్తుందన్నారు. అదే విధంగా తిరుమల పవిత్ర కొండ లను మొదలుకుని అమరావతి, తొట్ల కొండ లాంటి ప్రాచీన బౌద్ధ క్షేత్రాల వరకు అధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక వారసత్వానికి పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు.

### మైస్ క్యాపిటల్ ఆఫ్ ది సౌత్‌గా విశాఖపట్నం

అంతర్జాతీయంగా రాకపోకలకు వీలుగా రాష్ట్రంలో విమా నాశ్రయాలు నెలకొల్పుతుండటంతో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్స్ (మైస్) క్యాపిటల్ ఆఫ్ ది సౌత్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని పేర్కొన్నా రు. ఈ క్రమంలో లాజిస్టిక్ హబ్‌గా విశాఖ నిలవనుం దన్నారు. అదేవిధంగా కన్వెన్షన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ల వృద్ధి చేసి ప్రపంచస్థాయి కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి ఎగ్జిబి షన్ గ్రౌండ్‌లు అభివృద్ధి చేస్తామన్నారు.తద్వారా పర్యాటక, అతిథ్య రంగాలకు స్థిరమైన ఆదాయం వస్తుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఐటీ, ఏఐ డేటా సెంటర్లు విశాఖలో ఏర్పాటు కావడంతో మైస్ పర్యాటకం కోసం స్థిరమైన పర్యవరణ వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నట్లు స్పష్టం చేశారు. పర్యాటక ప్రధాన కేంద్రమైన విశాఖ సన్ రైజ్ సిటీగా తీర్చిదిద్దుతామని వివరించారు.

### ఇన్వెస్టర్లకు త్వరితగతిన అనుమతులు

రాష్ట్ర వేగవంతమైన, సమ్మిళిత అభివృద్ధికి పర్యాటకం కీలక మని, గేమ్ ఛేంజర్ లాంటిదని తెలిపారు. ఇది గుర్తించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు పర్యాటక రంగానికి పారిశ్రామిక హెూదా ఇవ్వడంతో ఊతం వచ్చిందని, నూతన పర్యాటక పాలసీ 2024-2029 పెట్టుబడిదారులను ఆకర్షించిందని తెలిపారు. ఈ క్రమంలో పెట్టుబడిదారుల కేంద్రీ కృత విధానాల ద్వారా ఇన్వెస్టర్లకు విద్యుత్ సబ్సిడీ, ప్రాజెక్టుకు అవసరమైన భూ కేటాయింపులు, ఉపాధి ఆధారిత ప్రోత్సాహం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తదితర అవకాశాలు కల్పించామని ఈ నేపథ్యంలో భారీఎత్తున ఇన్వెస్టర్లు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. గడి చిన 15 నెలల కాలంలో దాదాపు రూ.12,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు తెలిపారు. సమ్మిట్‌లో భాగంగా మరో రూ.17, 973కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకు న్నామని, మొత్తంగా దాదాపు రూ.30వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు వివరించారు.

ఈ క్రమంలో ఇన్వెస్టర్లకు త్వరిత గతిన అనుమతులు జారీ చేయడంతో పాటు ప్రాజెక్టుల అమలు వేగవంతం చేస్తున్నామన్నారు. వాటర్ స్పోర్ట్స్, రిసార్ట్‌లు, హెూమ్ స్టేలు, అడ్వెంచర్, కోస్టల్, క్రూయిజ్ టూరిజం, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ తదితర విభిన్న పర్యాటక ప్రక్రియలను పరిచయం చేసి పర్యాటకులకు మధురానుభూతులు కల్పించనున్నామన్నారు. 2047 నాటికి ఏపీని అగ్రగామిగా నిలిపి ప్రపంచ పర్యాటక కేంద్రంగా నిలుపుతామని తెలిపారు.

పెట్టుబడులకు,పర్యాటకులకు గమ్యస్థానంగా ఆంధ్రప్ర దేశ్‌ను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐఐ సమ్మిట్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

---

# రేపటి నుంచి ప్రజావేదిక షెడ్యూల్

## అర్జీలు స్వీకరించనున్న మంత్రులు, నాయకులు

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతిరోజు మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో 'ప్రజావేదిక' కార్యక్రమం జరుగుతోంది. ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నారు. ప్రతి శుక్రవారం నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం వల్ల కేంద్ర కార్యాలయంలో ఆ రోజున ఎటువంటి అర్జీల స్వీకరణ ఉండదు. టీడీపీ నాయకులు, ప్రజలు గమనించాలని కార్యాలయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు సూచించారు. మిగిలిన రోజులలో ప్రజావేదికలో పాల్గొనే మంత్రులు, నాయకుల షెడ్యూల్

- 17-11-2025 (సోమవారం) : మంత్రి కొలుసు పార్థసారథి , ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ
- 18-11-2025: మంత్రి ఫరూక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీద్
- 19-11-2025: మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు
- 20-11-2025: మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఏపీ భవన, నిర్మాణ కార్మికుల బోర్డు చైర్మన్ వలవల బాబ్జి
- 22-11-2025: మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఏపీ కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్
- 24-11-2025: మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీళ గోవింద సత్యనారాయణ.
- 25-11-2025: మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, APCOSGF చైర్మన్ గండి బాబ్జి
- 26-11-2025: మంత్రి ఎస్.సవిత, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ జీ.నరసింహ యాదవ్
- 27-11-2025: మంత్రి పయ్యావుల కేశవ, ఏపీ కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు
- 29-11-2025: మంత్రి నిమ్మల రామానాయుడు, APEMC చైర్మన్ పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి

చైతన్యరథం

# అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ సిటీగా అమరావతి

- భవిష్యత్తు తరాలకు స్థిరమైన వారసత్వం
- సీఐఐ సదస్సులో మంత్రి పొంగూరు నారాయణ
- పెట్టుబడిదారులకు రాజధాని నిర్మాణంపై ప్రజంటేషన్



విశాఖపట్నం(చైతన్యరథం): అమరావతి రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మి స్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణం ద్వారా భవిష్యత్తు తరాలకు స్థిరమైన రాజధానిని అందిస్తున్నామన్నారు. విశాఖలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్లీనరీ సెషన్‌లో స్థిరమైన నగరాలు – ఫ్రం విజన్ టు ఇన్వెస్ట్‌మెంట్స్ అనే అంశంపై మంత్రి ప్రసంగించారు. అమరావతి ప్రజా రాజధానిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మిం చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను దేశవిదేశాల పారి శ్రామికవేత్తలకు వివరించారు. అటు అమరావతిపై నిపుణులతో పాటు పెట్టుబడిదారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అమరావతి ప్రజా రాజధాని 217 చ.కి.మీ విస్తీర్ణంతో దేశంలోని రాజధాని నగరాల్లో ప్రత్యేకంగా నిలుస్తుంది – దేశం లోని అతిపెద్ద ల్యాండ్ పూలింగ్ పథకం (LPS)లో స్వచ్ఛందంగా పాల్గొన్న 29,000 కంటే ఎక్కువ మంది రైతుల నుంచి అమరావతి జన్మించింద న్నారు. అఖండ మద్దతు నుంచి జన్మించింది. అమరా వతిని ఆర్థికంగా, శక్తివంతమైన, పర్యావరణపరంగా స్థిరమైన, రాబోయే తరాలకు అవకాశాలను సృష్టించేలా నిర్మిస్తున్నామన్నారు. 2050 నాటికి 3.5 మిలియన్ల జనాభాతో 35 బిలియన్ డాలర్ల జీడీపీతో 1.5 మిలియన్ల ఉపాధి అవకాశాలు కల్పించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అమరావతి నిర్మాణం జరుగుతుందని తెలిపారు. సుమారు 90 కిమీ పొడవైన ఇన్నర్ రింగ్ రోడ్డు, 190 కిమీల మేర ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే అనుమతి వచ్చింది. దేశంలోనే రద్దీగా ఉండే విజయవాడ రైల్వే స్టేషన్ కేవలం 10 కిమీల మేర ఉండగా.. కొత్తగా నిర్మిస్తున్న హైదరాబాద్ – నంబూ రు రైల్వే లైన్ కేపిటల్ సిటీని ఆనుకుని వెళు తుందన్నారు.. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌తో పాటు కొత్తగా మరో అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు మచిలీపట్నం పోర్టు కనెక్టవిటీ అమరా వతికి ఉంది. 30 శాతం బ్లూ –గ్రీన్ రాజధానిగా 7 సహజమైన ద్వీపాలు, 21 కి.మీ నదీ తీరం అమరావతిని అత్యంత అనుకూల వాతావరణం ఉన్న రాజధానిగా మారుస్తాయని వివరించారు.

## నివాసయోగ్యమైన ప్రజారాజధాని

అమరావతిని నివాసయోగ్యమైన ప్రజా కేంద్రిత రాజధానిగా నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. 5–10–15 నిమిషాల నివాస యోగ్యంగా ప్రణాళికా బద్ధంగా నిర్మాణం జరుగుతుందన్నారు. అమరావతిలో ఉండే ప్రజలు అత్యవసర సేవలకు 5 నిమిషాలు, వినోద ప్రదేశాలకు 10 నిమిషాలు, పని ప్రాంతాలకు 15 నిమి షాల్లో చేరుకునేలా నివాసయోగ్యంగా అమరావతి నిర్మాణం ఉం టుందన్నారు. 360 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ రోడ్డు నెట్వర్క్‌తో ట్రాఫిక్ సజావుగా సాగేలా ప్రణాళికలు రూపొందించి నట్లు చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ లైన్లు, కమ్యూనికేషన్ లైన్లు, ప్రణాళికాబద్ధమైన ఇం టర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌తో ఆర్థిక వృద్ధికి దన్నుగా అమరావతి ఉండనుంద న్నారు. మరోవైపు దాదాపు 91,000 కోట్లతో ప్రభుత్వ భవనాలు, రోడ్లు, మౌలిక వసతులు, వరద నివారణ పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. రాబోయే మూడేళ్లలో 51,000 కోట్ల విలువైన పనులు పూర్తి చేసేలా ఇప్పటికే టెండర్లు పూర్తి చేశా మని తెలిపారు. ఇలాంటి ప్రపంచ స్థాయి మౌళిక వసతులతో అమరావతి రాజధాని సుస్థిరమైన రాజధానిగా మారుతుందని చేశారు. ఇప్పటికే అమరావతిలో 25,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని... విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలు, కిమ్స్, బసవతారకం వంటి ఆసుపత్రులు, హిల్టన్, మారియట్, నోవాటెల్ వంటి హెూటల్స్, బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు పెట్టుబడు లకు ముందు కొచ్చాయన్నారు. రతన్ టాటా హబ్, క్వాంటం వ్యాలీతో బలమైన నాలెడ్జి సెంటర్‌గా అమరావతి మారనుంది. భాగస్వామ్య సదస్సతులో 40,000 కోట్ల పెట్టుబడులకు ఎంవో యూలు కుదిరాయన్నారు. అమరావతి ద్వారా రాజధాని నిర్మాణం మాత్రమే కాదు.. భవిష్యత్తు తరాలకు స్థిరమైన వారసత్వాన్ని నిర్మి స్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, సీఐఐ ప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖ పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్స్‌లో రూ.4,380 కోట్ల పెట్టుబడులు



- సీఎం, మంత్రి సవిత సమక్షంలో ఒప్పందాలు
- 7 సంస్థలతో ఎంవోయూలు.. 6,100 ఉద్యోగాలు
- ఐదు జిల్లాల్లో ఏర్పాటు కానున్న పరిశ్రమలు
- రూ.4 వేల కోట్లతో ముందుకొచ్చిన ఫిన్లాండ్ కంపెనీ
- టెక్స్‌టైల్స్ రంగానికి ఊపరి: మంత్రి సవిత

విశాఖపట్నం(చైతన్యరథం): విశాఖలో జరిగిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో టెక్స్ టైల్స్ రంగంలో రూ.4,380.38కోట్ల మేర ఏడు ఎంవోయూలు జరిగా యి. ఈఒప్పందాలతో ప్రత్యక్షంగా 6,100 ఉద్యోగాలు లభించనున్నాయి. విశాఖ సమ్మిట్‌లో శనివా రం మంత్రి సవిత సమక్షంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. టెక్నికల్ టెక్స్‌టైల్స్, రీసైక్లింగ్, గార్మెంట్స్, సిల్క్, అప్పారెల్స్ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్స్ ఆసక్తి చూపారు. విశాఖపట్నం, చిత్తూరు, గుంటూరు, శ్రీ సత్యసాయి, అనకాపల్లిజిల్లాలో పరిశ్రమల ఏర్పా టుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారు. కామధేను సటికా సంస్థ రూ.90కోట్లతో కృష్ణాజిల్లా మచిలీపట్నం లో పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్ర మతో 650 మందికి ఉద్యోగాలు రానున్నాయి. చిత్తూరు జిల్లా గంగ్రాజుపల్లిలో జీనియస్ ఫిల్టర్స్ సంస్థ రూ.120 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ వల్ల ప్రత్యక్షంగా 250 మంది కి ఉపాధి లభించనుంది. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో అరవింద్ అపెరల్ పార్క్ రూ.20కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ ఏర్పాటుతో రెండువేల ఉద్యోగాలు రానున్నాయి. గుంటూరులో వామిని ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.35 కోట్లు మేర పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థతో గుంటూరులో రెండు వేల మందికి ఉపాధి లభించనుంది. విశాఖపట్నంలో ఎంవీఆర్ టెక్స్ టైల్స్ రూ.105.38 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ఆ సంస్థ యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ సంస్థ ఏర్పాటుతో 900మందికి ఉద్యోగాలు లభించనున్నా యి. అనకాపల్లిలో బీసీ యూబీఈ టెక్స్‌టైల్స్ యాజ మాన్యం రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టంది. ఈ సంస్థ 100 మందికి ఉపాధి కల్పించనుంది.

## సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు

ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ ఏపీలో రూ.4వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొ చ్చింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి సవిత సమక్షంలోప్రభుత్వంతో ఇన్ఫిని టెడ్‌ఫైబర్ సంస్థఒప్పం దం చేసుకుంది. ఈ సంస్థ విశాఖ పట్నంలో ఏర్పాటు కానుంది. టెక్స్‌టైల్ రీసైక్లింగ్ టెక్నాలజీని ఈ సంస్థ భారత్‌కు తొలిసారి తీసుకువస్తోంది. మొత్తం ఏడు ఒప్పందాలద్వారా ఏపీ టెక్స్‌టైల్స్ రంగంలో రూ.4,380.38 కోట్ల మేర పెట్టుబడులు తరలివచ్చా యి. ఈ పరిశ్రమల ఏర్పాటుతో 6,100 ఉద్యోగాలు రానున్నాయి.

## టెక్స్‌టైల్స్ రంగానికి ఊతం : మంత్రి సవిత

విశాఖ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో చేసుకున్న ఒప్పం దాలతో ఏపీ టెక్స్ టైల్స్ రంగానికి ఊతం లభించిం దని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన టెక్స్‌టైల్స్ విధానంతో ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారన్నారు. వారేకాక మరింతమంది రాష్ట్రం లో పెట్టు బడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ పరిశ్రమలను ఆరు నెలల్లో నెలకొల్పనున్నట్లు వెల్లడించారు.

# లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలే లక్ష్యం

వారి అభివృద్ధికి బాటలు వేస్తాం

సీఐఐ సదస్సులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



విశాఖపట్టణం(చైతన్యరథం): లక్ష మంది మహిళా వ్యాపార వేత్తలే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విశాఖపట్టణం సీఐఐ సమ్మిట్‌లో లింగ సమానత్వ స్పందన: సమగ్ర భవిష్యత్‌ను నిర్మిస్తున్నాం (Gender-Responsive Inno vatio n: Building Inclusive Futures) అనే అం శంపై చర్చా గోష్ఠిలో మంత్రి మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయంటే అందుకు ముఖ్యమంత్రిపై ఉన్న నమ్మకమేన న్నారు. ఆయన లీడర్ షిప్‌లో పనిచేస్తున్నాం కాబట్టే మాకు ఎంతో గౌరవం ఉందన్నారు. లక్ష ఎకరాల్లో కాఫీ పంట పండిస్తున్నారని, కాఫీని ప్యాక్ చేయడం వల్ల మహిళలకు ఆదాయం వస్తుందని, అది మహిళలకు ముఖ్యమంత్రి అందిస్తున్న ఆదాయ మార్గమ న్నారు. విశాఖకు గూగుల్ సంస్థ వస్తుందంటే పక్క రాష్ట్రాలు ఎంతో ఇబ్బంది పడ్డాయని అయినా ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్‌లు ఎంతో పట్టుదలగా వ్యవహరించి రాష్ట్రానికి తీసుకొచ్చార న్నారు. గతంలో రాష్ట్రం పేరు చెపితే పరుగెత్తిన సంస్థలు ఇప్పుడు రాష్ట్రానికి తిరిగి వస్తున్నాయని అందుకు ముఖ్యమంత్రి పాలనే కారణం అని కొనియాడారు. భవిష్యత్ తరాలు బాగుండాలని వారి అభివృద్ధి సంక్షేమానికి ముఖ్యమంత్రి కంకణబద్ధులై పనిచేస్తున్నా రన్నారు. నేను వెనుకబడిన ప్రాంతానికి చెందిన మహిళగా నేను చెపుతున్నానని మహిళాభివృద్ధికి చెందిన ప్రభు త్వంగా, ఒక మంచి ప్రభుత్వంగా పనిచేస్తున్నామన్నారు. మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళావృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని, రాష్ట్రంలో అందరు మహిళలు స్వేచ్ఛగా, సంతోషం గా, సేఫ్టీగా ఉండాలని పనిచేస్తుందన్నారు.

## ఇన్నోవేషన్ పాలసీపై అవగాహనతో వెళ్లాలి

మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ మేము మహిళల హక్కుల కోసం అంకితభావంతో పనిచేస్తా మన్నారు. మహిళల సమస్యలపై ప్రభుత్వానికి సలహాదారులుగా కూడా ఉంటామన్నారు. ఇన్నోవేషన్ పాలసీలపై మహిళలు అవగాహనతో ముందుకెళ్లాలన్నారు. డిజిటల్ గవర్నెన్స్‌ను ఆక ళింపు చేసుకుని ముందుకెళ్లాల న్నారు. ఏపీ మహిళా పక్షపాత ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన మహిళా శక్తిని తయారు చేస్తున్నామన్నారు. లింగ వివక్ష పోవాలంటే పట్టణాలు, గ్రామాల్లో అనే క్యాంపులు పని మహిళల్లో చైతన్యం తీసుకురావా లన్నారు. మహిళలకు ఆన్‌లైన్ సేఫ్టీ, అక్షరాస్యత పెంచడం, మహిళలపై దాడులను అరికట్టే విధంగా ప్రభుత్వాలు పనితీరు మెరుగ్గా అభిప్రాయపడ్డారు. అప్పుడే మహిళల సాధికారత సాధ్యమౌవడానికి ఈ చర్యలు దోహదపడతాయన్నారు. షారన్ బ్యూటుయో మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా నైపు ణ్యం లేదా అవగాహన లేదా సామర్థ్యాన్ని పెంపొందించుకో వాలన్నారు. డిజిటల్ సాధనాలను స్వీకరించడానికి వారిని బాగా సన్నద్ధం చేయాలని తెలిపారు. మిహీలా జోరిచ్వో మాట్లాడుతూ సాంకేతిక విద్య మహిళల జీవితాల్లో మార్పును తీసుకొస్తుంద న్నారు. చర్చా గోష్ఠికి మోడరేటర్‌గా సీఐఐ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.మురళీకృష్ణ వ్యవహరించారు.

# సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ హత్యే

- పరకామణి కేసులో నిందితుల కుట్ర
- ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలి
- విచారణ అధికారులకూ ప్రాణహాని ఉంది
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య



మంగళగిరి(చైతన్యరథం): సతీష్‌కుమార్ మరణంపై అనుమా నాలున్నాయి.. ఇది ముమ్మాటికి హత్యేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పరకా మణి దొంగతనం కేసులో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ ఫిర్యా దు దారుడిగా ఉన్నారు. వెంకటేశ్వర స్వామి సొమ్ము దొంగిలిస్తున్న ఉద్యోగి రవికుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ కేసు దర్యాప్తును ఎలా నీరుగార్చారు, రాజీ చేసిన అంశాలను ప్రస్తావించడం లేదన్న ఆయన.. సతీష్ మరణించిన వెంటనే వైసీపీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో 'పోలీసుల వేధింపులు సహించలేక సతీష్ ఆత్మహత్య చేసుకున్నారు' అని పోస్ట్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. భూమన కరుణాకర్‌రెడ్డి కూడా ఇదేవిధంగా మాట్లాడటంపై..గుమ్మడికాయ దొంగలు భుజా లు తడుముకున్నట్లుగా ఉందని విమర్శించారు. హత్యను ఆత్మ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని..ఈ ఘటన వెనుక వైసీపీ ముఖ్య నాయకులపైనే వేళ్లు చూపిస్తున్నాయని అన్నారు. పరాకమణి కేసులో ఈ పెద్దలకు సంబంధం లేకపోతే వెంటనే ఎందుకు స్పందించి బలవన్మరణమని పోస్ట్ పెట్టారని ప్రశ్నించారు. ఈ ట్విట్టర్ ఖాతాను ఎవరు ఆపరేట్ చేస్తున్నారు. ఎవరు పెట్టమం టే ఈ పోస్ట్ పెట్టారు. జగన్, భూమన, సజ్జల, వైవీ సుబ్బారెడ్డిలలో ఎవరు? అనే దానిపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సతీష్‌కుమార్ సీఐడీ విచారణకు రెండోసారి వస్తుండగానే హత్యకు గురికావడం పెద్ద సంచలనమని అన్నారు. ఇది పక్కా పథకం ప్రకారం జరిగిందని..పరాకమణి కేసులో తమపై వేళ్లు చూపబడుతున్న ముద్దాయిలందరూ కుట్రపన్ని సతీష్‌ను హత్య చేశారని ఆరోపించారు. దీనిపై తక్షణమే దర్యాప్తు జరపాలని అనంతపురం ఎస్పీ జగదీష్‌ని కోరారు. అంతేకాక ఈ కేసు దర్యా ప్తు చేసిన అధికారులైన సీఐ జగన్మోహన్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్, ఎస్.ఐ.లక్ష్మీరెడ్డిల ప్రాణాలకు ముప్పు ఉందని.. వారు డీజీపీకి భద్రత కోరుతూ లేఖ రాయాలని హెచ్చరించారు. ముఖ్యంగా దొంగతనం కేసులో ముద్దాయిగా ఉన్న రవికుమార్ ప్రాణాలకు కూడా తీవ్రమైన ముప్పు ఉందని..ఎందుకంటే అతను నోరు తెరిస్తే పరకామణి దోపిడీ సొమ్ము ఎవరికి చేరిందో మొత్తం బయటపడు తుందన్నారు. రవికుమార్, అలాగే అప్రూవర్‌గా మారే అవకాశం ఉన్న ధర్మారెడ్డి ప్రాణాలను కూడా పోలీసులు కాపాడాలని సీఐడీ చీఫ్ రవిశంకర్‌ని కోరారు. సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ హత్యే అని పునరుద్ఘాటిస్తూ నిందితులు ఎంతటి పెద్దవారైనా త్వరగా పట్టుకోవాలని శిక్షించాలని డిమాండ్ చేశారు. వివేకా హత్య జరిగి నప్పుడు మొదట్లో కొంతమంది నాయకులు, వర్గాలు ఆ మరణాన్ని సహజ మరణంగా లేదా గుండెపోటు, కిందపడటం వల్ల జరిగిన ప్రమాదంగా, లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించా రు.. తర్వాత 'నారా సుర రక్త చరిత్ర' అని సాక్షి పత్రికలో తప్పుడు రాతలు రాశారు. అంతకుముందు పరిటాల రవి హత్య కేసులో మొద్దు శీను, డాక్టర్ సాంబశివరావు, మద్దిలచెరువు సూరి, గోవర్ధన్‌రెడ్డి, ఓం ప్రకాష్, అజీజ్‌రెడ్డి వీళ్లందరు కూడా పరిటాల రవి హత్య కేసు తర్వాత హత్య గావించబడిన వారే. తర్వాత వివేకా హత్య కేసులో కనుమూరి శ్రీనివాసరెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధరరెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్ మెన్ రంగన్న వీరందరూ కూడా హత్య గావించబడ్డారు. సాక్షులు నిర్భయంగా కోర్టులలో వాస్తవాలను వెల్లడించే వాతావరణాన్ని కల్పించడం కోసం పోలీసులు చర్యలు తీసుకోవాలి. పోలీసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని, సాక్షులకు తగిన భద్రత కల్పించా లని కోరారు. ఈ హత్య ఒక పెద్ద కుట్ర..బాధ్యులందరిపై చట్టప రమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ తరపున సతీష్ కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ డిపార్టుమెంట్ తరపున అతనికి రావాల్సిన రాయితీలు అందేలా చూస్తామన్నారు. ఈ హత్యకు కారకులైన వారు ఎంతటి పెద్దవారైన వదిలిపెట్టబో మని స్పష్టం చేశారు.

# మాజీ ఎంపీ ఎన్.రెడ్డప్ప బంధువు కబ్జా

- వారసత్వ భూమిపై వైసీపీ నేత కన్ను
- పొలంలో అడుగుపెట్టనివ్వకుండా బెదిరింపులు
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితురాలి ఫిర్యాదు





మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరీ, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా అర్జీలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా సోమల మండలం వల్లిగట్ల గ్రామానికి చెందిన బెల్లం రెడ్డెమ్మ అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. 1965 లో తన అత్తగారు బెల్లం వెంకటమ్మ సక్రమ రిజిస్ట్రేషన్‌తో కొనుగోలు చేసిన ఎకరం భూమి తమ కుటుంబం అనుభవంలో ఉంది. తన భర్త మరణానంతరం వారసత్వ హక్కుతో ఆ భూమి తన పేరుకు వచ్చింది. పట్టాదార్ పాస్‌బుక్, 1బీ, అడంగల్ ఒరిజినల్ పట్టా డాక్యుమెంట్లు తన పేరునే ఉన్నాయి. తమ భూమిపై పి.జి.రెడ్డెప్ప సరిహద్దులు తొలగించి వివాదం సృష్టించ డంతో పలుమార్లు సర్వేలు జరిపించగా అన్ని సర్వేల్లో భూమి తనదేనని అధికారులు ధృవీకరించారు. గత వైసీపీ పాలనలో పి.జి.రెడ్డెప్ప తన బంధువైన మాజీ ఎంపీ ఎన్.రెడ్డప్ప ప్రభావం ద్వారా ఆర్డీవో, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేసి రికార్డులను తారుమారు చేయించే ప్రయత్నాలు చేశారు. గ్రామంలోని కొంద రిని డబ్బులు ఇచ్చి దొంగ సాక్షులుగా తయారు చేస్తూ బెదిరిం పులకు పాల్పడుతున్నాడు. వారిపై చర్యలు తీసుకుని తన వారసత్వ భూమిని కాపాడాలని అభ్యర్థించారు.

## పొలంలోకి వెళ్లకుండా బెదిరిస్తున్నారు

ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ పూర్వీకుల నుంచి వంశపారంపర్యంగా వచ్చిన సర్వే నెం.15/5లో 1-12 సెంట్ల భూమి ఉంది. గుమ్మల అంజ మ్మ, అనుమల సాంబయ్య, అనుమల కోటేష్, అనుమల సుధా, అనుమల సురేష్, గుమ్మల కోటయ్య అల్లుడు వెంకటేశ్వ ర్లు, కుమారుడు శ్రీను, పెరుగు వెంకటసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లు తదితరులు కలిసి తమను పొలంలోకి వెళ్లనివ్వ కుండా బెదిరిస్తూ ట్రాక్టర్ డ్రైవర్లను కూడా బెదిరించి పంపిస్తు న్నారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిందితుల్లో ఒకరైన అనుమల సాంబయ్య ప్రస్తుత వైసీపీ మండల అధ్యక్షుడు. తనపై దాడి చేసి బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## భూమి రికార్డుల తారుమారు

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి చెందిన ఈరన్న గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్లు 575/2 - 1.55 సెంట్లు, 575/3 -4.83 సెంట్లు, 575/3ఏ- 1.83 సెంట్లు మొత్తం య. 8.21 సెంట్ల భూమి కలదు. ఈ భూమిలో హంద్రి నీటి పారుదల కాలువకు 38 సెంట్లు వెళ్లడంతో ప్రభుత్వం ఆభాగానికి సంబంధించిన నష్టపరిహారం చెల్లించింది. అయితే 2021 డిసెంబర్ 20న కుంకనూరు గ్రామానికి చెందిన డి. నల్లన్న, డి.మునిస్వామి అనే వ్యక్తులు భూ రికార్డులను తారు మారు చేసి ఆన్‌లైన్‌లో అక్రమంగా తమ పేర్లు ఎక్కించుకు న్నారు. గతంలో ఈ ఇద్దరికి మొత్తం 3 ఎకరాల భూమిని కౌలు ఆధారంగా ఇచ్చినపుడు అదే విషయాన్ని వక్రీకరించి మొత్తం భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫీల్డ్ మ్యాప్ బుక్‌లో ఇప్పటికీ తమ తండ్రి పేరే ఉందని అయినప్ప టికీ రెవెన్యూ అధికారులు తమ ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేశారు

ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రఘునాదపురం గ్రామానికి చెందిన యరియమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం.579/5, 580/2, 580/3 లలో మొత్తం 3.30 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని మూడు దశాబ్దాలుగా సాగుచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాం. ఈ భూమికి ప్రభుత్వం 20 సంవత్సరాల క్రితం పట్టా మంజూరు చేసిందని ఆ భూమి తమ ఆధీనంలో ఉంది. అయితే గత ప్రభుత్వ కాలం లో వైఎస్ఆర్ పార్టీ నాయకుడు శెట్టిపల్లి నారాయణ, అతని భార్య కృష్ణకుమారి తమకు ఇప్పటికే అసైన్‌మెంట్ భూమి 10 ఎకరాలు జిరాయితీ భూమి 10 ఎకరాలు ఉన్నప్పటికీ తమ భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో తమ పేర్లతో నమోదు చేయిం చుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## భూ కబ్జాలపై ఫిర్యాదుల పరంపర

- కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన ఖాజ హుసెన్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 195/2ఏలోని 0.55 సెంట్ల భూమిని అల్లబండ అబ్దుల్ సాబ్ కుమారుడు అల్లబండ మత్తు సాబ్ అక్రమంగా ఆక్రమించాడు. ఈ విషయంపై ప్రశ్నించగా ఎవరికైనా చెప్పుకో భయం లేదని దౌర్జన్యం చేస్తున్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే అధికారులు ఆయనను పిలిచి మాట్లాడినా లెక్కచేయడం లేదు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరిం చాలని కోరాడు.
- ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పాలువారిపల్లి గ్రామానికి చెందిన పుల్లమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 310/పీలో భూమికి ప్రభుత్వం పట్టా ఇచ్చింది. పట్టా ఆధారంగా ఆ భూమిని అప్పటి నుంచి తమ కుటుంబమే నిరంతరం సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. అయితే ఇటీవలి కాలంలో పాలూరి మంద వలే, ఇండరెడ్డి అనే వ్యక్తులు తమ భూమిని అక్రమంగా ఆక్ర మించి భూమి నుంచి తమను బయటకు తోసివేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.
- కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెల్ల గ్రామానికి చెందిన గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. కేఎం వలస గ్రామం పరిధిలో య.2.98 సెంట్ల భూమి ఉంది. సర్వే నెం 7/16లో య.1.16 సెంట్ల ఈ భూమిపై తమకు ఎటువంటి చట్టపరమైన సమ స్యలు లేకపోయినా స్థానిక తహసీల్దార్ సరైన సంతకం లేకుండా బౌండరీ తప్పుగా గుర్తించి తమ భూమిని రెడ్ మార్క్ పెట్టి భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.
- పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన దర్గం రంజని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.560లో య.1.25 సెంట్ల భూమి కలదు. అందులో 70 సెంట్ల భూమిని మల్లేల నీడు, కురపాటి కృష్ణశ్వరరావు అనే వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారు. తమ భూమిలో సర్వే నిర్వహించి హద్దులు వేసి తమకు సంబంధించిన భూభాగాన్ని పాస్‌బుక్‌లో నమోదు చేయాలని సూచించినప్పటికీ ఆక్రమణదారులు భూమిలోకి రానివ్వకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## సిఐఐ సదస్సుకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో రెండు రోజుల పాటు సాగిన సీఐఐ సదస్సులో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో ఏపీ అభివృద్ధి, చేపట్టబోతున్న ప్రణాళికలు తెలియజేస్తూ సాగిన ఈ సదస్సు ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం శుభసూచికమన్నారు. రాజధాని అమరావతిలో అభివృద్ధి సాగనుందని, అమరావతి నిర్మాణం వంటి అంశాలను సీఆర్‌డీఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీకి విశాలమైన సుమద్ర తీరం ఉందని, ఎక్కడైనా టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్



కురుపాం (చైతన్యరథం): రైతులకు ఎటువంటి కష్టం, నష్టం కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం కురుపాం మండల కేంద్రంలో ఉన్న రైతు సేవ కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్నం పెట్టే అన్నదాతలు ఇబ్బందులు పడకుండదని ధాన్యం కోనుగోలు చేస్తామని అన్నారు. అన్నదాతల కళ్ళల్లో కాంతులు నింపాలనదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని అన్నారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని అన్నారు.

## హామీని నెరవేర్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు ఏపీ ఎన్.ఆర్.టి సింగపూర్ సభ్యులు




సింగపూర్ ప్రవాసాంధ్రులు ఎంత గానో వేచి చూస్తున్న సింగపూర్‌విజయవాడ అంతర్జాతీయ విమాన సర్వీసు పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా ఏపీ ఎన్.ఆర్.టి సింగపూర్ సభ్యులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ ఫ్లైట్ వల్ల తెలుగు ప్రజలకు సింగపూర్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుతాయని, ప్రయాణ సమయం కూడా బాగా తగ్గి,చార్జెస్ అందుబాటులో ఉండటం వల్ల టూరిజం బాగా డెవలప్ అవుతుంది అని భావిస్తున్నట్లు తెలియచేశారు. ముఖ్యంగా గత జూలైలో చంద్రబాబు సింగపూర్ పర్యటన సందర్భంగా తెలుగు డయాస్పోరా, సింగపూర్ మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్‌లో ఏపీ ఎన్.ఆర్.టి సింగపూర్ సభ్యులు సింగపూర్ - విజయవాడకు ఫ్లైట్ సదుపాయం కల్పించాలి అని చంద్రబాబును విజ్ఞప్తి చేయడం జరిగింది. ఆ రోజు తప్పకుండా విమాన సర్వీసులు పునరుద్ధరిస్తం అని సీఎం హామీ ఇవ్వడం జరిగింది. హామీ ఇచ్చిన వంద రోజుల్లో అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు మరియు ఐ.టి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో ఎంతో చొరవ తీసుకుని విమాన సర్వీసుని అందుబాటులోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి పూర్తి సహకరించిన కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మరియు ఏపీ ఎన్.ఆర్‌టి చైర్లన్ వేమూరి రవికుమార్‌కు ధన్యవాదములు తెలిపారు.

## బ్రాండిక్స్ పరిశ్రమను పరిశీలించిన కేంద్ర మంత్రి



ఎలమంచిలి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం ఎస్ఈజెడ్లోని బ్రాండిక్స్ దుస్తుల పరిశ్రమను హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి కేంద్రమంత్రి పియూష్ గోయల్ పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులతో కేంద్రమంత్రి మాట్లాడారు. దుస్తుల తయారీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఆర్థికంగా వచ్చిన ఇబ్బందులపై చర్చించారు. వేలమంది మహిళలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. కేంద్రమంత్రికి బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి ఇక్కడ దుస్తుల తయారీ గురించి వివరించారు.

## విశాఖలో ఘనంగా బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలు

**● ముఖ్య అతిధులుగా హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి సంధ్యారాణి**



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం ఏ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో ఆదివాసీ ఐక్యత, హక్కుల పరిరక్షణ, గిరిజన గౌరవం ప్రతిఫలించేలా బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించబడ్డాయి. గిరిజన ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయమైన బిర్సా ముండా సేవలకు దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పిస్తున్న సందర్భంలో విశాఖలో జరిగిన ఈ వేడుకలకు విపరీతమైన ప్రజాశ్రద్ధ లభించింది కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయుడు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హాజరై జయంతి ఉత్సవాలకు మరింత గౌరవం తీసుకువచ్చారు. వేదికపై నేతలు బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన త్యాగం, సేవ, పరాక్రమాన్ని స్మరించారు. బిర్సా ముండా స్వాతంత్ర్య పోరాటాన్ని మాత్రమే కాదు, గిరిజనుల ఆత్మగౌరవాన్ని రక్షించడానికి నడిచిన మహోన్నత దారిని దేశం ఎప్పటికీ మరిచిపోదని వారు పేర్కొన్నారు. మంత్రి రామ్ మోహన్ నాయుడు మాట్లాడుతూ... "గిరిజన సమాజ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యం. బిర్సా ముండా చూపిన ధైర్యం, నాయకత్వం నేటి తరానికి మార్గదర్శకం. గిరిజన ప్రాంతాల మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో కేంద్రం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది," అని తెలిపారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ... "గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రత్యేక కార్యాచరణ పథకాలు అన్ని జిల్లాల్లో ప్రభావవంతంగా అమలు అవుతున్నాయి. బిర్సా ముండా జయంతిని 'గిరిజన జాతీయ గౌరవ దివస్'గా అలంకరించడం గిరిజన సమాజ పట్ల ప్రభుత్వం చూపుతున్న గౌరవానికి నిదర్శనం," అన్నారు. గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... "గిరిజనుల ఆర్థిక శక్తివంతీకరణ మా ప్రధాన లక్ష్యం. అడవి వనరుల ప్రాసెసింగ్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్ వ్యవస్థ బలోపేతం, గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి వంటి పథకాలను వేగంగా అమలు చేస్తున్నాం," అని వివరించారు.

## జగన్ హయాంలో పారిశ్రామికవేత్తలను తరిమేశారు


విజయనగరం (చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏపీకి పెట్టుబడులు తీసుకురావడానికి ఎంతగానో కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. కానీ జగన్ అండ్ టీమ్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. శనివారం విశాఖపట్నం వేదికగా మీడియాతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడారు. పెట్టుబడులపై తమ ప్రభుత్వాన్ని విమర్శించడమే జగన్ అండ్ కో పనిగా పెట్టుకున్నారని ఫైర్ అయ్యారు. మొదటగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశిస్తే దాన్ని దాటిపోతున్నాయని వివరించారు. జగన్ ఐదేళ్ల పెట్టుబడులను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. జగన్ హయాంలో రాష్ట్రం నుంచి పారిశ్రామిక వేత్తలను తరిమేశారని మండిపడ్డారు. చంద్రబాబుకు సీఎం పదవి ముఖ్యం కాదని.. రాష్ట్ర భవిష్యత్తు మాత్రమే ముఖ్యమని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై సంతృప్తిగా ఉన్నారని వివరించారు. విశాఖపట్నం పెట్టుబడుల సదస్సును సోషల్ మీడియాలో యువత కూడా స్వాగతిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే పెట్టుబడులకు మద్దతుగా భారీస్థాయిలో యువత పోస్టులు పెడుతున్నారని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా వైసీపీ అండ్ కోకు జ్ఞానోదయం కలగాలని హితవు పలికారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి పెట్టుబడులు ఏపీకి మరిన్ని రావాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆకాంక్షించారు.

## మట్టి మనిషి అనేక పుస్తకాన్ని ఆవిష్కరించిన మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ (చైతన్యరథం): సమాజ హితం కోరే సాహిత్యమే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నాగాయలంకలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి, జర్నలిస్టు జి.సూర్యనారాయణ రచించిన 'మట్టి మనిషి' కవితా సంపుటిని బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆకలి, ఆవేదన నుంచి పుట్టిన కవిత్వం అందరి హృదయాలను తాకుతుందన్నారు. ప్రజాకవి అందెశ్రీకి అక్షర జ్ఞానం లేకపోయినా వాగ్దేవి ఆయన నాలుకయందు ఉండి అపారమైన ప్రజా సాహిత్య సంపదను సృష్టించిందన్నారు. విశ్వజనీయమైన కవిత్వం సృష్టించిన రవీంద్రనాథ్ ఠాగూర్, గురజాడ అప్పారావు, సినారే వంటి వారు చరిత్రలో శాశ్వతంగా నిలిచారన్నారు. శ్రీకృష్ణదేవరాయలు, రాజరాజ నరేంద్రుడు లాంటి ఎంతో గొప్ప చక్రవర్తులు, రాజులు తమ రాజ్యాల వ్యాప్తి ద్వారా కంటే, సంగీత సాహిత్య కళల పోషణ ద్వారానే అజరామర కీర్తి ప్రఖ్యాతలు సొంతం చేసుకున్నారని చెప్పారు. సామాజిక అంశాలతో కవితలు రాస్తున్న సూర్యనారాయణ కలం నుంచి మరెన్నో సంపుటాలు రావాలని ఆయన ఆకాంక్షించారు. దివిసీమ కవులు డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, నడకుదిటి రాధాకృష్ణ మూర్తి మట్టి మనిషి కవితలను విశ్లేషించారు. పుస్తక ప్రచురణకర్త, మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావును ఎమ్మెల్యే సత్కరించారు.

## మరో అల్పపీడనం.. మరోసారి భారీ వర్షాలు



నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరప్రాంతంలో అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. అల్పపీడనం కారణంగా సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని ఆయన వెల్లడించారు. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ- వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని పేర్కొన్నారు. సోమవారం రోజు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, కడప జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం నాడు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. అలాగే ప్రకాశం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వెల్లడించారు. దీని ప్రభావంతో దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. సోమవారం వరకూ మత్స్యకారులెవరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

# ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి : వసంత



మైలవరం (చైతన్యరథం): ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరం పట్టణంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏపీకి పెట్టుబడులు తెచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి విశేష కృషి చేస్తోందన్నారు. ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చి పరిశ్రమలను నెలకొల్పేలా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటివరకు 18 నెలల్లో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆయా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. సంక్షోభం నుంచి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కళాశాలలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, ఎన్డీయే కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తుళ్లూరు (చైతన్యరథం): తుళ్లూరు మండలం మల్కాపురం గ్రామంలో ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో తెదేపా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన స్థానిక ఉన్నత పాఠశాల, అక్కడి మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్ల అపరిశుభ్రంగా ఉండటంపై విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గన్నవరం విమానాశ్రయానికి పునర్ వైభవం ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): తమ కూటమి ప్రభుత్వ చొరవతో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి పునర్వైభవం వచ్చిందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం సింగపూర్ విమాన సర్వీసును శనివారం ఉదయం ఎమ్మెల్యే యార్లగడ్డ జండా ఊపి ప్రారంభించారు. సింగపూర్ విమాన సర్వీసు ప్రారంభోత్సవ సందర్భంగా కేకు కోసి, మొదటి ప్రయాణికునికి బోర్డింగ్ పాసును అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ 2014-19 మధ్యకాలం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు ప్రభుత్వం శ్రద్ధ చూపటంతో ఇక్కడి నుంచి ప్రతిరోజు 30 విమాన సర్వీసులు నడిచేవని అత్యధిక ప్రయాణికుల సగటుతో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అశ్రద్ధ చేయటంతో విమాన సర్వీసులు తగ్గిపోయి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గింది అన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో ఆరేళ్లుగా ఆగిపోయిన సింగపూర్ విమాన సర్వీసు తిరిగి ప్రారంభమైందని యార్లగడ్డ చెప్పారు. ప్రస్తుతం గన్నవరం విమానాశ్రయం నుండి ప్రతిరోజు 45 విమాన సర్వీసులు నడుస్తుండగా 4వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుండి ఎక్కువమంది విదేశాలకు రాకపోకలు సాగిస్తున్నందున వీరికి గన్నవరం విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని ఇక్కడి నుంచి విదేశీ విమానాలకు కనెక్టివిటీని పెంచగలిగితే ఈ ఐదు జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. రాబోయే ఏడు నెల కాలంలో అంతర్జాతీయ టెర్మినల్ నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుందని యార్లగడ్డ పేర్కొన్నారు. కతార్, అరబ్ ఎమిరేట్స్ కు విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే వెంకట్రావు తెలిపారు. విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు అమరావతిలో భూముల కేటాయింపు, పరిహారం చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా యార్లగడ్డ హామీ ఇచ్చారు.

# అనారోగ్య బాధితుల్ని మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆదుకుంటోంది

● నియోజకవర్గంలోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు




చిలకలూరిపేట (చైతన్యరథం): అనారోగ్య సమస్యలు, ఆపదలతో బాధపడే ప్రజల్ని కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకుంటోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నాదెండ్ల, యడ్లపాడు మండలాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి కూటమి నాయకులతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ.ఎం.ఆర్.ఎఫ్) నగదు చెక్కుల్ని అందచేశారు. 24 మంది లబ్ధిదారులకు రూ.12.70 లక్షల విలువైన చెక్కుల్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల్ని స్వయంగా ఎమ్మెల్యేలు,మంత్రులు ప్రజలకు అందించి, వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం ప్రజలపై ఆయనకున్న ప్రేమాభిమానాలకు నిదర్శనమన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ప్రజలకు మెరుగైన వైద్యం.. అన్నిసమయాల్లో ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత పాలకులు నెట్ వర్క్ ఆసుపత్రులకు బకాయిపెట్టిన ఆరోగ్య శ్రీ బకాయిల్ని చంద్రబాబు చెల్లించారని, ప్రజలకు అందించే వైద్యసేవల్లో లోపాలు, పొరపాట్లు లేకుండా చూడాలని ఆసుపత్రుల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే ఆసుపత్రులు, సంస్థలపై కూటమి ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేతుల పరిశుభ్రతే ఆరోగ్య రక్ష

●స్వచ్ఛత ప్రతిజ్ఞను అనుసరించాలి... ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): 'స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం భాగంగా రాజమహేంద్రవరం జీ అండ్ టీ రోడ్డులోని ఈట్ స్ట్రీట్ వద్ద శనివారం నిర్వహించిన పరిశుభ్రత ఫోటో ఎగ్జిబిషన్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... పరిశుభ్రతను ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సంరక్షణలో చేతుల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, నిత్యం చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా 80 శాతం వ్యాధులను నివారించవచ్చని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి నెల మూడవ శనివారాన్ని 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' దినోత్సవంగా నిర్వహిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా మార్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నగరంలో చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో శుభ్రత కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం-ప్రజలు చేతులు కలిపితే స్వచ్ఛత ఉద్యమం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఈఈ మాధవి, సీఎంఎం రామలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పదవి అలంకారం కాదు.. ఒక బాధ్యత

●ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్త ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి

●అన్న ఎన్టీఆర్ ఆశయాలు.. సీఎం చంద్రబాబు స్ఫూర్తి మన లక్ష్యం



జగ్గంపేట (చైతన్యరథం): పదవి ఒక అలంకారం కాదని.. దాన్ని బాధ్యతగా తీసుకుని తెలుగుదేశం పార్టీ ఆశయాలకు, పవిత్ర లక్ష్యాలకు, ప్రజాసేవా భావంతో క్రమశిక్షణతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలని జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ పేర్కొన్నారు. గండేపల్లి మండలం జెడ్ రాగంపేట పంచాయతీలో గల పరిణయ ఫంక్షన్ హాల్లో శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గం మండల, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల 2632 మంది సభ్యుల చేత ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ పి రాజశేఖర్, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్, నియోజకవర్గ పరిశీలకులు ఎస్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ, నవీన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టను పరిరక్షించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం కష్టపడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. నిత్య చైతన్యంతో పార్టీ భవిష్యత్తు కోసం కష్టపడిన వారికి తగిన విధంగా గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ బలం కార్యకర్తలేనని, గత పాలకులు ఎన్ని బెదిరింపులకు దౌర్జన్యాలకు గురిచేసినా కష్టసుఖాలను ఎదుర్కొని పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ గుర్తింపు ఇచ్చి ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గడిచిన 17 నెలల కాలంలో నియోజవర్గాన్ని200 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం చేశామన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజల సంక్షేమం దిశగా దూసుకుపోతుందన్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. అలాగే మహిళలకు కూడా తగు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు.నవీన్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకున్న మండల అధ్యక్షులు, అన్ని విభాగాల వారు ఐక్యంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ గ్రామాల్లో ఏకగ్రీవం అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ గౌరవం కల్పిస్తుందని, నిస్వార్థంగా, దీక్ష దక్షతలతో, అంకితభావంతో, పని చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. పండగ వాతావరణంలో నియోజకవర్గం మండల, క్లస్టర్, యూనిట్,బూత్ డివిజన్ కమిటీ చేత ప్రమాణస్వీకారం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముందు స్థానికరావులమ్మ నగర్లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. నూతన సభ్యులకు భవిష్యత్తులో తీసుకోవాల్సిన కర్తవ్యాలపై నిర్దేశించారు. అనంతరం కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## పర్యావరణం, పరిశుభ్రత పరంపర అలవాటుగా మారాలి

●స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): ప్రతి ఒక్క కుటుంబంలో పర్యావరణ స్పృహ, పరిశుభ్రత అనేవి పరంపర అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. భవిష్యత్ తరాలకు మెరుగై న సమాజం, ప్రశాంత వాతావరణం కోసం అవి తప్పనిసరిగా పేర్కొన్నారాయన. వినుకొండ కారంపూడి రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, మన పరిశుభ్రత-మన ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు విద్యార్థులు, సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలోనూ ఎన్నడూ లేని రీతిలో అయిదేళ్ల వైసీపీ పాలనలో చెత్తపై పన్ను వసూలు చేశారని, పైగా 80 లక్షల మెట్రిక్ టన్నుల మేర చెత్తను ఎక్కడికక్కడే వదిలేసి పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రావడంతోనే చెత్త పన్ను రద్దు చేయడంతో పాటు వాళ్లు వదిలేసి పోయిన చెత్తను తొలగించామన్నారు. ఆరోగ్యాన్ని సాధించాలంటే పరిశుభ్రత ఉండాలని, అందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని, భావితరాలకు పరిశుభ్రత వారసత్వంగా అందజేయాలని, అందులో భాగంగానే పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కాలుష్య నివారణకు తోడ్పడాలని, తద్వారా ఆరోగ్యం కాపాడుకోవడమే కాక భావితరాలకూ కాలుష్య రహిత సమాజ అందించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయం, రోడ్ల మీద ఇలా అన్నిచోట్లా పరిశుభ్రతే కనిపించాలని, స్వచ్ఛమైన, పచ్చనైన, ఆరోగ్యకరమైన రాష్ట్రం కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు.

## ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెరగాలి

●జగ్గయ్యపేటలో స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం పర్యటన



జగ్గయ్యపేట (చైతన్యరథం): స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద "మన పరిశుభ్రత - మన ఆరోగ్యం" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అవగాహన సదస్సుల్లో భాగంగా, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం శనివారం జగ్గయ్యపేట పట్టణాన్ని సందర్శించారు. పరిశుభ్రతలో నవీన మార్పులు, ఆధునిక పద్ధతుల అమలు, సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో పట్టాభిరాంతో పాటు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సమస్యలు, మున్సిపాలిటీ పనితీరు, పరిశుభ్రత చర్యలు, కాలుష్య నిర్మూలన పథకాలు, డ్రైనేజ్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు నేతలు సమగ్రంగా చర్చించారు. జగ్గయ్యపేట పట్టణం పరిశుభ్రతలో ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలవాలంటే మున్సిపల్ యంత్రాంగం మరింత చురుకుదనంతో పనిచేయాలని, స్వచ్ఛంద కార్పొరేషన్ తరపున అవసరమైన సాంకేతిక సహాయం, నిధులు, పరికరాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై శాశ్వత అవగాహన పెంపు కోసం పాఠశాలలు, సంఘాలు, సాయుధ దళాలు, డ్వాక్రా సమూహాలతో కలిసి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పట్టాభిరాం పేర్కొన్నారు.

పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత అనేవి ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమైన అంశాలని, ప్రభుత్వం మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధులు ప్రజలు కలిసి పనిచేస్తేనే పట్టణాన్ని పూర్తిగా శుభ్రమైన మోడల్ టౌన్‌గా మార్చగలమని నెట్టెం రఘురాం పేర్కొన్నారు.

## నూతన పాలకవర్గం ప్రణాళికతో పనిచేయాలి

నందిగామ (చైతన్యరథం): పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మార్మోగింది. శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. దేవాలయ కమిటీ చైర్మన్ మహంకాళి వెంకటేశ్వరరావు (వెంకన్న గురుస్వామి)ను శాలువాతో సత్కరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దేవాలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన దిశగా కొత్త కమిటీ సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ చైర్మన్ సభ్యులు, కూటమి నేతలు, మహిళలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలి : వేగేశన




బాపట్ల (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అంశాలను ప్రధానాంశంగా కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో శనివారం బాపట్ల పట్టణంలోని తాశీల్దార్ కార్యాలయం వద్ద "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ గంగాధర్ గౌడ్, ఆర్.డి.ఓ గ్లోరియా,తాసిల్దార్ సలీమా, బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు మరియు పురపాలక సిబ్బంది ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ... ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఒక్కో అంశంపై ప్రజలను చైతన్యవంతులను చేయడం, పరిశుభ్రత కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడం జరిగిందని, అందులోభాగంగానే ఈ శనివారం వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టమన్నారు. ప్రధానంగా బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధం, చేతులు శుభ్రపర్చుకోవడంపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించామని, విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాలను విధిగా చేపట్టాలని అన్నారు. ఎక్కువమంది ఒకచోట పనిచేసే ప్రదేశాల్లోనూ ఆయా ప్రాంతాల్లో టాయిలెట్ల పరిశుభ్రతపై దృష్టిపెట్టడం, బహిరంగ మల, మూత్ర విసర్జన వలన అనర్థాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను అధికారులు చేపట్టాలని సూచించారు.

## ఆలయాల్లో ఆధ్యాత్మిక విలువలు ప్రోత్సహించాలి : కాగిత



పెడన (చైతన్యరథం): నియోజకవర్గం గూడూరు మండలం కంకటావ గ్రామములో శ్రీ ఉమామహేశ్వర, వేణుగోపాల, వెంకటాచల స్వామి దేవస్థాన ధర్మకర్తల కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన తోటా విష్ణుమూర్తికి ఎమ్మెల్యే ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక విలువల ప్రోత్సాహం తన ప్రాధాన్యత కర్తవ్యాలలో ఒకటని, దేవాలయాలు ప్రజల్లో భక్తి, శ్రద్ధ, సత్సంకల్పాలు పెంపొందించే కేంద్రాలుగా మారాలన్నారు. కొత్త కమిటీ సభ్యులు ఈ దిశగా చురుగ్గా పనిచేయాలని, సేవాతత్పరతతో కమిటీ సభ్యులు పనిచేసి భక్తుల మన్ననలు పొందాలన్నారు. అనంతరం గూడూరు మండలం కంకటావ గ్రామములో శ్రీ ఉమామహేశ్వర వేణుగోపాల వెంకటాచల స్వామి దేవస్థానం ఆలయ ముఖ మండపము, ధ్వజస్తంభం స్లాబ్ పనులకు పున నిర్మాణ శంఖుస్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు.

## నూతన అధ్యాయానికి తెరతీసిన ఏపీ సీఐఐ సదస్సు- 2025



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో నిర్వహించిన రెండురోజుల ప్రతిష్టాత్మక సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అభివృద్ధికి నాంది పలుకుతూ పెట్టుబడిదారులను ఆహ్వానించారని అన్నారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అత్యంత ప్రశంసనీయమని, అనేక దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మరో దశలోకి అడుగుపెడుతోందని మన్నవ మోహనకృష్ణ అన్నారు. విశాఖ వేదికగా రెండురోజులు పాటు సాగిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్ అయింది. రెండు రోజుల్లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం గొప్ప రికార్డు అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో యువతకి 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ముందుకు వెళ్తుంది. విశాఖపట్నంలో ఈ సీఐఐ సమ్మిట్ నిర్వహణతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మారిందని, పరిశ్రమలకు భూములు, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంటే, గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్క నూతన కంపెనీ రాకపోగా, ఉన్న పరిశ్రమలనే వెళ్లగొట్టి రాష్ట్రాన్ని దెబ్బతీశారని అన్నారు. ఈ సీఐఐ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశవ్యాప్తంగా అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి రాష్ట్రంగా మార్చడమే ముఖ్య లక్ష్యమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ స్పష్టం చేసారు.

## పరిశ్రమలకు ఏపీ స్వర్గధామం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల ఏర్పాటుకు స్వర్గధామంగా మారిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే శనివారం ఓ పత్రికా ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ను ఆర్థిక అగ్రామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఐఐ సమ్మిట్ వేదికగా మారిందని చెప్పారు. రెండు రోజుల్లో పలు ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందాలను కుర్చుకుని రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు అందించేందుకు చర్యలు తీసుకుందని అన్నారు. ఇప్పటి వరకు ?5,22,471 కోట్ల పెట్టుబడులతో జరిగిన ఒప్పందాల ద్వారా 2,67,239 ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామని వెల్లడించారు. విండ్-సోలార్ హైబ్రిడ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, బయోఫ్యుయల్స్, పంప్డ్ హైడ్రా స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, అగ్రివోల్టాయిక్స్, పునరుత్పాదక ఇంధన తయారీ వంటి ఆధునిక రంగాల వైపు ప్రపంచ దిగ్గజ సంస్థల ఆసక్తి రాష్ట్ర సామర్థ్యాన్ని మరోసారి నిరూపించాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలనే తరిమికొట్టారని, దీంతో యువత భవిత అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. ఐదేళ్లపాటు ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి తీసుకురాలేకపోయిన జగన్ .. క్రెడిట్ చోరీ అని చౌకబారు విమర్శలు చేయడం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

# పరిశుభ్ర పలమనేరు సంకల్పానికి సహకరించాలి

## పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పిలుపు




పలమనేరు, (చైతన్యరథం): పరిశుభ్ర పలమనేరు సాధించే సంకల్పానికి నియోజకవర్గ ప్రజలందరూ కట్టుబడిఉండాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, ప్రజలతో స్వచ్ఛంద ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాలకు శ్రమదానం చేసి పరిశుద్ధ ఆంధ్రప్రదేశ్ సాధించటానికి సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సామూహిక పరిశుభ్రత, ఆరోగ్యం పై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మునిరాజు, కౌన్సిలర్లు సునీతా నాగరాజు, కిరణ్, బిఆర్సి కుమార్, టీడీపీ నాయకులు కుట్టి, ఖాజా, లోకేష్, చిన్ని, రమేష్, సుదర్శన్ బాలాజీ, భాస్కర్, వెంకటరమణ, మహిళా నాయకులు ప్రమీలమ్మ, మురాదులతో పాటు పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు నరసింహులు, సీతారామయ్య, నారాయణ తదితరులున్నారు.

# విద్యార్థిదశలోనే బంగారు భవిష్యత్తుకు పునాది

## చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



చంద్రగిరి, (చైతన్యరథం): చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం"స్వర్ణ ఆంధ్రా....స్వచ్ఛ ఆంధ్రా" కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు "స్వర్ణ ఆంధ్రా....స్వచ్ఛ ఆంధ్రా" కార్యక్రమం మండలంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు తదితర విభాగాలలో అంకిత భావంతో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. దానిలో భాగంగా పట్టణంలోని బాలికల పాఠశాలలో స్వర్ణ ఆంధ్రా....స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణ చర్యలు భాగంగా ప్రతి పంచాయతీలోని ప్రజలకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. తడి పొడి చెత్తంతా కలిపి ఒకే దాంట్లో వేస్తే వాటిని విడదీయడానికి చాలా ఇబ్బంది అవుతుందని, ప్లాస్టిక్ కవర్లు వాడితే అవి మట్టిలో కలవడానికి సంవత్సరాల తరబడి భూమి పొరల్లో ఉండిపోతాయని, తద్వారా పర్యావరణం దెబ్బ తింటుందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకుండా ఉంటే చెత్త పేరుకుపోయి దోమలు, ఈగలు పెరుగుతాయని, దోమల వల్ల మలేరియా డెంగ్యూ, టైఫాయిడ్, కలరా వంటి రోగాలు ప్రబలుతాయన్నారు. పాఠశాల ఆవరణంలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోని సమస్యలను ప్రిన్సిపాల్, ఎంఈఓలు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. కళాశాల ప్రాంగణంలోని బాలికల బీసీ హాస్టల్ శిధిలావస్థకు చేరుకున్న విషయం హాస్టల్ వార్డెన్ ప్రస్థావించారు. వెంటనే అధికారులతో కలసి బిల్డింగ్ ను పరిశీలించి సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అందరి బాధ్యతతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యం

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు, (చైతన్యరథం): స్వర్ణాంధ్ర ఆంధ్ర – స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల వ్యక్తిగత శుభ్రతతో పాటు మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్లో గిద్దలూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మొదటగా పారిశుధ్య కార్మికులను కలుసుకొని వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. గిద్దలూరు పరిధిలో తెల్లవారుజామునే లేచి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల శ్రమ ఎంతో ఉందని వారిని అభినందించారు.. అనంతరం శ్రీ పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాల వేసి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది మరియు నాయకులతో కలిసి స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిద్దలూరు పట్టణంలో 15 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. అదే విధంగా గిద్దలూరు పట్టణ ప్రజల సౌకర్యార్థం రెండు కోట్ల రూపాయలతో వాకింగ్ ట్రాక్‌తో కూడిన పార్క్, చిల్డ్రన్స్ పార్క్ ను అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నగరాల అభివృద్ధి గ్రామాలను అభివృద్ధి చేయటం తమ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య తహసిల్దార్ అంజనేయ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు శానేశావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ గడ్డం భాస్కర్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు బిల్లా రమేష్, లొక్కు రమేష్, బి. చంద్రశేఖర్, నాయకులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాపూరు మండలములోని కండలేరు డ్యామ్ వద్ద ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా తెలుగుగంగ కెనాల్ కు నీటిని వదిలారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, యూనిట్ ఇంచార్జీలు తెలుగుగంగ అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు రూరల్, (చైతన్యరథం): నియోజకవర్గంలోని నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో 50 లక్షల రూపాయల నిధులతో వివిధ అభివృధి పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, ఏఎంసీ ఛైర్మెన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ రాపూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ అభివృద్ధి పనులకు వేగవంతంగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కరానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దఎత్తున సహకరిస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే మార్కెట్ కమిటీ సభ్యులంతా ఒక కుటుంబంలా కలసికట్టుగా ఏకతాటిపై ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఈ మార్కెట్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వ్యాపారస్తులు చేసిన సూచనలను కూడా పరిగణలోనికి తీసుకొని స్థానిక ఎమ్మెల్యేగా మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పై కార్యక్రమంలో ఏఎంసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని గ్రీన్ అంబాసిడర్ ప్రతినిధులతో కలిసి ఆఫీస్ ఆవరణలో ప్రభుత్వ విఎ, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ శుభ్రపరిచారు.




కుప్పం నియోజకవర్గంలోని కుప్పం మండలం కంగుంది కోటలో శనివారం జరిగిన "స్వచ్ఛ్ ఆంధ్ర, స్వచ్ఛ దివస్" కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు



స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రమదానం చేసిన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తదితరులు

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడు, చైతన్యరథం): నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీతపేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామంలో 30లక్షల రూపాయలతో ఓహెచ్ఎస్ఆర్ తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తరచుగా చేతులు కడుక్కోవాలని, పరిసరాలను, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి చీపురు పట్టి రోడ్లు ఊడ్చారు. పరిశుభ్రతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత గ్రామంలో తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందేలా పనులు చేస్తున్నట్టు చెప్పారు. రానున్న మూడేళ్లలో నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్లు, సాగు, తాగునీరు అందించాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నట్టు చెప్పారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో సమస్యలు పట్టించుకోకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధాన్యతాక్రమంలో పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన లక్ష్మీకాంత్ రెడ్డి, నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సునీత పరామర్శించారు. నేరుగా వారి ఇళ్లవద్దకు వెళ్లి చనిపోయిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుఃఖంలో ఉన్న కుటుంబసభ్యులను ఓదార్చారు.. అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు..

# ప్రజాదర్బార్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం

## మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు వెల్లడి



మడకశిర, (చైతన్యరథం): తెలుగుదేశంపార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారం శుక్రవారం ఉదయం మడకశిరలోని తమ క్యాంపు కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాజు నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన తక్షణ చర్యలను ఎమ్మెల్యే అప్పటికప్పుడే చేపట్టారు. సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పాట్ లో ఫోన్ చేసి, ప్రజలకు సంబంధించిన సమస్యలను వివరించి ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు రకాల సమస్యలను నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# ఆరితేరిన నేరగాళ్లు వైసీపీ నేతలు




తిరుపతి, (చైతన్యరథం): తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకుంటున్న కరుణాకర్ రెడ్డికి దేవుడంటే భయం గాని భక్తి గాని నమ్మకం గాని ఏమీ లేవన్నారు. పరకామణిలో సాక్ష్యాలను తారుమారు చేసేందుకే సతీష్ కుమార్‌ను హత్య చేసారని అనుమానం వ్యక్తం చేశారు. నాడు బాబాయ్‌ని హత్య చేసి బాత్రూంలో.. నేడు టీటీడీ పరకామణి చోరీ కేసులో కీలక సాక్షిని చంపి రైల్వే పట్టాల పై వేశారన్నారు. పరకామణిలో జరిగిన చోరీపై ఫిర్యాదు చేసిన టీటీడీ మాజీ విజిలెన్స్ ఏవీఎస్ ఓ సతీష్ కుమార్‌ది ముమ్మాటికీ వైసీపీ నేతలు చేసిన హత్యే, సాక్ష్యాలను తారుమారు చేసేందుకే అత్యంత దారుణంగా హతమార్చారు. రవికుమార్ కి భద్రత కల్పించి కేసు విచారణ జరిపి కేసు పూర్తయ్యేంతవరకు అతనికి భద్రత కల్పించాలన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నగరపార్టీ అధ్యక్షుడు చినబాబు, రాష్ట్ర నాయకులు సురా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణా, మన్యం శ్రీనివాసులు, బిజీ కృష్ణ యాదవ్, కరాటే చంద్ర, రజనీకాంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు పాలనలోనే ముస్లింల అభివృద్ధి

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్



నెల్లూరు, (చైతన్యరథం): ఇమామ్, మౌజన్‌ల 12 నెలల గౌరవ వేతనాలు విడుదలైన సందర్భంగా నెల్లూరులోని ఇమామ్ మౌజన్‌లు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను హరనాథపురంలోని ఆయన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ఇమామ్ మౌజన్‌లకు రావాల్సిన గౌరవ వేతనాలు ఆలస్యమై ఇబ్బంది పడిన మాట వాస్తవమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అందరూ అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముస్లింల పట్ల చంద్రబాబుకు ఉన్న నిబద్ధతతో ఇమామ్ మౌజన్‌లకు రావాల్సిన 12 నెలల గౌరవ వేతనాలు విడుదల చేశారని అన్నారు. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రగతి బ్యాంకులు ఇతర బ్యాంకులో విలీనం కావడం వల్ల 5 వేల మందికి గాను 8 వందల మందికి ఐఎఫ్ఎస్సీ కోడ్ సరిగా లేనందున డబ్బులు ఆలస్యమయ్యాయని తెలిపారు. నూతన ఐఎఫ్ఎస్సీ కోడ్‌ను అప్లోడ్ చేయగానే వారి గౌరవ వేతనాలు వారి అకౌంట్లో పడతాయని తెలిపారు. రాష్ట్రంలోనీ మసీదుల ప్రెసిడెంట్లు ముతవల్లీలు, ఇమామ్ మౌజన్‌లకు జీతాలు ఇవ్వాల్సిందేనని జీతానికి గౌరవ వేతనానికి ముడి పెట్టొద్దని హెచ్చరించారు. వారికి జీతం ఇవ్వాల్సిన బాధ్యత మసీదు కమిటీలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జాఫర్ షరీఫ్, ఇంతియాజ్, సమీ హుస్సేని, నౌషాద్, కాలేషా, అబ్దుల్ అజీజ్ మౌలానా, ఇమామ్ లు మౌజన్ లు పాల్గొన్నారు.



బేతంచర్ల పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్ థీమ్ కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమాజ పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# నెల్లూరులో ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలి

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే సోమిరెడ్డి లేఖ



నెల్లూరు, (చైతన్యరథం): హైదరాబాద్‌లోని పీవీ నరసింహరావు ఎక్స్‌ప్రెస్ వే తరహాలో పెన్నానది నుంచి బుజబుజనెల్లూరు వరకు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో పాటు ప్రమాదాలకు చెక్ పడే అవకాశం ఉందనికేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాసిన లేఖలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు. నెల్లూరు, చెన్నైల మధ్య జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు అనుమతి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్పగుడి, కనపర్తిపాడు, చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరు నగరంలో మౌలిక వసతుల విస్తరణకు, రవాణా సదుపాయాల మెరుగుదలకు ఈ నిర్మాణాలు దోహదం చేస్తాయన్నారు. ఈ మూడు ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టినప్పటికీ సుందరయ్య కాలనీ, ఎన్టీఆర్ నగర్, కోడూరు బీచ్, మైపాడు బీచ్ రోడ్ల క్రాసింగ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మరోవైపు పెన్నానది వద్ద నుంచి బుజబుజనెల్లూరు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నెల్లూరు నగరం వేగంగా విస్తరిస్తోందని వివరించారు. హైవేకి ఇరువైపులా నివాసాలు, వాణిజ్య, పారిశ్రామిక నిర్మాణాలు పెరుగుతున్నాయని త్వరలో చేపట్టబోయే ఆరులేన్ల రహదారితో నగర అంతర్గత రోడ్డు నెట్ వర్క్ కీలకంగా మారుతుందన్నారు. వాహనాల రద్దీ పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌ను తగ్గించడంతో పాటు ప్రయాణికుల భద్రత నేపథ్యంలో ఎక్స్ ప్రెస్ వే నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

హైదరాబాద్‌లో మెహిదీపట్నం నుంచి విమానాశ్రయం వెళ్లేమార్గంలో నిర్మించిన తరహాలో పెన్నానది నుంచి బుజబుజనెల్లూరు వరకు ఎక్స్ ప్రెస్ వే నిర్మించాలన్నారు. ఎక్స్ ప్రెస్ వే అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమై రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా నెల్లూరు నగరం మరింత అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తుందన్నారు.కావున నెల్లూరులో ఎక్స్ ప్రెస్ వే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని కోరుకుంటున్నానన్నారు.



కనిగిరిలో జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి,జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో షుగర్, కంటి వైద్య పరీక్షలు, చేసి అద్దాలు పంపిణీ చేశారు.

# బీహార్ ఎన్నికల్లో విలక్షణ ఫలితాలు!

## చాలా చోట్ల ఆఖరి ఓటు వరకు దోబూచులాట



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ప్రత్యర్థుల మధ్య విజయం చివరి వరకూ దోబూచులాడింది. చాలా తక్కువ మెజార్టీతో కొంతమంది అభ్యర్థులు విజయం సాధించారు. మూడు స్థానాల్లో అయితే, మెజార్టీ కేవలం 100లోపే ఉండటం గమనార్హం.

### 30 ఓట్ల తేడాతో... ఒకే ఒక్క సీటు..

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క సీటు సాధించి.. బహుజన్ సమాజ్ పారీ ఖాతా తెరిచింది. ఆ గెలుపు కూడా కేవలం 30 ఓట్ల తేడాతో దక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఎన్నికల్లో 243 సీట్లకు గాను 182 స్థానాల్లో మాయావతి పార్టీ బరిలోకి దిగింది. ఒకేఒక్క సీటు మాత్రమే ఈ పార్టీ దక్కించుకోగలిగింది, ఆ పార్టీకి చెందిన సతీశ్ కుమార్ యాదవ్ రాజ్‌గర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. కౌంటింగ్‌లో అద్యంతం ఉత్కంఠ నెలకొంది. అర్ధరాత్రి తర్వాత వెలువడిన ఫలితాల్లో సతీశ్ అతి తక్కువ మెజార్టీతో విజేతగా నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆయనకు 72,688 ఓట్లు రాగా, సమీప భాజపా అభ్యర్థి అశోక్ కుమార్ సింగు 72,659 ఓట్లు దక్కాయి. భోజ్‌పూర్ జిల్లాలోని సందేశ్ అసెంబ్లీ నియోజకవర్గంలో జేడీయూ, ఆర్జేడీ అభ్యర్థులమధ్య విజయం చాలా సేపటివరకు ఊగిసలాడింది. చివరకు జేడీయూ అభ్యర్థి రాధాచరణ్ షా తన సమీప ఆర్జేడీ ప్రత్యర్థి దీపుసింగ్‌పై 27 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆర్రాలోని ఆగియాన్ ప్రాంతంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన శివప్రకాష్ రంజన్, బాజపా అభ్యర్థి మహేష్ పాస్వాన్ చేతిలో 85 ఓట్ల తేడాతో ఓడిపోయారు. నబీనగర్ అసెంబ్లీ స్థానంలో జేడీయూ పార్టీకి చెందిన చేతన్ ఆనంద్. ఆర్జేడీ అభ్యర్థి ఆమోద కుమార్ సింగ్‌ను 112 ఓట్ల తేడాతో ఓడించారు. భాజపా ప్రత్యర్థి పవన కుమార్ జైస్వాల్‌ను ఓడించి ఆర్జేడీ అభ్యర్థి ఫైసల్ రెహమాన్ ఢాకా స్థానాన్ని సొంతం చేసుకున్నారు. వీరి మధ్య వ్యత్యాసం 178 ఓట్లు మాత్రమే. పోర్బస్‌గంజ్ అసెంబ్లీ నుంచి భాజపా తరపున బరిలోకి దిగిన విద్యాసాగర్ ఓటమి పాలయ్యారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి మనోజ్ బిశ్వాన్ 221 ఓట్లతో విజయం సాధించారు.

## బీజేపీ రెబెల్స్‌పై కొరడా

### కేంద్ర మాజీమంత్రిపై సస్పెన్షన్ వేటు

బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపొందిన అనంతరం భాజపా తన దృష్టిని రాష్ట్రంలోని రెబెల్స్ పైకి మళ్లించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు కేంద్ర మాజీమంత్రి ఆర్కే సింగ్ సహా మరో ఇద్దరు నేతలను సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి వారిని ఎందుకు బహిష్కరించకూడదో వారంలోపు వివరణ ఇవ్వాలంటూ ముగ్గురు నేతలకు భాజపా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సదరు నేతలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడం వల్ల పలు భాజపాకు నష్టం వాటిల్లిందని, పార్టీ దీనిని తీవ్రంగా పరిగణించిదని నోటీసులో పేర్కొంది. అందువల్లే శాసనమండలి సభ్యుడు అశోక్ అగర్వాల్, కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్, కేంద్ర మాజీ మంత్రి ఆర్కే సింగ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది.

# నా పనైపోద్దని అన్నారు... వారే మట్టికరిచారు!

## ఫలితాలపై లోక్ జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాసవాన్



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన లోక్ జనశక్తి పార్టీ (ఎల్జేపీ రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాసవాన్ శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. 2020 నాటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూసి తన పనైపోయిందని చాలా మంది అనుకున్నారని అన్నారు. తాజా విజయం తనకు ఎంతో విలువైందని పేర్కొన్నారు. సీఎం నీతీశ్ కుమార్ నివాసానికి వెళ్లిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

### ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించాం

బీహార్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై నీతీశ చర్చించినట్లు పాసవాన్ వెల్లడించారు. చరిత్రాత్మక విజయం నేపథ్యంలో మా ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను అభినందించాం. ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించామన్నారు. ఎలాంటి. వ్యూహాలు అనుసరించాలో మాట్లాదాం. 2005లో మా పార్టీ ఒంటరిగా పోటీ చేసి 28 స్థానాల్లో గెలిచింది. ఆ తర్వాత ఇవే మాకు అత్యుత్తమ ఫలితాలు" అని పాసవాన్ అన్నారు. ఎన్డీయే కూటమిలో ఎల్జేపీ, జేడీయూల పాత్రపై అనేక వదంతులు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చేశారని పాసవాన్ అన్నారు. అయినప్పటికీ, తామంతా కలిసికట్టుగా ఎన్నికలను ఎదుర్కొన్నామన్నారు. "2024లో మాపై నమ్మకం ఉంచి ఎన్డీయే మాకు ఐదు ఎంపీ స్థానాలు: కేటాయించింది. అన్నింట్లో విజయం సాధించాం. గతంలో ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్న మాకు ఇప్పుడు మళ్లీ 29 సీట్లు కేటాయించింది. కావాలనే గెలవలేని స్థానాలను కేటాయించారని జేడీయూపై విమర్శలు గుప్పించారు. మా మధ్య విభేదాలు సృష్టించాలనే ప్రయత్నం చేశారు. కానీ, ఫలితాలు వాటన్నింటినీ తిప్పికొట్టాయి? అని పాసవాన్ పేర్కొన్నారు.

### ఆర్జేడీ పనైపోయింది

ఆర్జేడీ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతోందని పాసవాన్‌పేర్కొన్నారు. తాజా ఫలితాలతో అది స్పష్టమైందన్నారు. 80లో నడిచిన వాళ్ల జంగల్‌ను ప్రజలు తిప్పికొట్టారని పేర్కొన్నారు. 2015లో, 2020లో కొన్ని పరిస్థితులు అనుకూలించి వాళ్లు మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు.

## ఎలా ఓడినా మళ్లీ జనాల్లోనే : నోరు విప్పిన ఆర్జేడీ



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఫలితాలపై తొలిసారి ఆ పార్టీ స్పందించింది. ఒడిదుడుకులు ఎదురైనా ప్రజాసేవ కొనసాగుతూనే ఉంటుందని తెలిపింది. ఓటమితో విచారం, విజయంతో అహంకారం ఉండదని పేర్కొంది."ప్రజా సేవ అనేది నిరంతర ప్రక్రియ, ఆది కొనసాగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో ఒడిదుడుకులు. సహజం. ఆర్జేడీ పేదల పార్టీ వారి మధ్య ఉంటూ వారి గొంతుకను వినిపిస్తూనే ఉంటుంది" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. ఇటీవల ఫలితాల్లో మహాగడ్ బంధన్ కేవలం 34 స్థానాలకే పరిమితం కాగా.. అందులో ఆర్జేడీ 25 సీట్లు మాత్రమే పొందగలిగింది. మరోవైపు బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీ చేసిన ఆన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఫలితాలపై స్పందిస్తూ.. ఆర్జేడీ మళ్లీ అధికారంలోకి వస్తే ఆటవిక రాజ్యం తప్పదనే భయంతో తమకు మద్దతుగా నిలవాల్సిన వారిలో అనేక మంది ఎన్డీయే వైపు మొగ్గుచూపారని చెప్పింది. ఎర్రకోట వద్ద పేలుడు అనంతరం సీమాంచల్ ప్రాంతంలో ఓటర్లు ఓ వర్గం వైపు మళ్లారని తెలిపింది. సమస్యంతా ఆర్జేడీతోనేనని, కాంగ్రెస్ లేదా మహాగడ్ బంధన్లోని ఇతర పార్టీలది కాదని పేర్కొంది.

# ఢిల్లీ పేలుడు సంఘటనపై దర్యాప్తు ముమ్మరం

## నిశిత తనిఖీలు ఖాళీ అవుతున్న అల్‌ఫలా కేంపస్‌లు

ఢిల్లీ పేలుడు ఘటనకు సంబంధించి పలు విభాగాలు దర్యాప్త ముమ్మరం చేశాయి. ఉగ్ర కుట్రలో హరియాణా పరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీ సిబ్బంది పాత్ర ఉండటం, తాజాగా మరో ఇద్దరు వైద్యులను అరెస్టు చేయడంతో విశ్వవిద్యాలయంపై నిఘా మరింత పెరిగింది. ఈ ఇద్దరూ ప్రధాన నిందితుడు ఉమర్ నబీకి స్నేహితులని గుర్తించారు. దీంతో క్యాంపస్లో భద్రత కట్టుదిట్టం చేయడంతోపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. తాజా పరిణామాలతో అక్కడ చదువుతున్న వందలాది మంది విద్యార్థులు ఇళ్ల బాట పట్టారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మరో ఇద్దరు అరెస్టు..

దిల్లీ పేలుడు ఘటనలో దర్యాప్తు ముమ్మరం చేసిన ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు, హరియాణాలోని, దౌజ్, నుహ్, సమీప ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పేలుడుకు కారణమైన కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ స్నేహితులను (మహ్మద్, ముస్తాకిన్) అరెస్టు చేశారు. వీరిలో ఒకరు వైద్యుడు కాగా మరొకడు చైనాలో ఎంబీబీఎస్ పూర్తిచేసి ఇక్కడ ఇంటర్న్ షిప్ చేస్తున్నట్లు సమాచారం. ఎర్రకోట సమీపంలో పేలుడు సమయంలో వీరిలో ఒకడు దిల్లీలోనే ఉన్నట్లు




గుర్తించారు.

### పారిపోయేందుకు యత్నించి....

లుధియానాకు చెందిన ఓ వ్యక్తిని పశ్చిమ బెంగాల్లోని ఉత్తర్ దినాజ్పర్ జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా ఎన్ఐఏ బృందం అదుపులోకి తీసుకుంది. మొబైల్ టవర్ లొకేషన్ ఆధారంగా ఓ కేంద్రం వద్ద అతడిని గుర్తించిన అధికారులు.. వివరాలు అడుగుతున్న సమయంలో పారిపోయేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని డిజిటల్ పరికరాలు, డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అతడు అల్ ఫలా విద్యార్థి అని తేలింది.

### ఖాళీ అవుతున్న క్యాంపస్...

అల్ఫలా యూనివర్సిటీలోనూ విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. దర్యాప్తు బృందాలు సిబ్బందిని ప్రశ్నించడంతోపాటు రికార్డులను తనిఖీ చేసే పనిలో నిమగ్నమయ్యాయి. అనుమానిత విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలనూ అధికారులు పరిశీలిస్తున్నారు. తాజా పరిణామాలతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్న విద్యార్థులు యూనివర్సిటీని వదలి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. తరగతుల కొనసాగింపు పై స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఢిల్లీలో పేలుడుకు కారణమైన కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ, పరీదాబాద్ కేసులో నిందితురాలు డాక్టర్ షాహీన్ సయీద్ ఈ కళాశాలలోనే పనిచేసిన విషయం తెలిసిందే. షాహీన్ ఇటీవలే పాస్పోర్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఎంబీబీఎస్ విద్యార్థితోపాటు గతంలో ఇక్కడ వైద్య విద్య అభ్యసించిన మరో డాక్టర్ షారూఖ్‌ను ఢిల్లీ పోలీసులు, డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ మీర్‌ను యూపీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అనుమానితులుగా ఉన్న అనేకమందికి యూనివర్సిటీతో సంబంధం ఉండటం, మరో కారు కూడా ఈ క్యాంపస్ లభ్యం కావడంతో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది.

# బీబీసీ..క్షమాపణలు..వెనక్కుతగ్గని ట్రంప్

**- వచ్చే వారం దావా వేయనున్నట్లు వెల్లడి**

అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా 2021లో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చడంతో బీబీసీ చిక్కుల్లో పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన ప్రసంగాన్ని మార్చినందుకుగాను ఆ సంస్థపై 5 బిలియన్ డాలర్ల దావా వేస్తానని ట్రంప్ మీడియా సంస్థను హెచ్చరించారు. కాగా బీబీసీ తన చర్యలతో ట్రంప్ పరువుకు భంగం కలిగించినందుకు పరిహారంగా బిలియన్ డాలర్లు చెల్లించాలని ఆయన న్యాయబృందం ఇప్పటికే మీడియా సంస్థకు లేఖ రాసింది. దీనిపై క్షమాపణలు చెప్పిన మీడియా సంస్థ ట్రంప్ డిమాండు చేసిన బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆ సంస్థపై దావా తప్పదంటూ అమెరికా అధ్యక్షుడు మరోసారి హెచ్చరించారు. వచ్చే వారంలో బీబీసీపై 1 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు కోర్టులో దావా వేయనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ సమస్య గురించి బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. 2021 జనవరి 6వ తేదీన వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌పై తన మద్దతుదారులు దాడులు చేసిన సందర్భంగా ట్రంప్ సుమా రు గంట పాటు ప్రసంగించారు. దీనిని తన పనోరమ డాక్యుమెంటరీలో బీబీసీ తప్పుగా ఎడిట్ చేసి ప్రసారం చేసింది. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అటు ట్రంప్ రాజకీయంగా ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వ నిధులతో నడిచే బీబీసీకి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేయాల్సి వచ్చింది. దీనిపై మీడియా సంస్థ క్షమాపణలు చెప్పినా బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇవ్వాల్సిందిగా ట్రంప్ లేఖ రాశారు. అమెరికా



అధ్యక్షుడి ప్రసంగాన్ని సవరించినందుకు తాను, బీబీసీ సంస్థ చింతిస్తున్నట్లు చైర్మన్ సమీర్ షా శ్వేతసౌధానికి తిరిగి వ్యక్తిగత లేఖ పంపారు. అయితే ట్రంప్ డిమాండు చేసిన బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇచ్చేందుకు మాత్రం నిరాకరించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు. కాగా ఇప్పటికే ఈ వివాదానికి బాధ్యత వహిస్తూ బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేశారు. ట్రంప్ డిమాండ్ చేసిన ఒక బిలియన్ డాలర్ నష్టపరిహారాన్ని మాత్రం చెల్లించేం దుకు బీబీసీ నిరాకరించింది. కాగా బీబీసీ క్షమాపణ చెప్పడం పట్ల బ్రిటిష్ సాంస్కృతిక మంత్రి లిసా నాండీ స్పందించారు. 'వారు అత్యున్నత ప్రమాణాలను పాటిం చలేదని అంగీకరించారు. దాని ఆధారంగానే బోర్డు చైర్మన్ అమెరికా అధ్యక్షుడికి క్షమాపణ చెప్పారు' అని లీసా పేర్కొన్నారు.



## చైనాలో నేపాల్ కరెన్సీ ప్రింటింగ్..

**- 17 మిలియన్ డాలర్ల కాంట్రాక్ట్**

ప్రపంచంలో అంతకంతకూ తన ప్రాబల్యాన్ని పెంచుకుంటున్న చైనా క్రమక్రమంగా కరెన్సీ ముద్రణకూ గ్లోబల్ సెంటర్‌గా అవతరిస్తోంది. తాజాగా నేపాల్ కరెన్సీ నోట్ల ముద్రణ కాంట్రాక్ట్‌ను చైనాకు చెందిన ప్రభుత్వ రంగ కంపెనీ చేజిక్కించుకుంది. గతంలో నేపాల్ కరెన్సీ ముద్రణ భారత్‌లో జరిగేది. అయితే, భారత భూభా గాలను నేపాల్‌కు చెందినవిగా చూపించే సరికొత్త మ్యాపును 2015లో నేపాల్ విడుదల చేసింది. ఆ తరువాతే పరిస్థితి మారిపోయింది. 1945 నుంచి 1955 వరకూ నాశిక్‌లోని సెక్యూరిటీ ప్రెస్‌లో నేపాల్ కరెన్సీ ముద్రణ జరిగేది. ఆ తరువాత కూడా నేపాల్ నోట్లల్లో అనేకం భారత్‌లోనే ముద్రించేవారు. కానీ భారత భూభాగాలను నేపాల్ మ్యాపులో చేర్చడంతో పరిస్థితి మారింది. ఈ సవరించిన కరెన్సీ నోట్ల ముద్రణకు భారత్ నిరాకరించడంతో నేపాల్ చైనా వైపు మళ్లింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం నేపాల్ కరెన్సీ నోట్లు మొత్తం చైనాలోనే ముద్రిస్తున్నారు. 430 మిలియన్ కరెన్సీ నోట్ల (వెయ్యి రూపాయల నోట్లు) ముద్రణ కాంట్రాక్ట్‌ను నేపాల్ రాష్ట్ర బ్యాంకు చైనా ప్రభుత్వ రంగ సంస్థ సీబీపీఎమ్‌సీకి తాజాగా అప్పగించింది. ఈ కాంట్రాక్ట్ విలువ సుమారు 17 మిలియన్ డాలర్లు. నేపాల్‌తో పాటు బంగ్లాదేశ్, శ్రీలంక, మలేషియా, థాయ్‌ల్యాండ్, అప్ఘానిస్థాన్ కూడా తమ కరెన్సీ నోట్లను చైనాలోనే తయారు చేయించుకుంటున్నాయి. ఫలితంగా కరెన్సీ నోట్ల ముద్రణకు చైనా ఓ కేంద్రంగా మారిపోయింది. నకిలీకు ఆస్కారం లేకుండా కలర్ షిఫ్టింగ్ రంగులు, వాటర్ మార్క్‌లు, హెూలోగ్రాఫిక్ థ్రెడ్స్ వంటి అధ్యాధునిక భద్రతా ఫీచర్లు ఉన్న నోట్లను తక్కువ ధరకే చైనా తయారు చేస్తుండటంతో అంతా అటువైపు మళ్లుతున్నారు. దీంతో జపాన్, రష్యా, అమెరికాలకు దీటుగా చైనా కూడా నోట్ల ముద్రణకు కేంద్రంగా మారుతోంది. 2015లో డెలారూ అనే విదేశీ సంస్థను టేకోవర్ చేయడంతో సీబీపీఎమ్‌సీ దశ మారింది. ప్రైవేటు రంగంలో విశ్వసనీయ కరెన్సీ ముద్రణా సంస్థగా డెలారూకు పేరుంది. టేకోవర్ తరువాత డెలా రూకు చెందిన అత్యాధునిక సాంకేతికత చైనాకు దక్కింది. దీంతో, చైనా తన ప్రాబల్యాన్ని ఆసియా నుంచి ఆఫ్రికా, యూరప్, మధ్య ప్రాచ్యానికి కూడా విస్తరించగలిగింది.

**12 గంటలు దక్షిణాఫ్రికాలో**

## నిలిచిన పాలస్తీనియన్ల విమానం

జొహన్నెస్బర్గ్: ప్రయాణ పత్రాల సమస్య కారణంగా 150 మందికి పైగా పాలస్తీనియన్లు ఉన్న విమానాన్ని 12 గంటలపాటు దక్షిణాఫ్రికాలో నిలిపివేయడంతో అక్కడి అధికారులు శుక్రవారం తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రయాణికుల్లో 9 నెలల గర్భిణీ కూడా ఉన్నారు. పాలస్తీనియన్లు చార్టర్ విమానంలో కెన్యాలోని నైరోబీలో స్టాప్‌ఓవర్ తర్వాత గురువారం ఉదయం జొహన్నెస్‌బర్గ్‌లోని ఓఆర్ టెంబో అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. అయితే ఇజ్రాయెల్ నుంచి వీరికి ఎగ్జిట్ స్టాంపులు రాలేదని, దక్షిణాఫ్రికాలో ఎంత కాలం ఉండాలో పేర్కొనలేదని అధికారులు వివరించారు. వారి స్థానిక చిరునామాలను కూడా వెల్లడించలేదన్నారు. దీంతో వారి ప్రవేశాన్ని ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో అక్కడి హెూం మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవడంతో గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ అనే స్థానిక ప్రభుత్వేతర సంస్థ పాలస్తీనియన్లకు బస కల్పించడానికి ముందుకు రావడంతో వారికి విమానం నుంచి దిగేందుకు అనుమతిచ్చారు. గత రెండు వారాల్లో దక్షిణాఫ్రికాకు పాలస్తీనియన్ల విమానం రావడం ఇది రెండోసారి అని గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ వ్యవస్థాపకుడు ఇంతియాజ్ వెల్లడించారు.

## బోయింగ్ విమాన ప్రమాదంలో మృతి..

# రూ.317 కోట్ల పరిహారం

**- శిఖాగార్గ్ ఎవరంటే?**

బోయింగ్ విమాన ప్రమాద ఘటనలో ఓ భారతీయ కుటుంబానికి కోర్టులో ఊరట లభించింది. 35.85 మిలియన్ డాలర్లు (రూ.317 కోట్లు) చెల్లించాలని విమాన తయారీ సంస్థను షికాగోలోని ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఆరేళ్ల పాటు కొనసాగిన ఈ న్యాయ పోరాటంలో చివరకు విజయం దక్కింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..2019లో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ విమానం (737 మ్యాక్స్) ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో భారతీయ పౌరురాలైన శిఖాగార్గ్ మరణించారు. అప్పుడు ఐరాసలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె.. యూఎన్ ఎన్విరాన్మెంట్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొనేందుకు నైరోబీకి వెళుతున్నారు. ఆ సమయంలో ఆమె పీహెచ్ చేస్తున్నారు. భారతీయ సంప్రదాయం అంటే మక్కువ చూపే శిఖ.. చీరకట్టులో విమానం ఎక్కారని ఆ రోజుల్ని కుటుంబసభ్యులు గుర్తుచేసుకున్నారు. ఆ విమానం ఇథియోపియాలోని బోలె అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల



వ్యవధిలోనే కూలిపోయింది. దాంతో 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మార్చిలో ఈ ఘటన జరగ్గా దానికి ఐదు నెలల ముందే ఇండోనేసియాలో మరో విమానం ప్రమాదానికి గురైంది. ఈ రెండు ఘటనల్లో కలిపి సుమారు 340 మంది మృతి చెందారు. వీటికి సంబంధించిన కేసుల్లో పరిహారం ఇచ్చి చాలావరకు కేసులను బోయింగ్ పరిష్కరించుకుంది. అయితే.. ప్రమాదానికి గురైన విమానం మోడల్ డిజైన్‌లో పలు లోపాలు ఉన్నాయని, అలాగే ప్రమాదాల గురించి ప్రజలను హెచ్చరించడంలో విఫలమైందని శిఖ కుటుంబం దావా వేసింది. కోర్టుల్లో ఇలాంటి దావాలు మరికొన్ని దాఖలయ్యాయి. వీటిలో శిఖ కుటుంబం వేసిన దావాపై తీర్పు వెలువడింది. పరిహారంతో పాటు అన్ని ఖర్చులు కలిపి ఆమె కుటుంబానికి 35.85 మిలియన్ డాలర్లు చెల్లించాలని షికాగోలోని ఫెడరల్ జ్యూరీ ఈ వారం తీర్పు ఇచ్చింది.

ఈ రెండు వరుస ప్రమాదాల తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న 737 మ్యాక్స్ విమానాల కార్యకలాపాలను నిలిపివేశారు. 2020 డిసెంబర్లో మళ్లీ ఆ కార్యకలాపాలను ప్రారంభించారు. ఇక, ఈ ఏడాది జూన్‌లో బోయింగ్ 787 (డ్రీమ్ లైనర్) అహ్మదాబాద్ నుంచి టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకేఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 241 మంది మృతి చెందారు. ఇక, ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్పై పడటంతో అందులోని పలువురు చనిపోయారు.

# 1,20,000 గ్లైడ్ బాంబుల తయారీలో రష్యా

**-ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ అధికారి ఆరోపణ**

మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ రష్యా, ఉక్రెయిన్ల మధ్య పరస్పర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 1,20,000 గ్లైడ్ బాంబులను తయారు చేయడానికి మాస్కో ప్రణాళికలు రచిస్తున్నట్లు ఉక్రెయిన్ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి సంచలన ఆరోపణలు చేశారు. వీటిలో 500 కొత్త లాంగ్ రేంజ్ వెర్షన్ బాంబులు కూడా ఉన్నాయని.. ఈ ఏడాది చివరికి వాటి తయారీ పూర్తవుతుం దన్నారు. ఇవి 12 కి.మీ.కు పైగా దూరాన ఉన్న లక్ష్యాలను చేరుకోగలవన్నారు. రష్యన్ దళాలు ప్రతిరోజూ ఉక్రెయిన్ లోని పలు ప్రాంతాలపై 200 నుంచి 250 వరకు గైడ్ బాంబులతో దాడులు చేస్తున్నాయని సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి ఆరోపించారు. ప్రతిసారీ రష్యా తమ గ్లైడ్ బాంబుల పరిధిని పెంచుతుందన్నారు. 400 కి.మీ దూరంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేసే బాంబుల తయారీకి ప్లాన్



చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మాస్కో తయారుచేస్తున్న బాంబులతో ఉక్రెయిన్కు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని ఎదుర్కోవ డానికి కీవ్ సేనలు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ అధికారి చేస్తున్న ఆరోపణలపై రష్యా స్పందించలేదు. కీవ్ పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలను ఖండించింది. 2022లో ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడి తర్వాత రష్యా ఆయుధాల తయారీలో దూసుకెళ్తోంది. ఆయుధ ఉత్పత్తి భారీగా పెంచడంతో మాస్కోలో రక్షణ రంగానికి చెందిన కర్మాగారాలు 24 గంటలూ పని చేస్తున్నాయి.

గత నెలలో రష్యా సైన్యం భారీస్థాయిలో 'అణు' విన్యా సాలు నిర్వహించింది. పుతిన్ వాటిని స్వయంగా పర్యవేక్షించారు. ఆ సమయంలో అణుశక్తి ఆధారిత సబ్‌మెర్సిబుల్ డ్రోన్ 'పోసిడాన్', 'బురెవెసినిక్' క్షిపణులను విజయ వంతంగా పరీక్షించినట్లు సైనిక ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన తెలిపారు.

చైతన్యరథం

## జడేజా సరికొత్త చరిత్ర

సౌతాఫ్రికాతో తొలి టెస్టులో సత్తా చాటిన టీమిండియా స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సరికొత్త చరిత్ర సృష్టించాడు. రెండో రోజు ఆటలో బ్యాట్‌తో, బంతితో రాణించాడు. భారత తొలి ఇన్నింగ్స్ 45 బంతులు ఎదుర్కొన్న జడ్డూ.. మూడు ఫోర్ల సాయంతో 27 పరుగులు చేశాడు. ఇక సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఎనిమిది ఓవర్ల బౌల్ చేసి పదమూడు పరుగులు మాత్రమే ఇచ్చిన జడ్డూ.. వికెట్ మాత్రం తీయలేకపోయాడు. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం చెలరేగాడు. రెండో రోజు ఆటలో జడ్డూ 13 ఓవర్లు బౌలింగ్ చేసి 29 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా సరికొత్త చరిత్ర సృష్టించాడు. సొంతగడ్డపై టెస్టుల్లో 2 వేల పరుగులు పూర్తి చేసుకోవడంతో పాటు 250 వికెట్ల క్లబ్‌లో చేరిన భారత తొలి క్రికెటర్‌గా రికార్డు సాధించాడు. అంతే కాదు..ప్రపంచంలో స్టువర్ట్ బ్రాడ్ తర్వాత ఈ ఘనత సాధించిన(స్వదేశంలో 2000పైగా పరుగులు, 250 వికెట్లు) రెండో ఆటగాడిగా జడేజా నిలిచాడు. అదే విధంగా.. టెస్టుల్లో మొత్తమ్మీద నాలుగు వేల పరుగుల మైలురాయిని చేరుకోవడంతో పాటు 300కి పైగా వికెట్లు తీసిన నాలుగో ప్లేయర్ గా నిలిచాడు. ఈ జాబితాలో జడేజా కంటే ముందు ఇయాన్ బోతమ్, కపిల్ దేవ్, డానియెల్ వెటోరి ఉన్నారు.



## సెహ్వాగ్‌ను దాటేసిన పంత్



టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో ఘనత సాధించాడు. టెస్టుల్లో అత్యధిక సిక్సర్ల జాబితాలో భారత డ్యాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను అధిగమించాడు. మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో పంత్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దాదాపు నాలుగు నెలల తర్వాత గాయం నుంచి కోలుకుని ప్రస్తుతం సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు..కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికాతో టీమిండియా తొలి టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. ఈ క్రమంలో పంత్. బ్యాటింగ్‌కి వచ్చి క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ రికార్డును బ్రేక్ చేశాడు. టెస్ట్ మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత ఆటగాడిగా పంత్ రికార్డు సృష్టించాడు. సౌతాఫ్రికాతో ఇన్నింగ్స్‌లో 24 బంతులు ఎదుర్కొన్న పంత్.. 27 పరుగులు చేశాడు. ఇందులో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు ఉన్నాయి. టెస్ట్ క్రికెట్‌లో వీరేంద్ర సెహ్వాగ్ 180 ఇన్నింగ్స్‌లో మొత్తం 91 సిక్స్‌లు కొట్టాడు. కాగా పంత్ 83 ఇన్నింగ్స్‌లోనే 92 సిక్స్‌లు బాది ఈ ఫీట్‌ను అందుకున్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రోహిత్ శర్మ(116 ఇన్నింగ్స్‌లో 88 సిక్స్‌లు),రవీంద్ర జడేజా(130ఇన్నింగ్స్‌లో 80 సిక్స్‌లు), ధోనీ(144 ఇన్నింగ్స్‌లో 78సిక్స్‌లు) ఉన్నారు.

# బౌలర్ల హవా.. ఒక్కరోజే కూలిన 16 వికెట్లు

- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 93/7
- సఫారీ బ్యాటర్లను వణికించిన జడేజా
- తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన భారత బ్యాటర్లు, 189కి ఆలౌట్
- ప్రస్తుతానికి 63 పరుగుల స్వల్ప ఆధిక్యంతో సౌతాఫ్రికా




భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న తొలి టెస్టు మూడు రోజుల్లోనే ముగిసే అవకాశం కనిపిస్తోంది. బౌలర్ల హవా కొనసాగుతున్న ఈ మ్యాచ్ లో శనివారం ఒక్కరోజే 16 వికెట్లు నేలకూలాయి. బ్యాటింగ్‌లో నిరాశపర్చిన టీమిండియా బౌలింగ్‌లో అదరగొడుతుంది. భారత స్పిన్నర్ల ధాటికి సఫారీ సేన బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు.

రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా ఏడు వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. దీంతో భారత్‌పై 63 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. కోర్బిన్ బాష్(1), టెంబా బావుమా(29) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా విజృంభించాడు. ఏకంగా నాలుగు వికెట్లు తీసుకొని 28 పరుగుల మాత్రమే ఇచ్చాడు. కుల్దీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఓ వికెట్ పడగొట్టారు. టీ బ్రేక్ సమయానికి 18/1తో నిలిచిన దక్షిణాఫ్రికా చివరి సెషన్లో ఆరు వికెట్లు కోల్పోయింది. వియాన్ ముల్డర్ (11), టోనీ డి జోర్జి (2)ని జడేజా ఒకే ఓవర్లో పెవిలియనుకు పంపాడు. మార్క్రమ్ (4), ట్రిస్టన్ స్టబ్స్ (5) కూడా జడ్డూ బౌలింగ్లోనే ఔటయ్యారు. కైల్ వెరినె (9)ని అక్షర్ పటేల్, మార్కో యాన్సెన్ (13)ని కుల్‌దీప్ ఔట్ చేశాడు.

ఓవర్‌నైట్ 37/1తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా ఘోరంగా విఫలమైంది. సఫారీ బౌలర్ల ధాటికి బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో 189 పరుగులకే భారత్ ఆలౌట్ అయింది. కేఎల్ రాహుల్(39) టాప్ స్కోరర్. వాషింగ్టన్ సుందర్(29), రిషభ్ పంత్(27), రవీంద్ర జడేజా(27) పర్వాలేదనిపించారు. బ్యాటింగ్ చేస్తుండగా మెడ పట్టేయడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(4లి) రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సైమన్ హర్మర్(4/30), మార్కో యాన్సెన్(3/35) రాణించారు. అలానే కేశవ్ మహరాజ్, కోర్బిన్ బోష్ చెరో వికెట్ పడగొట్టారు.దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యం లభించింది.

తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా జట్టు 159 పరుగులకే ఆలౌటైంది. టీమిండియా స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా 5 వికెట్లు పడగొట్టి.. సౌతాఫ్రికా పతనంలో కీలక భూమిక పోషించాడు.

# చెన్నైకి సంజూ.. రాజస్థాన్‌కు జడేజా

ఐపీఎల్ -2026 మినీ వేలానికి ముందు ఆయా ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల ట్రేడు నిర్వహించాయి. ఇందులో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు చెందిన ఆల్రౌండర్లు రవీంద్ర జడేజా, సామ్ కరన్ జట్టును వీడారు. వీరు రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరారు. అలాగే రాజస్థాన్‌కు చెందిన సంజు శాంసన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ సొంతం చేసుకుంది. ఈ విషయం కొన్ని రోజులుగా వార్తల్లో ఉంటోంది. అయితే శనివారం అధికారికంగా ఐపీఎల్ ప్రకటించింది.




### జడేజాను వదులుకోవటం కఠినమైన నిర్ణయం

జడేజా చెన్నై జట్టును వీడనుండటం పై ఆ ఫ్రాంఛైజీ సీఈఓ కాశీవిశ్వనాథన్ మాట్లాడారు. జట్టుకు టాప్ ఆర్డర్ ఇండియన్ బ్యాటర్ కావాలని చెన్నై యాజమాన్యం కోరుకుంది. కానీ ఆక్షన్లో ఎక్కువమంది భారత బ్యాటర్లు లేరు. దీంతో ట్రేడ్ ద్వారా సొంతం చేసుకోవాలనుకున్నాం. కొన్ని సంవత్సరాలుగా చెన్నై సూపర్ కింగ్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తోన్న రవీంద్ర జడేజాను వదులుకోవడం నిజంగా కఠినమైన నిర్ణయం' అని కాశీవిశ్వనాథన్ అభిప్రాయపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే టీమ్ మేనేజ్మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. దీనికిముందు తన ఆలోచనను ఆటగాళ్లతో పంచుకుంది. వారి సమ్మతితోనే ఈ ట్రేడ్‌కు వెళ్లింది. అలాగే రవీంద్ర జడేజా కూడా సానుకూలంగానే స్పందించాడు. సామ్ కరన్‌ను వదులుకోవడం కూడా కఠిన నిర్ణయమే. భవిష్యత్తు దృష్ట్యా చెన్నై జట్టును బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. మాకు ఇండియన్ బ్యాటర్‌ను పొందడానికి ఇంతకంటే అవకాశం దొరకలేదు. సంజుశాంసన్.. ఐపీఎల్‌లో చాలా అనుభవమున్న ఆటగాడు. అతడు దాదాపు 4,500కు పైగా పరుగులు చేశాడు. అలాగే రాజస్థాన్ రాయల్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్నాడని విశ్వనాథన్ వివరించారు. అలాగే అభిమానుల బాధను అర్థం చేసుకోగలమని, కానీ తప్పలేదని ఆయన అన్నారు.. 'ఈ నిర్ణయంతో చెన్నై అభిమానులు నిరాశకు గురవుతున్నారు. వారి నుంచి మాకు చాలా మెసేజ్ లు సైతం వచ్చాయి. కానీ మార్పు తప్పదు. రాబోయే కాలంలో చెన్నై సూపర్‌కింగ్స్ ఎప్పటిలాగే మెరుగైన ప్రదర్శన, నిలకడను కొనసాగిస్తుందనికాశీ విశ్వనాథన్ పేర్కొన్నాడు.

రవీంద్ర జడేజా 12 సీజన్లుగా సీఎస్‌కే తరపున ఆడుతున్నాడు. 2022 సీజన్లో స్వల్పకాలం కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. జడేజా ఇప్పటి వరకు 186 మ్యాచుల్లో (చైన్నై తరపున) 143 వికెట్లు సొంతం చేసుకున్నాడు. అలాగే 2,198 పరుగులు చేశాడు.

ఈ ఆల్రౌండర్ లీగ్ ఫీజును రూ.18 కోట్ల నుంచి రూ.14 కోట్లకు తగ్గించి రాజస్థాన్ రాయల్స్ తీసుకుంది. సీఎస్‌కే మాత్రం సంజు శాంసన్ లీగ్ ఫీజులో ఏ మార్పు చేయకుండా రూ.18 కోట్లకు సొంతం చేసుకుంది.

# ఫ్రాంఛైజీలు వదులుకున్న, అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు

అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుస్తోన్న ఐపీఎల్ -2026 రిటెన్షన్ లిస్ట్ ఎట్టకేలకు వచ్చేసింది. రిటైన్, రిలీజ్ చేసిన ఆటగాళ్ల వివరాలను ఫ్రాంఛైజీలు అధికారికంగా ప్రకటించాయి. కాగా ఈ సీజన్‌కు సంబంధించి మినీ వేలం డిసెంబర్ 15న అబుదాబిలో జరగనుంది.

**రిలీజ్ చేసిన ఆటగాళ్లు..**

సీఎస్కే: మతీశా పతిరన, రాహుల్ త్రిపాఠి, వన్ష్ బేడి, ఆంద్రీ సిద్ధార్థ్, రచిన్ రవీంద్ర, దీపక్ హుడా, విజయ్ శంకర్, షేక్ రషీద్, కమలేశ్ నగార్‌కోటి.

ముంబై: సత్యనారాయణ రాజు, రీస్ టాప్లీ, కేఎల్ శ్రీజిత్,కర్ణ్ శర్మ, అర్జున్ టెండూల్కర్, బెవాన్ జాకబ్స్, ముజీబుర్ రెహ్మాన్, లిజాడ్ విలియమ్స్,విఘ్నేశ్ పుతుర్.

పంజాబ్ కింగ్స్: జోష్ ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ, కుల్‌దీప్ సేన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ప్రవీణ్ దూబె.

ఆర్సీబీ: స్వస్తిక్ చీకారా, మయాంక్ అగర్వాల్, టిమ్ సిఫర్ట్, లివింగ్‌స్టన్, మనోజ్ భాడ్గే, లుంగి ఎంగిడి, ముజారబానీ, మోహిత్ రాథీ.

సన్‌రైజర్స్ హైదరాబాద్: అభినవ్ మనోహర్, అథ్వర తైడే, సచిన్ బేబీ, వియాన్ ముల్డర్, సిమర్‌జిత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపా.

ఢిల్లీ క్యాపిటల్స్: ఫాఫ్ డుప్లెసిస్,జేక్ ఫ్రేజర్, సెధి ఖుల్లా అటల్, మన్వంత్‌కుమార్, దర్శన్ నల్కండే, మోహిత్ శర్మ.

గుజరాత్ టైటాన్స్: మహిపాల్ లామ్రోర్, కరీమ్ జనత్, దాసున్ శనక, గెరాల్డ్ కొయెట్జీ, కుల్వంత్ కుజ్రోలియా

లక్నో: ఆర్యన్ జుయల్, డేవిడ్ మిల్లర్, యువరాజ్ చౌదరి, రాజ్యవర్ధన్ హంగర్గేకర్, ఆకాశ్ దీప్, రవి బిష్ణోయ్, షమర్ జోసెఫ్

కేకేఆర్: సిసోడియా, డికాక్, గుర్బాజ్, వెంకటేశ్ అయ్యర్,ఆంద్రీ రసెల్,జాన్సన్,చేతన్‌సకారియా,అన్రిచ్

ట్రేడ్ అయిన ఆటగాళ్లు..

రాజస్థాన్ నుంచి సీఎస్‌కేకు: సంజు శాంసన్ (రూ.18 కోట్లు)

సీఎస్కే నుంచి రాజస్థాన్ రాయల్స్‌కు: రవీంద్ర జడేజా(రూ.14కోట్లు), సామ్ కరన్(రూ.2.40కోట్లు)

మహ్మద్ షమీ(రూ.10కోట్లు): సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్

షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్(రూ.2.6కోట్లు): గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్

నితీశ్ రాణా(రూ.4.2కోట్లు): రాజస్థాన్ నుంచి ఢిల్లీ క్యాపిటల్స్

శార్దూల్ ఠాకూర్(రూ.2కోట్లు): లక్నో నుంచి ముంబై ఇండియన్స్

డొనావన్ ఫెరీరా(రూ.కోటి): ఢిల్లీ నుంచి రాజస్థాన్

మయాంక్ మార్కండే (రూ.30 లక్షలు): కోల్‌కతా నుంచి ముంబై

అర్జున్ టెండూల్కర్(రూ.30లక్షలు): ముంబై నుంచి లక్నో

ఏ ఫ్రాంఛైజీ పర్సులో ఎంత ఉంది?

కోల్‌కతా (రూ.64.3 కోట్లు), చెన్నై (రూ.43.4 కోట్లు), సన్రైజర్స్ (రూ.25.5 కోట్లు), లక్నో సూపర్ జెయింట్స్ (రూ.22.95 కోట్లు), ఢిల్లీ క్యాపిటల్స్ (రూ.21.8 కోట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (రూ.16.4 కోట్లు), రాజస్థాన్ (రూ.16.05 కోట్లు), గుజరాత్ టైటాన్స్ (రూ.12.9కోట్లు),పంజాబ్ కింగ్స్ (రూ.11.5 కోట్లు),ముంబయి (రూ.2.75కోట్లు)

ఏ టీమ్ లో ఎన్ని ఖాళీలు?

కోల్‌కతా (13), సన్‌రైజర్స్ (10), చెన్నై (9), రాజస్థాన్ (9), ఢిల్లీ (8), ఆర్సీబీ (8), లక్నో (6), ముంబయి (5), గుజరాత్ (5), పంజాబ్ (4).

# మహేష్, రాజమౌళి సినిమా 'వారణాసి'

## 2027 వేసవిలో విడుదల




మహేశ్‌బాబు, రాజమౌళి సినిమాకి 'వారణాసి' టైటిల్‌ను ఖరారు చేశారు. హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో శనివారం అట్టహాసంగా జరిగిన గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్ లో మహేష్ బాబు లుక్ తో పాటు టైటిల్‌ను కూడా రిలీజ్ చేశారు. టైటిల్‌తో పాటు 'వారణాసి' యూనివర్స్‌ని పరిచయం చేశారు. దాదాపు నాలుగు నిమిషాల నిడివి గల వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోలో రాజమౌళి చూపించిన విజువల్స్ మాటలకి అందడం లేదు. యుగాలు, ఖండాలు, దేశాలు, భూమి, ఆకాశం, అంతరిక్షం, చరిత్ర, ఇతిహాసం, పురాణాలని.. ఈ వీడియోలో చూపించిన తీరు అద్భుతం. మహేశ్‌బాబు రుద్ర పాత్రలో కనిపించారు. ఆ పాత్రని, వారణాసి టైటిల్ రివిల్ చేసిన తీరు ప్రేక్షకులని కట్టిపడేసింది. వీడియోలో విజువల్స్, గ్రాఫిక్ వర్క్, మ్యూజిక్ అత్యున్నతంగా వున్నాయి. ఈ వీడియో చూశాక.. వెండితెరపై రాజమౌళి ఓ దృశ్యకావ్యాన్ని ఆవిష్కరిస్తున్నారనిపించింది.

మహేష్ బాబు.. రక్తం నిండిన దేహంతో నందిపై.. ఒక చేత్తో త్రిశూలం పట్టుకొని.. ముక్కోపిగా వస్తుంటే.. సాక్ష్యాత్తూ శివుడే.. దిగివచ్చునట్లుగా కనిపిస్తోంది. మహేష్ లుక్ అయితే నెక్స్‌ట్ లెవెల్ అని చెప్పొచ్చు. ఎగురుతున్న జుట్టు.. ఉగ్ర రూపంలో మహేష్‌ను చూసి ఫ్యాన్స్ ఆనందంలో మునిగి తేలుతున్నారు.

ఇక వారణాసి గురించిన కథ కావడంతో ఆ పేరే యాప్ట్ గా ఉంటుందని జక్కన్న దాన్నే ఫైనల్ చేసినట్లు సమాచారం. మహేష్‌ను మునుపెన్నడూ ఈ విధమైన లుక్ లో చూసింది లేదు. మహేష్ విశ్వరూపానికి.. ఇదే నిదర్శనం అని అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్ గా మారింది.

ఇందులో మహేష్ రుద్ర పాత్రలో ప్రేక్షకులకు థ్రిల్ పంచనున్నారు. ఇక కథానాయిక మందాకినిగా ప్రియాంక చోప్రా, ప్రతినాయకుడు 'కుంభగా పృధ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో అలరించనున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం. ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. 2027 వేసవిలో ఈ మూవీని విడుదల చేయనున్నారు.

## ఇలాంటి పాత్ర జీవితంలో ఒకసారే వస్తుంది..



వారణాసిలో రుద్ర తరహా పాత్ర చేసే అవకాశం ఏ నటుడికైనా జీవితంలో ఒకసారే వస్తుందని సూపర్‌స్టార్ మహేష్‌బాబు అన్నారు. ప్రతి నటుడి జీవితంలో ఒక్కసారి మాత్రమే చేసే సినిమా, పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'వారణాసి' అలాంటిదే అన్నారు మహేష్ బాబు. ఆయన కథానాయకుడిగా ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. ప్రియాంక చోప్రా జోన్స్ కథానాయిక. పృధ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ మూవీ టైటిల్, స్పెషల్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా మహేశ్ బాబు మాట్లాడుతూ తనని, తన సినిమాలను ఆదరిస్తున్న అభిమానులకు చేతులెత్తి నమస్కారం చేశారు. వారి రుణం తీర్చుకోలేనిదని అన్నారు. మిమ్మల్ని (అభిమానులను) కలుసుకుని చాలా రోజులైంది. ఇలా ఈ ఈవెంట్లో కలుసుకోవడం సంతోషంగా ఉంది. నేను నా వరకూ సాధారణంగా వచ్చేస్తానని చెప్పాను. కానీ, దర్శకుడు రాజమౌళి ఇలా స్పెషల్ గా మీ ముందుకు తీసుకొచ్చారు. నాన్న కృష్ణ ఎప్పుడూ నన్ను ఒక మాట అడుగుతూ ఉండేవారు. 'నువ్వు పౌరాణిక పాత్ర చేస్తే చూడాలని ఉంది' అని చాలా సార్లు అడిగారు. ఈ విషయంలో ఎప్పుడూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు నా మాటలు ఆయన వింటూ ఉంటారు. ఆయన ఆశీస్సులు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ప్రాజెక్ట్. దీనికి ఎంత కష్టపడాలో అంతా కష్టపడతా, అందరూ గర్వపడేలా చేస్తా. మరీ ముఖ్యంగా నా దర్శకుడు రాజమౌళి గర్వపడేలా శ్రమిస్తా. 'వారణాసి' విడుదలైనప్పుడు ఈ మూవీ చూసి, యావత్ దేశం గర్వపడుతుంది. ఇది టైటిల్ ప్రకటన మాత్రమే. మున్ముందు ఎలా ఉంటుందో మీ ఊహకే వదిలేస్తున్నా. ఇలా ఎప్పుడూ మీ సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. మీరు చూపే అభిమానానికి 'థ్యాంక్స్' అన్నది చిన్న మాట అవుతుంది. మీరు చూపించే అభిమానం మాటల్లో చెప్పలేను. మీ ఆశీస్సులు, అభిమానం నాతోనే ఉండాలని కోరుకుంటున్నా. ఈ ఈవెంట్ సజావుగా సాగడానికి సహకరించిన పోలీస్ శాఖకు నా ధన్యవాదాలు' అని అన్నారు.

## 15 ఏళ్ల క్రితమే ఖరారు..





సూపర్‌స్టార్ మహేష్, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో సినిమా 15 ఏళ్ల క్రితమే ఖరారయి ఇప్పటికి చిత్రీకరణ జరుగుతోంది. వినటానికి ఆశ్యర్యంగానే ఉన్నా ఇది నిజం. జక్కన్నతో సినిమా కోసం నిర్మాతల 'క్యూ' ఎంత ఉన్నా.. ఆయన మాత్రం కొన్నేళ్ల క్రితం కేఎల్ నారాయణకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. హీరోగా మహేష్ బాబు కూడా అప్పుడే ఎంపికయ్యారు. అలా తెరకెక్కిస్తున్నదే వారణాసి. 'క్షణ క్షణం', 'హలో బ్రదర్, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'సంతోషం'.. ఇలా తక్కువ సినిమాలే రూపొందించినా అభిరుచి ఉన్న నిర్మాత అనిపించుకున్నారు కె.ఎల్. నారాయణ.. 'రాఖీ' తర్వాత వేరే రెండు ప్రాజెక్టులు ఖరారైనా అనివార్య కారణాల వల్ల ఆగిపోయాయి. ఆ సమయంలోనే రాజమౌళి- మహేష్‌తో సినిమాని ఖరారు చేసుకున్నారు. కానీ, దర్శకుడు అప్పటికే వేరే సినిమాలు అంగీకరించి ఉండటం, 'బాహుబలి'లాంటి వాటికి అధిక సమయం వెచ్చించాల్సి రావడం, కోవిడ్.. ఇలా పలు కారణాల వల్ల క్రేజీ కాంబో మూవీ ఆలస్యమవుతూ వచ్చింది. అప్పటికి సినిమా ఫిక్స్ అయ్యారు తప్ప కథ సిద్ధం చేయలేదు. 'ఆర్ఆర్ఆర్' విడుదలయ్యాక రాజమౌళి తండ్రి, రచయిత విజయేంద్ర ప్రసాద్ స్టోరీపై కసరత్తు చేశారు. దీనిపై గత ఏడాది ఒక ఇంటర్వ్యూలో కేఎల్ నారాయణ మాట్లాడుతూ.. రాజమౌళి- మహేశ్ బాబు కాంబినేషన్ సినిమాను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ఇప్పుడు వాళ్లిద్దరి క్రేజ్ మరో స్థాయిలో ఉంది. అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి నాకు సినిమా చేస్తున్నారు. నేను చెప్పకపోయినా 'శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ లో మూవీ తీయనున్నట్లు వాళ్లే రివీల్ చేశారు. వారికి ధన్యవాదాలు. రాజమౌళికి హాలీవుడ్ నుంచి ఆఫర్లు వచ్చినా.. వాటిని కాదనుకుని నా కోసం సినిమా చేస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.

## ఐ-బొమ్మ నిర్వాహకుడు రవి అరెస్ట్




పైరసీ వెబ్‌సైట్ ఐ -బొమ్మ నిర్వాహకుల్లో కీలక వ్యక్తి ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన అతడిని సైబర్ క్రైమ్ పోలీసులు కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకున్నారు. రవి కరేబియన్ దీవుల్లో ఉంటూ ఐ-బొమ్మ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అనంతరం ఆయన అకౌంట్లో ఉన్న రూ.3 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. తెలుగు సినిమాలను పైరసీ చేయడంపై గతంలో ఐ-బొమ్మపై తెలుగు ఫిల్మ్ యాంటీ పైరసీ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులకు ఈ వెబ్‌సైట్ నిర్వాహకులు పోలీసులకు సవాలు విసిరారు. దానిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు వారిపై దృష్టిసారించిన సంగతి తెలిసిందే. గతంలోనూ ఈ వెబ్‌సైట్ కోసం పనిచేస్తున్న ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. బీహార్, ఉత్తర్ ప్రదేశ్‌లో నిందితులను అరెస్ట్ చేశారు.

## హిందూ సనాతన ధర్మం శక్తి పరాక్రమం.. 'అఖండ 2: తాండవం

హిందూ సనాతన ధర్మం శక్తి పరాక్రమాన్ని 'అఖండ 2: తాండవం'లో చూస్తారని అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని తీసుకెళ్లి ఈ సినిమా చూపించాలని కోరారు. బాలకృష్ణ.. దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో రూపొందిన ఈ పాన్ ఇండియా సినిమాని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ముంబయిలో ఈ చిత్ర గీతాన్ని విడుదలచేశారు. "రంగ రంగ శంభు లింగ ఈశ్వర.. అంతరంగా హే భుజంగా శంకర" అంటూ సాగిన ఈ భక్తి పాటకు తమన్ స్వరాలు సమకూర్చారు. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యమందించారు. శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ ఆలపించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. "నాది.. బోయపాటిది విజయవంతమైన కలయిక, మేమిద్దరం కలిసి చేసిన గత మూడు చిత్రాలు విజయవంతమయ్యాయి. ఇది మాకు నాలుగో సినిమా" అన్నారు.

"ఇది కేవలం సినిమా కాదు.. భారతదేశ ఆత్మ. ఇది మన ధర్మం. కుటుంబమంతా కలిసి చూసే సినిమా. దీన్ని మేము అత్యంత శీతల వాతావరణంలో చిత్రీకరించాం. అలాంటి చోట మేమంతా స్వెటర్లు వేసుకుని జాగ్రత్తలు తీసుకున్నాం. బాలకృష్ణ మాత్రం ఓ మామూలు పంచె కట్టుకుని ఉన్నారంతే. అది నటన పట్ల ఆయనకి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. మా వెనుక శివయ్యే ఉండి దీన్ని పూర్తి చేయించాడు" అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఈ కార్యక్రమంలో తమన్, ఆది పినిశెట్టి, కైలాశ్ ఖేర్, గోపీ ఆచంట, హర్షాలి తదితరులు పాల్గొన్నారు.

